ముద్రణ
డిసెంబరు 68

వెల రు. 1-50

vaaradhionline.com

ఆంధ్రా ప్రింటర్స్
విజయవాడ-2

సాయంత్రం అవుతున్నకొద్దీ తుఫాను తీవ్రరూపం దాలుస్తోంది. కుండపోతగా కురుస్తున్న వర్షపు హోరును, ఉరుములతో మెరుపులతో దద్దరిల్లుతున్న ఆకాశాన్ని పరికిస్తే దేవతలకు రాక్షసులకు ఘోరసంగ్రామం జరుగుతున్నట్లుగా ఉంది. నల్లటి మేఘాలు ఆకాశాన్ని కప్పేశాయి. గంగానది గంభీరంగా ఘుర్జిస్తూ ప్రవహిస్తో ది. నది కిరువై పులా ఉన్న చెట్లు ఇటూఅటూ ఊగుతూ భయంకరంగా మూలుగు తున్నాయి.

చందరనాగోర్‌లోని నదిఒడ్డు ఇళ్ళల్లోని ఒకగదిలో భార్యాభర్త లిరువురు కూర్చుని ఒక అతిముఖ్యమైన విషయం మీద చర్చ సాగిస్తున్నారు. ఆ గదిలో దీపం తేజోవంతంగా వెలుగుతోంది.

భర్త శరత్ "నువ్వు మరికొన్ని రోజులు ఇక్కడే ఉండు పూర్తిగా ఆరోగ్యం చిక్కినాక వద్దువుగాని"అన్నాడు.

"నేను పూర్తిగా కోలుకున్నాను. ఇప్పుడు ఇంటికి వెడితే నాకొచ్చే ముప్పేమీలేదు" అన్నది భార్య కిరణ్.

"నువ్వికక్కడ మరికొన్ని రోజులు ఉంటేనే మంచిదని డాక్టరు చెప్పాడు" అన్నాడు శరత్.

"మీ డాక్టరుకు అన్ని విషయాలు తెలుసునా?" కిరణ్ అడిగింది.

"ఆఁ... అంచేతే నువ్విక్కడ ఒకటి రెండు మాసాలుంటే మంచిది. పైగా మఁడూళ్ళో రకరకాల వ్యాధులున్నాయి" అన్నాడు.

"అయితే ఈ ఊళ్లో జబ్బుగల మనుషులే లేరనుకుంటాను" అన్నది కిరణ్.

అసలు విషయం ఇది.

కిరణ్ ఇట్లోను, ఊళ్ళోను అందరిచేతా మంచిదనిపించుకుంది. అంచేత ఆమెకు ప్రయోజనకరమైన జబ్బు చెయ్యగానే అందరూ ఆందోళన పడసాగారు. గాలి మార్పిడికోసం ఆమెను చందరనాగోర్ తీసుకొచ్చారు. కమంగా ఆమె కోలుకుంది. ఆమె గ్రామానికి ఎప్పుడు తిరిగి వస్తుందా అని గ్రామస్థులంతా ఎదురు చూస్తున్నారు. కాని శరత్, అతని తల్లి-ఆమెను మరికొన్ని రోజులు పూర్తిగా ఆరోగ్యం పొందే వరకు అక్కడే ఉంచాలని పట్టుదలగా ఉన్నారు. కాని కిరణ్‌కుమాత్రం అక్కడ ఉండటం ఎంతమాత్రం ఇష్టంలేదు. అందుచేత శరత్ ఆమెకు నచ్చజెప్పడానికి అక్కడకు వచ్చాడు. కిరణ్ కొంతవరకు కోలుకున్నా పూర్తి బలాన్ని మాత్రం పొందలేదు. ఆమె బలహీనమైన ముఖాన్ని చూస్తుంటే ఎంతటి భయంకరమైన మృత్యువును ఆమె కొద్దిలో తప్పించుకోగలిగిందో అర్థం అవుతుంది.

కిరణ్ అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడేమనిషి. నదిఒడ్డు బంగళాలోని ఒంటరి జీవితం ఆమెకేమీ నచ్చలేదు. ఆమె చెయ్యడానికేమీ పని ఉండేదికాదు. మాట్లాడడానికి ఇరుగు పొరుగు ఎవరూలేరు. రోజంతా మందులు మాకులు

వేసుకుంటూ !కూర్చోవడం ఆమెకు అసహ్యమనిపించింది. ఆ తుఫానునాటి సాయంత్రం గదిలో కూర్చుని వాళ్ళిద్దరూ చర్చించింది ఈ విషయాలనే.

కిరణ్ వాదించిన కొద్దీ వాదం ఇంకా పెరుగుతూనే ఉంది. ఆమె సమాధానం చెప్పకుండా ఊరుకున్నప్పుడు అతడు విసిగి ఇక తన ఓటమిని ఒప్పుకోవడానికి సిద్ధపడేవాడు.

అతడు తన ఓటమిని ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో బయటనుంచి సేనకుడు తలుపుతట్టి పిలిచాడు.

శరత్ తలుపు తెరచాడు. తుఫానుకు నదిలో పడవ మునగగా అందులో ఉన్నవారిలో ఒక బ్రాహ్మణ బాలుడు ఈదుకుంటూ బంగళావద్ద ఒడ్డుకు చేరాడని సేవకుడు చెప్పాడు.

కిరణ్ వెంటనే అక్కడనుండి లేచి కుర్రవాడికి పొడి బట్టలు తేవడానికి లోనికి వెళ్ళింది కుర్రవాణ్ణి తన గదిలోకి తీసుకెళ్ళి ఒక కప్పుపాలు ఇచ్చింది.

ఆ బాలుడు అందంగా ఉన్నాడు, పొడుగాటి ఉంగరాల జుత్తు. సోగకళ్ళు చూడముచ్చటగా ఉన్నాయి. కిరణ్ అతన్ని గురించిన సమాచారం యావత్తూ అడిగి తెలుసుకుంది.

అతనిపేరు నీలకాంత్, అతడో డ్రామా కంపెనీకి చెందినవాడు. ఆ పక్కవూళ్ళో నాటకం ఆడడానికి కంపెనీ అంతా తరలివస్తుండగా నదిమధ్యలో పడవ మునిగిపోయింది. అతని సహాచరు లేమయిందీ అతనికి తెలియదు. అతడు మాంచి గజ ఈతగాడు. అంచేత క్షేమంగా ఒడ్డుకు చేరుకోగలిగాడు.

అతడు వాళ్ళతోనే కలిసి ఉంటున్నాడు. తృటిపాటిలో చావును తప్పించుకో గలిగినందుకు కిరణ్ అతనిపై ప్రత్యేక ఆదరాభిమానాలను ప్రదర్శించసాగింది. బాలునిరాక శరత్‌కుకూడా ఒకవిధంగా సంతోషాన్ని కలుగజేసింది అతని భార్యకు బాలునితో కాలక్షేపం అవుతోంది. అంచేత ఆమె అక్కడ మరికొంతకాలం ఉండగలుగుతుందని అతనిఆశ. ఆమె అత్తగారు కూడా బ్రాహ్మణ బాలుని రాకకు సంతోషించింది. ఇక నీలకాంత్ విషయం చెప్పనే అవసరంలేదు. డ్రామా కంపెనీ యజమాని భారినుండి తప్పించుకో గలిగినందుకు సంబర పడ్డాడు. ధనవంతుల ఇంట్లో ఆశ్రయం దొరికినందుకు అతని సంతోషానికి అవధి లేకుండా ఉంది. ఒక్కతాపు తన్నితే వెళ్ళి బూరెల బుట్టలో పడినట్లుగా ఉంది అతని పని.

కాని శరత్, అతని తల్లి బాలునిమీద తమకున్న అభిప్రాయాల్ని మార్చుకోడానికి ఎన్నో రోజులు పట్టలేదు. అతడు దొంగచాటుగా శరత్ హుక్కా పట్టుకు పీల్చేవాడు. వర్షం కుండపోతగా పడుతున్నా సరే లెక్కచెయ్యకుండా శరత్ సిల్కు గొడుగు వేసుకొని వూరంతా తిరిగేవాడు. అక్కడ అలగాజనం అందరితోటీ స్నేహాలు చేసేవాడు. వీధి కుక్క నొకదాన్ని మచ్చికచేసి దాన్ని శరత్ పట్టుపరుపు పై దొర్లనిచ్చేవాడు. ఆది పరుపుమీద బురదకాళ్ళతో ఇష్టం వచ్చినట్లు తొక్కేది అతడు తనతో పిల్లల దళాన్ని వెంటేసుకెళ్ళి మామిడి తోపులమీద పడేవాడు. ఆ వూళ్లో ఒక్క మామిడిపండు ఉండని స్తే ఒట్టు.

నీలకాంత్‌ను పాడుచెయ్యడంలో కిరణ్‌కు ప్రధాన పాత్ర ఉందనడంలో సందేహంలేదు. శరత్ ఆమె కా విషయాన్ని గురించి చాలసార్లు చెప్పి చూశాడు, కాని ఆమె శరత్ మాటలను ఖాతరు చెయ్యలేదు.

నీలకాంత్‌కు కొత్తబట్టలు కొనిపెట్టింది కిరణ్. అతని మీద ప్రేమకొద్దీ అతన్ని తన గదిలోకి పిలుపించుకొని అతని విషయాలన్నీ శ్రద్ధగా తెలుసుకునేది ఆమె స్నానంచేసి భోజనం చేశాక ఎత్తుపీటమీద కూర్చునేది. దాది ఆమె తల ఆరబెట్టి దువ్వేది. నీలకాంత్ ఆమె కెదురుగా నిలబడి తనకు గుర్తున్న డ్రామా సంభాషణలు, పాటలు గొంతెత్తి వినిపించేవాడు. అలా మధ్యాహ్నమంతా కాలక్షేపం జరిగిపోతుండేది. శరత్‌ను కూడా అక్కడ కూర్చోమని కిరణ్ బలవంత పెడుతుండేది. కాని నీలకాంత్‌మీద ఉన్న అయిష్టత కొద్దీ అతడందుకు అంగీకరించేవాడు కాదు, ఒకవేళ ఎప్పుడైనా వచ్చి కూర్చున్నా అతన్ని చూడగానే నీలకాంత్ గొంతు పెగిలేది కాదు.

నీలకాంత్ వయస్సు ఎంత ఉంటుందో సరిగ్గా చెప్పలేం. బహుశా పదహారు సంవత్సరాలుండొచ్చు. అతడు చిన్నప్పుడే డ్రామా కంపెనీలో చేరాడు: రాధిక, దమయంతి, సీత- పాత్రలన్నీ ధరించాడు. అక్కడితో అతని ఎదుగుదల ఆగిపోయింది.

నీలకాంత్ వయస్సుకు తగిన గౌరవాన్ని ఎప్పుడూ పొందలేదు. ఆతడు చూపులకు చిన్న పిల్లవాడిలా అగుపించేవాడు. పొగ్గతాగడంవల్ల అతని పెదాలు నల్లబడి మొర

ుగా కనుపించేవి. కాని అతని హృదయం బాల్యావస్థను ఇంకా దాటిపోలేదు. కిరణ్ అతన్నింకా బాలునిగానే పరిగణించడం అతనికి సిగ్గుగా ఉండేది. ఆమె అతన్నొకసారి స్త్రీ వేషం ధరించమని అడిగినప్పుడు అతని ఒళ్ళు గగుర్పొడిచింది. ఎందుకనోగాని స్త్రీలాగా వేషం వేసుకోవడమంటే అతనికి అసహ్యా మేర్పడింది. తన పాతవేషాలు ధరించమని అడిగినప్పుడు అతడక్కడనుండి పారిపోయేవాడు.

నీలకాంత్‌కు చదువు చెప్పడానికి ఓ మాష్టరును ఏర్పాటుచేశారు. మాష్టరు ఎంతమొత్తుకున్నా నీలకాంత్ బుర్రలోకి ఒక్క అక్షరమైనా ఎక్కేదికాదు. అతనికి స్థిరంగా ఒకచోట కూర్చోవడం అలవాటులేదు. అతని కళ్ళకు అక్షరాలు నృత్యం చేస్తున్నట్లుగా ఉండేయి. గంగానది ఒడ్డున ఒళ్ళో పుస్తకం పెట్టుకొని కూర్చునేవారు.

నీటిలో పడవల ప్రయాణం, ఆకాశంలో పక్షుల కిలకిలలు అతనికి గిలిగింతలు పెట్టేవి ఒక అక్షరాన్ని దాటి ఎప్పుడూ ముందుకు వెళ్ళేవాడుకాదు. కాని ఎప్పుడూ చదువుతున్నట్టుగానే కనిపించేవాడు. పడవ దగ్గరకు రాగానే పుస్తకం పైకెత్తి బిగ్గరగా చదివేవాడు. పడవ మటుమాయ మవగానే అతని చదువుకూడా ఆఖరయేది.

శరత్‌కు ఓ తమ్ముడున్నాడు. అతని పేరు సతీష్. సతీష్ కాలేజీ శలవులకు చందన నాగోరు వచ్చాడు. అతని రాక కిరణ్‌కు మరింత సంతోషాన్ని కలుగజేసింది. వారిద్దరికీ ఒకే ఈడు ఉంటుంది. ఆటపాటలతో కాలం వేగంగా గడిచిపోతోంది.

సతీష్ వచ్చిందగ్గర్నుంచి నీలకాంత్. గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లుగా ఉంది. అతని హృదయంలో ఎవరి మీదనో కసి తీర్చుకోవాలనే భావం నానాటికి బలపడుతోంది. తన దళంలోని కుర్రాళ్ళని ఉత్తిపుణ్యానికి పట్టుకొని చితకొట్టేవాడు పెంపుడు కుక్కను కిమ్మోమ్మోరో అనేదాకా చావమోదేవాడు.

నీలకాంత్ తిండి విషయంలో మాత్రం మొహమాట పడేవాడు కాదు! రోజూ కిరణ్ అతను భోజనం చేసేదాకా అతనిముందు కూర్చునేది. అతనికి మంచి ఆహారాన్ని ఇవ్వడంలో ఎంతో శ్రద్ధ తీసుకునేది. కాని సతీష్ వచ్చిందగ్గర్నుంచి ఆమెకు నీలకాంత్ దగ్గరకు వచ్చి కూర్చోవడానికి వ్యవధి చిక్కడంలేదు.

కిరణ్ దగ్గర లేకపోవడంచేత నీలకాంత్ సరిగా అన్నం తినలేక పోతున్నాడు అర్ధాకలిలోలేచి "నాకేం ఆకలిగాలేదు" అని కళ్ళనిండా నీళ్ళు నింపుకొని వంట మనిషితో చెప్పేవాడు. ఈ మాటలు కిరణ్ చెవినిపడగానే ఆమె తనను బతిమాలుతుందని కలలు కన్నాడు. కాని అటువంటి దేమీ జరుగలేదు. ఈ విషయం కిరణ్‌కు అసలు తెలియనే తెలియదు. అతడు వదిలిపెట్టిన పదార్థాలన్ని వంటమనిషి సుష్టుగా భోంచేసేది. ఇక అతడు దీపం ఆర్పేసి పరుపుమీద కూలబడేవాడు ఆ చీకట్లో తలగడలో ముహం దాచుకొని వెక్కి-వెక్కి ఏడ్చేవాడు. అసలతని దుఃఖం ఏమిటి? ఎవరిమీద? ఎవరినుంచి తను ఉపశాంతి కోరుతున్నాడు? ఏమో! ఎవరికీ తెలియదు.

అఖరికి తల్లి లేని కుర్రాడి గాయపడిన హృదయం నిద్రామాత్ర మృదు స్పర్శకు విశ్రమించేది.

సతీష్ తనమీద అపవాదులు చెవాకులు కల్పించి కిరణ్ మనస్సును విరిచేస్తున్నాడనే నిర్ణయానికి వచ్చాడు నీలకాంత్. కిరణ్ మునుపటిలాగా తనతో ఆట్టే మాట్లాడక పోవడం అతని అనుమానానికి మరింత బలాన్ని చేకూర్చింది. వచ్చే జన్మలో తనను సతీష్‌గాను, సతీష్‌ను తనుగాను, చెయ్యమని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాడు బ్రాహ్మణశాపం వృధా పోదని అతని నమ్మకం.

సతీష్‌మీద ఉన్న క్రోధాన్ని అతడెప్పుడూ బయటకు వెళ్ళగక్కలేదు. అనేక ఇతర మార్గాలద్వారా దానిని వెలి బుచ్చేవాడు. సతీష్ నదికి స్నానానికి వెళ్ళినప్పుడు అతని సబ్బుతీసి కనపడకుండా దాచేసేవాడు అన్నీ ఇలాంటి పనులే చేసేవాడు.

ఇలా కొన్ని రోజులు గడచిపోయాయి. అఖరికి వాళ్ళు అక్కడనుండి వెళ్ళిపోయే రోజు దగ్గరపడింది. ఇంట్లో అంతా సామాన్లు సర్దడంలో మునిగిఉన్నారు. సతీష్ కూడా వాళ్ళతో వెళ్ళిపోతున్నాడు. కాని నీలకాంత్‌తో ఎవరూ మాట్లాడ లేదు. అతడు వారితో వెళ్లేదీ లేనిదీ ఎవరికి పట్టినట్టులేదు.

కిరణ్ ఆ ప్రస్తావనను ముందుగా తీసుకొచ్చింది. నీల కాంత్‌ను కూడా తీసుకెడదామని ఆమె భర్తతో అన్నది. కాని భర్త, అత్త, మరిది- అందరూ ఒకేమాటమీద నిల బడి అలా జరగటానికి వీలు లేదన్నారు. అంచేత కిరణ్ ఆ ప్రస్తావనను ఇక విరమించుకోవలసి వచ్చింది. వాళ్ళు

అక్కడనుండి మరి రెండు రోజులకు వెళ్ళిపోతారనగా ఆమె కార్తవాణ్ణి పిలిపించింది. తిరిగి అతన్ని ఇంటికి వెళ్ళిపొమ్మని బుజ్జగిస్తూ చెప్పింది.

ఈ జాలికరమైన మాటలను నీలకాంత్ భరించలేక పోయాడు. కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. కిరణ్ కళ్లు చమ్మగిల్లాయి. తను సృష్టించిన ప్రేమబంధాన్ని తలచుకొంది. ఇప్పుడా బంధాన్ని తెగ తెంపులు చేసుకోవలసి వచ్చినందుకు విచారించింది.

సతీష్‌కు ఈ వ్యవహారమే నచ్చలేదు. "దుక్కపోతులా ఉన్నావు. విషయమేమిటో చెప్పలేవూ? అలా ఏడుస్తావెందుకు?" అన్నాడు.

కిరణ్ అతన్ని వారించింది.

కాని సతీష్ ఆక్కడితో ఊరుకోలేదు. "వదినా నీకేం తెలియదు. నల్లనివన్ని నీళ్ళని, తెల్లనివన్ని పాలని అనుకుంటావు. వీడెక్కడ పుట్టాడో ఎవరికీ తెలియదు కాని ఇక్కడ మహారాజ భోగం అనుభవిస్తున్నాడు. "సింహం తిరిగి చిట్టెలక కావడానికి ఒప్పుకోదు" అన్నాడు.

నీలకాంత్ వెంటనే అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. తన దగ్గర కత్తిఉన్నట్లయితే సతీష్‌ని ముక్కలకింద తరిగేవాణ్ణనుకున్నాడు

సతీష్ కలకత్తానుంచి వచ్చేటప్పుడు ఒక చక్కటి ఇంక్ స్టాండ్ తీసుకొచ్చాడు. దానిమీద అందమైన జర్మన్ సిల్వర్ హంసకూడా ఉంది. అదంటే అతనికి పంచప్రాణాలు. రోజూ సిల్కు రుమాలుతో దాన్ని జాగ్రత్తగా తుడిచేవాడు.

వాళ్ళు అక్కడనుంచి వెళ్ళబోయే ముందు రోజున ఇంక్ స్టాండు కనిపించలేదు. కిరణ్ నవ్వి అన్నది "మరిది, నీ హంస దమయంతిని చూట్టానికి వెళ్ళింది"

సతీష్‌కు ఒళ్లు మండుకొచ్చింది. దాన్ని నీలకాంత్ దొంగిలించాడని అతనికి గట్టినమ్మకం ఏర్పడింది.

నీలకాంత్‌ను అక్కడకు పిలిపించారు. "నా ఇంక్ స్టాండ్ దొంగిలించావు నువ్వు. దాన్నెక్కడ పెట్టావో తీసుకురా" కోపంతో అరిచాడు సతీష్. కిరణ్ ముందు పట్టుకొని తనని దొంగఅని పిలవడం నీలకాంత్‌కు తల కొట్టేసినట్లు యింది. అతని కళ్ళు చింతనిప్పుల్లా మెరిశాయి. సతీష్ మరొక్కమాట అన్నట్లయితే అతనిమీద పులిలా దూకి గోళ్ళతో గుచ్చి వదిలేవాడే.

ఈ దుస్సంఘటనకు కిరణ్ చాల మదన పడింది. అతన్ని మరొక గదిలోకి తీసుకెళ్ళి మార్దవంగా అడిగింది. "నీలూ, నిజంగా నువ్వు ఇంక్ స్టాండ్ తీసినట్లయితే నా కిచ్చెయ్యి. ఆ విషయం మరెవర్నీ ప్రస్తావించకుండా చేస్తాను" అన్నది.

నీలకాంత్ చెక్కిళ్ళనుండి కన్నీరు ప్రవహించింది. అతడు చేతుల్తో ముఖాన్ని కప్పుకొని బిగ్గరగా ఏడవడం మొదలెట్టాడు. కిరణ్ గదిలోంచి బయటకువచ్చి అన్నది. "నీల కాంత్ ఇంక్ స్టాండ్ తియ్యలేదు. దాన్ని నీలకాంత్ దొంగిలించాడని శరత్, సతీష్, ఇద్దరూ గట్టిగా వాదించారు.

కాని వారి మాటలను కిరణ్ ఏమాత్రం నమ్మలేదు.

కుక్కరాణ్ణి ప్రశ్నించడానికి శరత్ ప్రయత్నించాడు. కాని కిరణ్ అందుకు ఒప్పుకోలేదు.

కుక్కరాడి గది వెతకాలని సతీష్ సూచించాడు.

"అటువంటి పనిగనుక నువ్వు చేశావంటే నిన్ను నా జీవితంలో క్షమించను. ఒక నిరుపేద అమాయక బాలుని పట్ల అంత అమర్యాదకరంగా ప్రవర్తించకూడదు" అన్న దామె, ఇలా అంటుండగానే ఆమె కళ్ళు నీటితో నిండాయి. ఇక అక్క-డితో ఆ విషయం ఆఖరయింది

నిరాశ్రయుడైన బాలుని మీద మమకారంతో కిరణ్ హృదయం తొణికిసలాడింది. రెండు కొత్తసూట్లు, ఒక జత జోళ్ళు, ఒకవంద రూపాయలనోటు చేతి పుచ్చుకొని ఆమె నెమ్మదిగా నీలకాంత్ గదిలోకి ప్రవేశించింది. ఈ కానుకల్ని అతనికి తెలియకుండా అతని పెట్టెలో పెట్టాలని ఆమెఉద్దేశం. అతని పెట్టె కూడా ఆమె ఇచ్చిన కానుకే.

ఆమె తనతాళాల గుత్తిలోంచి ఒక తాళంచెవి తీసి పెట్టి తెరచింది. పెట్టినిండా రకరకాల వస్తువులున్నాయి. ఆమె తెచ్చిన కానుకలు అందులో పట్టలేదు అంచేత ఆమె అందులోని సామాన్లన్నీ తీసి సరిగా సర్దటానికి ఉపక్రమించింది. చాకులు, గాలి పరుపు, దారపువుండలు– ఇంకా రకరకాల వస్తువులు బయటపడ్డాయి అన్నిటికంటే అడుగున కాగితపు చుట్టలో ఇంక్ స్టాండు, హంస కనిపించాయి.

కిరణ్ ఇంక్ స్టాండును చేత్తోపట్టుకొంది. నిర్విణ్ణురాలై అలాగే చాలసేపు దీనంగా చూస్తూ కూర్చుండిపోయింది.

ఈలోగా కిరణ్‌కు తెలియకుండా నీలకాంత్ ఆ గదిలోకి ఆమె వెనకాలే వచ్చాడు. అతడు జరిగిందంతా కళ్ళారా చూశాడు. ఆమె తన నోక దొంగగా భావించి పట్టుకోవడానికి వచ్చిందనుకున్నాడు. అతని దో గతనం పట్టుపడింది. తను దొంగకాదని, కేవలం కష్టతీర్చుకోవడం కోసమే ఇంక్ స్టాండ్‌ను తీశానని, అవకాశం దొరగ్గానే దాన్ని నదిలో పారేద్దామనుకున్నానని అతడు చెబితే ఎవరైనా నమ్ము తారా? కాని నిజంగా అతడు దాన్ని తీసింది అందుకోసమే. అతనిలో ఏదో బలహీనత ప్రకోపింపగా దాన్ని నదిలో విసరి వెయ్యడానికి మారు తాత్కాలికంగా పెట్టెలో పెట్టాడు. "నేను దొంగను కాదు. ముమ్మాటికీ కాదు "అతని హృదయం నోక్కి చెప్పింది. అయితే తనేమిటి? ఏం చెప్పగలడు? తను దొంగిలించి దొంగను కాదని చెప్పగలడా? కిరణ్ తనను సరిగా అర్థం చేసుకోలేదని ఎట్లా చెప్పగలడు? ఆమె తన నేరాన్ని పట్టుకోవడానికి వచ్చిందనే భావాన్ని అతడెలా మర్చిపోగలడు?

ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి కిరణ్ ఆ ఇంక్ స్టాండును తిరిగి పెట్టెలో పెట్టేసింది. ఇప్పుడు తనే దొంగలా యథాతథంగా దానికి కాగితం చుట్టింది, పెట్టి సర్దింది. తన కానుకలుకూడా అందులో ఉంచింది. వంద రూపాయలనోటు కూడా అందులోనే పెట్టింది.

ఆ మర్నాడు నీలకాంత్ ఎక్కడా కనిపించలేదు. గ్రామస్థులెవరూ అతన్ని చూడలేదు, పోలీసులు, అతని పత్తాను కనుక్కోలేకపోయారు.

చివరికి శరత్ అన్నాడు. "అతని పెట్టిలో ఏము న్నాయో తెర్చి చూద్దాం."

కాని కిరణ్ అందుకు సుతరామూ ఒప్పుకోలేదు.

ఆ పెట్టెని ఆమె తన గదిలోకి తీసుకొచ్చింది. అందు లోంచి ఇంక్ స్టాండు తీసి నదిలోకి విసిరివేసింది.

వారంతా స్వగామానికి వెళ్ళిపోయారు. ఆ బంగళా లోని తోట నిర్మానుష్యంగా వుంది. ఇక మిగిలిందల్లా నీల కాంత్ పెంపుడుకుక్కమాత్రమే అది నీలకాంత్ కోసం దుఃఖంతో పిచ్చిదానిలా నది వొడ్డున తారట్లాడుతోంది.

చారిత్రక సత్యం

నేను, మా బంధువు తీర్థయాత్ర ముగించుకొని రైల్లో కలకత్తా వస్తున్నాం. మా పక్కన ఓ ప్రయాణీకుడు కూర్చున్నాడు అతని వాలకం. జేబురుగడ్డం చూస్తుంటే అచ్చం మహమ్మదీయుడులా ఉన్నాడు. కాని అతడు మాట్లాడుతోంటే మేం చూసి విస్తుపోయాం. ప్రపంచంలో అన్ని విషయాలగురించి క్షుణ్ణంగా తెలిసినవాడిలా మాట్లాడాడు. మేం చాలా విషయాలు అతనిదగ్గర కొత్తగా నేర్చుకున్నాం. రష్యావాళ్లు మన సరిహద్దులదాకా వచ్చి మనమీద విరుచుకు పడటానికి సిద్ధంగా వున్నారని, స్వదేశీ సంస్థానాధీశులు బ్రిటీషువాళ్ళకు వ్యతిరేకంగా రహస్యంగా కుట్రలు జరుపుతున్నారని మొట్టమొదటిసారిగా అతని నోటివెంట మేం విన్నాం.

మా రైలు మిత్రుడు ఇంకా ఇలా అన్నాడు. "ఈ ప్రపంచంలోను, స్వర్గంలోను అనుదినం అనేక సంఘటనలు జరుగుతూ వుంటాయి. అందులో కొన్ని మీరు వార్తా పత్రికలద్వారా వినే వుంటారు."

మేం ఎప్పుడూ ఇల్లు కదిలి బయటకొచ్చిన పాపాన పోలేదు. అంచేత అతని విషయజ్ఞానానికి అబ్బుర పడిపోయాం

ముక్కుమీద వేలేసుకున్నాం. అతడు సైన్సును గురించి, వేదాల్ని గురించి, ఉపనిషత్తుల గురించి, పర్షియన్ సాహిత్యాన్ని గురించి ఒక్కటేమిటి అన్ని విషయాలమీద అనర్గళంగా తన అభిప్రాయాల్ని వ్యక్తపర్చాడు. అతనిమీద మా ప్రేమ ఇనుమడించింది. నా బంధువు దివ్యజ్ఞాన మండలి సభ్యుడు కావడంచేత బహుశా మాతోటి ప్రయాణీకుడు ఏదో దివ్యశక్తిని పొందినవాడై వుండాలని అంచనా కట్టాడు. నా బంధువు అతని నోటివెంట వచ్చే ప్రతిమాటను ఎంతో జాగ్రత్తగా విని రహస్యంగా అతను చెప్పేదంతా నోట్సు రాసుకున్నాడు. ఆ దివ్యజ్ఞానవ్యక్తి ఇదంతా చూసి లోలోన నవ్వుకున్నాడని నే పసికట్టాను.

రైలు జంక్షన్‌లో ఆగగానే మేం మరోబండి కనక్షన్ కోసం ఎదురు తెన్నులు చూస్తూ వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నాం రాత్రి పది గంటలయింది. రైలు చెడిపోవడం వల్ల మా బండి చాలా ఆలస్యంగా వస్తుందని తెలిసింది. టేబుల్‌మీద పక్కపు పరచుకొని పడుకోడానికి సిద్ధపడుతున్న సమయంలో ఆ దివ్యజ్ఞానవ్యక్తి నా పక్కన కూచుని తకిలీతో దారం వడక నారంభించాడు. ఆ మోతకు నాకా రాత్రి నిద్రపడితే ఒట్టు.

పరిపాలనా విధానంలోని కొన్ని సమస్యలమీద అభిప్రాయ భేదాలొచ్చి జునాగడ్‌లోని నా పదవికి రాజీనామా యిచ్చాను. ఆ తరువాత హైదరాబాదు నిజాం సంస్థానంలో చేరాను. వాళ్ళు నన్ను బారిచ్ అనే ఓఊళ్ళో పత్తిపన్ను కలక్టరుగా వేశారు.

బారిచ్ చాల అందమైన ప్రదేశం. దానికి చుట్టూ కొండలూ, చిట్టడవులు వున్నాయి. అక్కడికి వెళ్ళడానికి సరైన మార్గంకూడా లేదు. అక్కడ నదిబడ్డుకు నూటయాభై అడుగుల దూరంలో కొండల నడుము ఓ ప్రభామండలమైన భవంతి కొట్టొచ్చినట్టుగా కనబడుతుంది. అక్కడేమి జన సంచారం లేదు. బారిచ్ గ్రామం, పత్తి అంగళ్ళు అక్కడకు చాలా దూరంలో వున్నాయి.

250 సంవత్సరాల క్రితం రెండవ మహమ్మద్‌షా చక్రవర్తి కట్టించిన భవనమది. తన విలాసార్థం అతడీ ఏకాంత సౌధాన్ని నిర్మించాడు. అతని కాలంలో అక్కడ నీటి పొంగెన్లు అందంగా నీళ్ళు చిమ్మేవి. అక్కడ సుందరమైన కొలనుల్లో పర్షియన్ యువతులు స్నానాలు చేసేవారు.

ఇప్పుడు పొంగెన్ లేమీలేవు, కొలనుల్లో ఎవరూ స్నానం చెయ్యడంలేదు. మాలాంటి పన్ను కలక్టర్లకదిప్పుడు నివాస స్థానంగా వుంది. మా ఆఫీసులోని తల నెరిసిన గుమాస్తా కరీంఖాన్ నన్నక్కడ మకాం వుండొద్దని పదేపదే చెప్పాడు, మీ కంతగా వుండాలని వుంటే పగలక్కడ గడపండి. కాని రాత్రిమాత్రం అక్కడుండొద్దు" అన్నాడు. నే నొకసారి నవ్వేసి ఊరుకున్నాను. నౌకర్లు కూడా అలాగే చెప్పారు. చీకటిపడితే ఆఇంటి చుట్టుపక్కల దొంగలుకూడా తిరగరు. ఆ ఇంటి కటువంటి పేరుంది. కాని నేనక్కడే వుండటానికి నిశ్చయించుకొన్నాను.

మొదట్లో నాకా ఒంటరితనంలో ఏమీ తోచేది కాదు. పగలంతా బయటకెళ్ళి కష్టపడి పని చేసేవాణ్ణి. అలసి సొలసి రాత్రికి ఇంటికి చేరుకోగానే వెంటనే నిద్ర పట్టేసేది.

ఓ వారం రోజులు పోయింతరువాత ఆ ప్రదేశమంతా నన్ను లోబరచుకుంటున్నట్టుంది. ఆ ఇంట్లో ఏదో సజీవశక్తి నన్ను మంత్రప్రభావ ముగ్ధుణ్ణిగా చేసేసి క్రమంగా లోబరచుకొంది. ఇలా అని చెబితే నిజంగా లోకులు నన్ను నమ్మరు.

అప్పుడే వేసవి ప్రారంభమయింది. మార్కెట్టు మందంగా వుండడంచేత నాకంత పెద్దగా పనేమీలేదు. సూర్యాస్తమయానికిముందు నీటికొలను మెట్లపక్కన కుర్చీలో కూచున్నాను. నీటిమీద సంజకెంపుల సోయగాన్ని తిలకిస్తున్నాను. కొండలమీద చెట్ల సువాసల్ని గాలితెరలు మోసుకొస్తున్నాయి.

పశ్చిమకొండల శిఖరాగ్రాల్లో సూర్యుడస్తమించాడు వెలుగనే వేదికమీద ఓ విశాలమైన చీకటితెర పడింది. గుర్రంమీద స్వారీచేదామని అక్కడనుంచి లేవబోతున్నాను. అంతలో మెట్లపైనక ఎవరివో పాదాల చప్పుడు వినిపించి వెనుదిరిగి చూశాను. కాని అక్కడెవరూ కనిపించిలేదు.

ఒకవేళ నేనేమైనా భ్రాంతి చెందానేమోనని అక్కడే తిరిగి కూచున్నాను. ఇంతలో ఆ మెట్లమించి చాలామంది పరుగెత్తుకుపోతున్న శబ్దం వినిపించింది. ఓ వింతైన ఆనందం నన్నావరించింది. నాకళ్ళముందెవరూ కనిపించకపోయినా, అనేకమంది యువతులు ఆ వేసవి సాయంత్రం కొలనులో

స్నానం చెయ్యడానికి ఆనంద కోలాహలంతో మెట్లు దిగుతున్నట్లు చూశాను. అక్కడంతా నిశ్శబ్దంగా వుంది. నదిలో కాని, భవంతిలోగాని ఆ చుట్టుపక్కలకాని ఎక్కడా అలికిడైనశబ్దం రావడంలేదు. కాని నవ్వుతూ, పేలుతూ నాముందు నించి యువతులు నన్ను చూడకుండా ఒకళ్ళ వెనకాల ఒకళ్లు తరుముకుంటూ నీటిలోకి దూకడంమాత్రం స్పష్టంగా వినిపిస్తోంది. నాకు వాళ్ళు కనిపించడంలేదు. వాళ్ళు నన్ను చూడ్డంలేదు. కొలను ప్రశాంతంగావుంది. కాని ఒక్కసారే ఆ ప్రశాంతత అంతరించి ఆ ప్రదేశమంతా యువతుల నవ్వులతో నిండింది. దబ్బునుని నీట్లో దుముకుతూ, ఒకళ్ళమీది ఒకళ్ళు నీళ్ళు చిమ్ముకుంటూ ఆటలాడుకుంటున్నారు.

నా గుండె ఝల్లుమన్నది. అందుక్కారణం భయమో సంతోషమో, ఆదుర్దాయో నాకు తెలీదు. వాళ్ళను మరింత స్పష్టంగా చూడగలిగితే బాగుండు ననుకున్నాను. కాని నాముందేనీరూ కనుపించలేదు. నా చెవులు రిక్కించివించే స్పష్టంగా వినబడుతుందేమో అనుకున్నాను. కాని ఆ ప్రయత్నమూ విఫలమయింది. రెండువందల యాభై సంవత్సరాల నాటి చీకటితెర నాముందు వేలాడుతున్నట్టుంది. సంతోషంతో ఒణుకుతూ ఓమూల దాన్ని పైకెత్తి తొంగి చూశాను.

ఆ నిశ్శబ్ద ఒంటరి సాయంత్రాన్ని చీల్చుకొని వెన్నుగాలి విజృంభించింది. రెండవందల యాభై సంవత్సరాల నాటి స్వప్నదృశ్యాలు మెరుపులా మెరిసిపోయాయి.

నా ఒంటరితనాన్ని గమనించి ఏదైనా పిశాచం నన్ను పట్టుకుందేమోనని భయపడ్డాను. సరైన ఆహారం లేకపోతే ఇలాంటి అనర్థాలన్నీ ముంచుకొస్తాయేమోనని వంటమనిషిని పిలిచి, మంచి మొగలాయీ భోజనం తయారు చెయ్యమని ఆజ్ఞాపించాను. T3141.44 3/TAGK

ఆ మర్నాడు నా హృదయం కొంత తేలికపడింది. సాయిబుల టోపీ పెట్టుకొని, గుర్రపుబగ్గీ ఎక్కి పనిలోకెళ్లాను. ఆ వేళ నా మూడుమాసాల రిపోర్టు రాసి పంపించాల్సివుంది. అంచేత ఆవేళ ఇంటికొచ్చేసరికి చీకటి పడుతుందనుకున్నాను. కాని విచిత్రం. చీకటి పడకుండానే ఇంటికి వచ్చేశాను. అలా ఎందుకొచ్చానో నాకే తెలియదు. వాళ్ళంతా నాకోసం నిరీక్షిస్తుంటారని, అంచేత ఆలస్యం చెయ్యగూడదని వచ్చేశాను. నా రిపోర్టు పూర్తి కాకుండానే వదిలిపెట్టేసి ఇంటికి చక్కాపచ్చాను.

మొదటి అంతస్థులోని మెట్లు ఓ విశాలమైన హాలులోకి తీసుకెళ్ళాయి. అక్కడ స్తంభాలు మూడు వరుసలుగా నిలబడివున్నాయి, అప్పుడే చీకటి పడింది. ఇంకా దీపాలు వెలిగించలేదు. నే తలుపు బార్లా తియ్యగానే అక్కడిజనం నన్ను చూసి కంగారుగా ద్వారంగుండా, కిటికీలగుండా, వరండాల్లోంచి, గదుల్లోంచి పారిపోతున్నట్లనిపించింది.

నే పరికించి చూశాను. కాని ఎవరూ నా కంటికి కనిపించలేదు. ఆ విశాలమైన హాల్లో స్తంభాల మధ్యన చీకట్లో నించొని చలవరాళ్ళపైన పడుతున్న ఫౌంటెన్ల నీళ్ళ తుషార్లను, వీణమీద ఆలాపిస్తున్న రాగాలను, గాజుల గల

గలలను, అందెల ఘలంఘలలను, గంటల గణగణా రావాల్ని దూరాన్నుంచి వినిపిస్తున్న కోయిల పాటని, వసారాలోని పంజరంలో వున్న బుల్‌బుల్ పాటల్ని వింటున్నాను. ఇవన్నీ నాకో అలౌకికానందాన్ని చేకూర్చాయి.

మంత్రముగ్ధంగా ఏదో మాయలోపడి ఈ ప్రపంచ మంతా అబద్ధమని ఆమాయే నిజమని అప్పట్లో అనిపించింది ఆ విశాల నిశ్శబ్ద హాలులో నించొని నాలోనేను విరగబడి నవ్వుకున్నాను.

ఆ సమయంలో నౌకరు లైటు చేత్తో పట్టుకొని లోనికి ప్రవేశించాడు. అతడు నన్నుచూసి పిచ్చివాడనని భావించా డేమో! లైటుముందర కూర్చుని పేపరు చదువుకుంటూ మళ్ళీ ఒకసారి నా ఆలోచల్ని వెనక్కి మలిపాను. నెలకు నాలుగువందల యాభైరూపాయలు నిక్షేపంగా సంపాదించు కునే నేను అనవసర ఆలోచన్లతో మనసుని పాడుచేసుకోవడం ఏమంత మంచిది కాదనిపించింది.

భోజనం అయ్యాక ఓచిన్న గదిలో పక్క పరుచుకొని పడుకున్నాను. దీపం ఆర్పేశాను. తెరచిన కిటికీలోంచి ఓ ప్రకాశవంతమైన నక్షత్రం ఆవళ్ళి కొండలపైన వేలాదిమైళ్ల దూరంనుంచి చీకట్లో నాకేసి తదేకంగా చూస్తోంది. ఎంత సేపు అలా పడుకున్నానో తెలియదు. కాని అకస్మాత్తుగా లేచి కూచున్నాను. చుట్టూ పరికించి చూశాను. ఎవరూ కనిపించలేదు. ఎక్కడా అలికిడైన శబ్దంకూడా లేదు. ఆకాశంలోని ఆ నక్షత్రంమాత్రం ప్రకాశవంతంగా నాకేసిచూసి

నవ్వుతోంది. అప్పుడే ఉదయించిన చంద్రుని మసక వెలుతురు కిటికీగుండా గదిలోకి ప్రవేశిస్తోంది.

నా కెవరూ కనిపించలేదు. కాని నన్నెవరో చెయ్యి పట్టుకొని లాగుతున్నట్టుంది. నేను లేచి చూసేసరికి అయిదు వేళ్ళకు ఉంగరాలు పెట్టుకున్న ఓ స్త్రీ నన్ను చేత్తో పిలుస్తున్నట్టనిపించింది. నే లేచి నిశ్శబ్దంగా ఆమె వెంట నడిచినాను. నా అడుగుల చప్పుడు విని ఎవరైనా లేస్తారేమోనని అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా పిల్లిలా ఆమె ననుసరించాను. ఆ భవనంలోని చాలా గదులు తాళం వేసి ఉండడంచేత నేనెప్పుడూ వాటిని చూళ్లేదు.

పైకి ఊపిరికూడా పీల్చుకుండా నా అగుపించని అగంతకురాలు చెంత మెల్లగా నడుస్తున్నాను. నేనిప్పు డెక్కడుందీ చెప్పలేను. అనంతమైన చీకటి ఇరుకు మార్గాలనుంచి దీర్ఘమైన నడవలగుండా, నిర్మానుష్యమైన నిశ్శబ్ద గదులనుంచి దాటిపోయాను.

ఆమె నా కంటికి కనిపించకపోయినా నా మనఃఫలకం మీద ఆమె సుందరాకారం అగుపిస్తోంది. ఆమె ఓ అరబ్బు కన్య. నెత్తిమీద ముసుగు వేసుకుంది. బొజ్జో కైజారు వేలాడుతోంది. నాకు వెంటనే అరేబియన్ ప్రేమగాథలు గుర్తుకొచ్చాయి. ఆ అర్ధరాత్రి కటిక చీకట్లో నిద్రిస్తున్న బాగ్దాదు సందుగొందులగుండా పయనిస్తున్నాను.

చివరి కామె ఓ నీలం తెరదగ్గరకొచ్చి ఆగిపోయింది. ఆ తెరవైపు చెయ్యిపెట్టి చూపించింది. అక్కడేమీ కనిపించడంలేదు. కాని అకస్మాత్తుగా నా రక్తం గడ్డకట్టుకుపోయింది.

ఆ తెరకింద నేలమీద ఓ భయంకరమైన నీగ్రో కాళ్ళు చాపుకొని కూర్చున్నాడు. అతని ఒళ్ళో కత్తి ఉంది. నా దర్శకురాలు అతని కాళ్ళమీద నెమ్మదిగా చరిచి, కొద్దిగా తెర పైకెత్తింది. గదిలో కొంతభాగం పర్షియన్ తివాసీ పరిచి వుండడం కనిపించింది. ఆ గోపల మంచంమీద ఎవరో కూర్చున్నారు. నా కామె కనుపించలేదు. కాని బంగరు నగిషీలు చెక్కిన పాదరక్షలు, రెండు పాదాలు కనిపించాయి. ఓ పక్క టేబులో ఆపిల్సు, నారింజలు, ద్రాక్షగుత్తులు నిండుగా వున్నాయి అతిథికోసం సిద్ధంగా రెండు కప్పుల్లో ద్రాక్షరసం వుంది.

బితుకు బితుకుమంటూ ఆ పరిచిన కాళ్ళను దాటి లోపలకు వెళ్ళడానికి ప్రయత్నించాను. అతడు విభ్రాంతుడై లేచి నిలబడ్డాడు అతని ఒళ్ళోని కత్తి చలవరాతి నేలమీద పడి కంగ్‌మని పెద్దమోత వినిపించింది,

పిచ్చిగా ఓ పెద్ద కేకవేసి నిద్రలోంచి లేచి కూచున్నాను. ఒళ్ళంతా ముచ్చమటలు పోశాయి. వేకువ కాంతిలో చంద్రకాంతి మిళితమై గదిలో గుడ్డి వెలుతురు కనిపిస్తోంది. రోజుటిమాదిరిగానే పిచ్చి మొహరాలీ రోడ్డువెంట ఒంటిగా నడుస్తూ "వెనక్కి తిరుగు వెనక్కి తిరుగు"అని అరుస్తున్నాడు.

నా ఒక అరేబియన్ రాత్రి అలా గడిచిపోయింది. ఇంకా వెయ్యి రాత్రులు మిగిలివున్నాయి.

ఇకనాకు పగటికి రాత్రికి మధ్య సంఘర్షణ బయలు దేరింది. పగలంతా నా పనిలో నిమగ్నమై అలిసిపోయి రాత్రిని కలల్ని తిట్టుకుంటూ సాయంత్రానికి ఇంటికి చేరుకునే

వాణ్ణి ఇక రాత్రి కాగానే స్వప్నలోకంలో వుండి పగటి బండచాకిరీని ఈసడించుకునే వాణ్ణి.

చీకటి పడటం ఆలస్యం, వెంటనే యేదో మాయలో చిక్కుకునేవాణ్ణి. అప్పుడు నేను చరిత్రలో పేర్కొనబడిని ఓ అపూర్వ వ్యక్తిగా మారేవాణ్ణి. నెత్తిమీద ఎర్రటి వెల్వెట్ టోపీతో, ఒదులు పైజమాలు వేసుకొని, అత్తరు పూసిన రంగురంగుల జేబురుమాళ్ళు చేత్తో పట్టుకొని, ఘుమఘుమా యించే తలవాసనలతో ఎత్తైన కుషన్ కుర్చీలో కూర్చుని మజాగా సిగరెట్టు పీలుస్తుండేవాణ్ణి.

ఆ అపూర్వ సన్నివేశాల్ని గురించి నే వివరించలేను. ఆ స్వప్న దృశ్యాలమధ్య, వీణా నాదాలమధ్య, సువాసల్ని మోసుకొచ్చే గాలితెరలమధ్య మెరుపులా ఓ సుందరాంగి నా కగుపించేది. బంగరు నగిషీలలో వున్న పాదరక్షల్ని ధరించిన సుందరే ఈమె.

ఆమె నన్ను పిచ్చివాణ్ణి చేసింది. ఆమెను పట్టుకోవడానికి గదులన్నీ, బాటలన్నీ, పేటలన్నీ గాలించాను. స్వప్నలోకంలో మంత్రముగ్ధంగా ఆమెకోసం తిరిగి తిరిగి వేసారిపోయాను.

ఒకోసారి సాయంత్రం నిలువుటద్దం ముందు నించొని చూస్తుండగా నా పక్కన ఓ పర్షియన్ యువతి వున్నట్టుగా ప్రతిబింబం కనిపించేది. ఆమె నల్లటి విశాలమైన నయనాలు, ఎర్రటి నాజూకైన అధరపులు, యవ్వనంతో ఉప్పొంగుతున్న అందమైన అవయవాలు కనుపించి మటుమాయమై పోయేవి. దీపం ఆర్పేసి పరుపుమీద కళ్ళు మూసుకొని పడుకునే

వాణ్ణి. అక్కడ చుట్టూవున్న చిట్టడవులు నుంచి కొండల నుంచి గాలితెరలు సువాసల్ని మోసుకొచ్చి గుసగుసలాడేవి. నా చెక్కిళ్ళని, అధరవుల్ని తనివితీరా ముద్దాడేవి. ఓ పెద్ద నిట్టూర్పు విడిచి ఇకప్పుడు గాఢంగా నిద్రపోయే వాణ్ణి.

ఒకనాటి సాయంత్రం గుర్రంమీద అలా షికారుగా వెడదామనుకున్నాను. కాని నన్నెవరో మంత్ర ముగ్ధంగా ఆపుచేశారు. విధిలేక నిలిచిపోయాను. ఒక్కసారే గాలి పెద్ద పెట్టున ఆవళ్ళ కొండలమధ్య సుళ్లు తిరిగింది. గాలిదుమ్ము కొండలపైకి సుళ్లు తిరిగి తిరిగి సూర్యాస్తమయానికి మటు మాయమైపోయింది.

ఆ అర్ధరాత్రి నాగుండె పగిలిపోయే రోదన ధ్వని వినిపించింది. ఆధ్వని నా మంచంకింద, భవనంలోని ప్రతి పునాదుల అడుగున, ఓ చీకటి సమాధి నుంచి వస్తున్నట్టుంది. ఆ గొంతుక జాలికరంగా అరుస్తోంది. నన్ను రక్షించు. ఈ పెను చీకటి సమాధినుంచి వ్యర్థమైన స్వప్నాలనుంచి నన్ను వెలికి తీసి నీ హృదయానికి హత్తుకో. నాకు వెలుగుచూపి పుణ్యం కట్టుకో".

నే నెవర్ని? నిన్నెలా సంరక్షిస్తాను? ఓ సుందరాంగీ? నువ్వెప్పుడు, ఎక్కడ జీవించావు? ఏ వసంతకాలంలో ఏ ఒయాసిస్సులో పచ్చటి చెట్ల నీడను నిరాశ్రయురాలై ఎడారిలో తిరుగాడుతున్న ఏతల్లి ఒడిలో జన్మించావు? అప్పుడే విడుతున్న మొగ్గను తుంచినట్టుగా ఏ దుష్టుడు నిన్ను నీతల్లి హస్తాలనుంచి విడదీసి, గుర్రంమీద ఎడారిమార్గంగుండా ఏపట్టణపు బానిసల బజార్లోకి తీసుకొచ్చాడు? అక్కడ ఏ బాదూషా

అధికారి నీ యవ్వన సౌందర్యాన్ని చూచి ముగ్ధుడై నిన్ను బంగారంగా కొని, అందమైన మీనాలో కూచోపెట్టి, అతని యజమాని యిచ్చిన కానుకల్ని నీకు సమర్పించాడు! ఆహా ఎటువంటి చరిత్ర ప్రసిద్ధమైన ప్రదేశమది. సరెంగి సంగీతం, అందెల ఘలంఘలలు, కత్తులు తళతళ మెరుపులు, షిరాజ్ మత్తుపానీయం– ఆహా ఎటువంటి ఇంద్రవై భోగమది ? బానిస కన్యలు నీకు రెండువైపులా నిలబడి చామరాలతో విసుతోంటే రాజాధిరాజైన ఏ బాదూషాచేత కత్తి పట్టుకొని సర్వాలంకారులతో యమునిభటుడిలావచ్చి నీపాదాలముందు మోకరిల్లాడు ? ఆఖరికి ఏకరకు కరవాలం ఎడారి పుష్పమైన నీతనువుని ఖండించి శాశ్వతంగా నీకు విశ్రాంతి నిచ్చింది ?

సరిగా ఇక్కడి కోచ్చేసరికి పిచ్చి మెహరాలి పెద్దగా అరుస్తున్నాడు. "వెనుదిరుగు ! వెనుదిరుగు ! అంతా అబద్ధం అంతా అబద్ధం !" నే కళ్ళు తెరచి చూశాను. అప్పటికే వేకువలు విరివిగా వెల్లివిరిసి నెలుగు కాంతులు అగుపిస్తున్నాయి. చప్రాసీ వచ్చి నా ఉత్తరాలందించాడు. వంట మనిషి నాకు సలాంపెట్టి నా ఆజ్ఞకోసం నిలబడ్డాడు.

అప్పుడు నేచెప్పాను. "ఇక్కడ నే మరోక్షణమైనా ఉండను. ఆవేళే నా సామాన్లన్నీ తీసుకొని ఆఫీసుకు తరలి వెళ్ళాను. కరీంఖాన్ నాకేసిచూసి విజయగర్వంతో నవ్వాడు. నే మారు మాటాడకుండా నాపనిలో నిమగ్నుణ్ణయ్యాను.

సాయంత్రం అయ్యేసరికి నాకు మతిమరుపు జాస్తి అవుతోంది. పత్తి లెక్కలు సరిచూస్తూ కూర్చోవడమంటే

నాకు విసుగు పుట్టుకొచ్చింది. నిజాం నిజామత్ కూడా నాముందు వ్యర్థుడుగా కనిపించాడు. పొట్టకూటికోసం ఇంత దూరం వచ్చి పనిచెయ్యడంలో అర్థం లేదనిపించింది.

నా పెన్ను విసిరేశాను. లెడ్జర్లు మూసేశాను. బగ్గీలో ఎక్కి–పోయాను. దానంతటదే ఓ విశాలమైన సౌధంముందు నిలబడిపోయింది. వడివడిగామెట్లెక్కి– గదిలోకి ప్రవేశించాను.

లోపల అంతటా గాఢ ప్రశాంతత ఆవరించి వుంది. చీకటి గదులు నాకేసిచూసి నవ్వుకుంటున్నాయి. నా మనసు సంతృప్తితో మెరిసింది. నా ఆనందాన్ని పెలిబుచ్చు కోవడానికి అక్క–డెవరూలేరు. ఆ చీకటి గదులన్నీ వెర్రిగా కలయ దిరిగాను. నాదగ్గరే వీణవుంటే ఎంత మధురంగా వాయించే వాణ్ణి అనుకున్నాను.

తలమించి రెండు స్వేదబిందువులు నుదిటి మీదికి జారాయి ఆవేళ ఆ వళ్ళికొండల్ని నల్లటి మేఘాలు కమ్మి కప్పేశాయి. చుట్టూవున్న చిట్టడవులు ప్రశాంతంగా వున్నాయి.

నౌకర్లంతా ఆఫీసులో వుండిపోయారు. అంచేత అక్క–డలైటు వెలిగిండానికి ఎవరూలేరు. ఆకాశంలో మేఘాలు దట్టంగావుండి చంద్రకాంతి కానరావడంలేదు. ఆ నిశ్శబ్ద నిశీధ వాతావరణంలో మంచంకింద తివాసీమీద ఓస్త్రీ విచార వదనంతో పడుకొని వున్నట్టు కనిపించింది. వర్షం దారాపాతంగా కురుస్తూ కిటికీలోంచి జల్లులు ప్రహ్లాండంగా వచ్చి తడిపేస్తోంటే ఆమె పేలవంగా నవ్వుతూ, వెక్కి–వెక్కి ఏడుస్తూ రొమ్మును బాదుకుంటోంది.

ఆ రాత్రి తుఫానుగాని, ఆమె రోదనగాని ఒక్క నిమిషంకూడా ఆగలేదు. దుఃఖంతో బరువెక్కిన హృదయంతో ఆ చీకట్లో గదులన్నీ కలయతిరిగాను. నాకెవరూ కనిపించందే నేనెవర్ని ఊరడించను ? మరి ఆనిరంతర రోదన ఎవరిది ? ఎక్కణ్ణుంచి ఆ రోదన వినవస్తోంది ?

పిచ్చివాడు అరిచాడు : "వెనుదిరుగు !! అంతా అబద్దం ! అంతా అబద్దం !!"

నాకు మెలకువ వచ్చింది. తూర్పు దిక్కున తెల్ల రేకలు పొడగట్టాయి. మెహరాలీ ఆ భయంకరమైన తుఫానులో కూడా భవనం చుట్టూ అరుచుకుంటూ తిరుగుతున్నాడు బహుశా ఒకప్పుడతడీ ఇంట్లోవుండి వుండొచ్చని, అంచేత పిచ్చివాడైనా ఇక్కడకు రోజూ వచ్చి తిరుగుతున్నాడని నామనసుకు తటాలున తట్టింది.

ఆ తుఫాన్ని లెక్కచెయ్యకుండా అతని దగ్గరకెళ్ళి అడిగాను. "ఓ, మెహరాలీ ! ఏమి టబద్దం ?

అతడేం జవాబు చెప్పకుండా నన్ను పక్కకు తోసి నడుస్తూ అరుస్తున్నాడు. "వెనుదిరుగు ! వెనుదిరుగు !: అంతా అబద్దం ! అంతా అబద్దం."

హోరుమని కురుస్తున్న ఆ వర్షంలో పిచ్చివాడిలా ఆఫీసుకు పరుగెత్తుకెళ్ళి కరీంఖాన్‌ని అడిగాను దీనంతటికి అర్థమేమిటో చెప్పు ?"

ఆ తలకెరిసిన వ్యక్తిదగ్గర నేకరించిన విషయం యిది. ఒకప్పుడా సౌధంలో అగ్నిజ్వాలలు బయలుదేరాయి. ఆజ్వా

లలు భయంకరమైన తమ నాలుకల్ని చాపి చాలా భాగాన్ని భస్మీభూతలం చేశాయి. ఇక అక్కడి రాళ్ళు సలసలా కాగిపోయి ఆకలితో దప్పికతో అలమటించి పోయాయి. వాటి దగ్గిరకొచ్చిన మనుషుల్ని కబళించడానికి అవి సిద్ధపడ్డాయి. అక్కడ వరుసగా మూడు రాత్రుళ్లు గడిపిన వాళ్లెవరూ బ్రతకలేదు. కాని ఒక్క మెహరాలీ మాత్రం తప్పించుకొని బయట పడగలిగాడు.

"నా విముక్తికి మార్గంలేదా? అడిగాను.

"ఒకే ఒక మార్గం వుంది. కాని అది చాలా దుర్లభం. అదేమిటో చెబుతా, కాని ఒకప్పుడా సౌధంలో నివశించిన ఓ పర్షియన్ కన్యగాథను ముందుగా వినాలి. అటువంటి హృదయ విదారక విషాదాంత గాథని నువ్వెప్పుడూ వినుండవు."

సరిగా ఈ సమయానికి రైలొస్తున్నదని కూలీలు కేకలు పెట్టారు. త్వరత్వరగా మాసామాన్లన్నీ సర్దేసుకునే లోగా రైలు రానేవచ్చింది. ఓ ఆంగ్లేయుడు అప్పుడే నిద్ర లేచి మొదటి తరగతి పెట్టెలోంచి స్టేషన్ వైపు చూస్తున్నాడు. అతడు మాతోటి ప్రయాణీకుణ్ణి చూడగానే ఎలుగెత్తి "హల్లో!" అని పిలిచి అతన్ని తన పక్కన కూచోబెట్టుకున్నాడు.

మేం మూడో తరగతి పెట్టెలో ఎక్కడంచేత అతని కథాంతమేమిటో, అసలతనెవరో తెలుసుకోలేకపోయాం.

నే అన్నాను. "అతడు మనల్ని దద్దమ్మలుగా చేసి వదిలాడు. ఆ కథ మొదట్నుంచీ చివరిదాకా ఉత్తి అభూత కల్పన."

ఆ తరువాత జరిగిన సంభాషణ ననూ్నా, నా దివ్య జ్ఞాన బంధువుని జీవితాంత కలహంతో ముగించింది.

vaaradhionline.com

నది మెట్లు

గతించిన రోజుల్ని స్మరించుకో దల్చుకుంటే ఈనా మెట్లుమీద కూర్చుని నదినీటి గలగల శబ్దాన్ని వినండి.

ఆశ్వీజ మాసం ప్రవేశించింది. నది వరదల్లో ఉంది. నామెట్లు నాలుగు మాత్రం పైకి తొంగి చూస్తున్నాయి. నది ఒడ్డుల్ని ఒరుసుకుంటూ పారుతోంది. ఒడ్డు పక్కన ఎదిగిన పొదలన్నీ నీట్లో మునిగిపోయాయి. చేపల పడవలు ఒడ్డునున్న చెట్లకు కట్టేసున్నాయి. ఒడ్డుమీద రకరకాల పచ్చగడ్డి పువ్వులు అప్పుడే ఉదయిస్తున్న సూర్యుణ్ణి తలపై కెత్తి చూస్తూ పలకరిస్తున్నాయి.

పూజారి తన రాగిచెంబు తీసుకొని స్నానానికొచ్చాడు. స్త్రీలు ఇద్దరేసి, ముగ్గురేసి జట్లుజట్లుగా వచ్చి నదిలో నీళ్ళు తీసుకెడుతున్నారు. స్నానవాటిక దగ్గరకు కుసుంవచ్చే వేళ యింది

కాని ఆ ఉదయం నాకామె కనిపించలేదు. స్వర్ణ భువన్ రేవు దగ్గర విచారంగా ఉన్నారు. తమ స్నేహితురాలు ఎక్కడో దూరంగావున్న అత్తవారింటికి వెళ్ళిందని చెప్పారు వాళ్ళు.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆమెను గురించిన ఆలోచనే నాకు కలుగలేదు. క్రమంగా ఆమె నామనఃఫలకం నుంచి అదృశ్యమైంది. రేవులోని స్త్రీలుకుసుని గురించి అరుదుగా

కూడా తలపోయడం లేదు. కాని ఒకనాటి సాయంత్రం నాకు బాగా పరిచితమైన అవేపాదాలు కనిపించినప్పుడు ఆశ్చర్య పోయాను. ఆమె పాదాలకు అందెలులేవు. ఘలం ఘలారా వాలు వినిపించడంలేదు.

కుసుం వితంతువైంది ఆమె భర్త ఎక్కడో దూర ప్రదేశంలో పనిచేసేవాడని తెలిసింది. ఆమె, అతన్ని ఒకటి రెండుసార్లు మాత్రం చూసింది. అతని మరణవార్తను ఆమెకో ఉత్తరం అందించింది. ఎనిమిది సంవత్సరాల వితంతువు నుదుట తిలకం చెరిపేసుకుంది. చేతిగాజులు తీసేసుకుంది, తిరిగి గంగానది ఒడ్డునవున్న స్వగ్రామం చేరుకుంది. అక్కడామె స్నేహితురాండ్రెవరూ కనిపించలేదు. వారిలో స్వర్ణ, భువన్, అమల మొదలైనవారికి వివాహాలై వెళ్ళి పోయారు. ఇక శరత్ మాత్రం మిగిలింది. ఆమెకూడా వచ్చే డిసెంబరు మాసంలో వివాహమవుతుంది. వర్షాకాలంలో వరదనీటితో గంగానది నీటిమట్టం పెరిగినట్లుగా కుసుం దినదిన ప్రవర్తమానమై, యవ్వన ప్రాంగణంలోకి అడుగు పెట్టింది. కాని ఆమె ఆకర్షణలేని దుస్తులు, విచారవదనం, మానసస్థితి, ఆమె యౌవన సౌందర్యంమీద ముసుగు కప్పేశాయి.

పది సంవత్సరాలు గడిచిపోయాయి. కుసుం యవ్వన ప్రాంగణంలోకి అడుగు పెట్టిందని ఎవరూ గుర్తించినట్లులేదు.

సెప్టెంబరు మాసాంతంలో ఒకనాటి సుప్రభాతంనాడు, ఓ యువసన్యాసి ఇప్పుడు నాముందున్న శివాలయంలోకి వచ్చాడు. అతడెక్కడనుంచి వచ్చిందీ నాకు తెలియదు.

కాని అతడక్కడే నివాసం ఏర్పరచుకొని ఉంటున్నాడు అతని ఆగమనవార్త గ్రామమంతా పొక్కింది. ఆడవాళ్ళు నదిదగ్గరే కుండలు వదిలేసి, ఆ పవిత్రమైన సన్యాసిని దర్శించడానికి గుళ్ళోకి పరుగెత్తారు.

రోజురోజుకి సన్యాసిని చూడ్డానికి వచ్చేజనం పెరిగిపోతున్నారు ఇంటింటా అతనిపేరు మారుమోగుతోంది. ఒకోరోజున అతడు భగవద్గీతపారాయణం చేసేవాడు. మరోరోజున గీతా రహస్యాలు వెల్లడించేవాడు. కొంతమంది అతని సలహాలకోసం వచ్చేవారు. మరి కొంతమంది సందుల కోసం వచ్చేవారు.

నెలలు గడిచిపోయాయి. ఏప్రియల్ మాసంలో సూర్యగ్రహణం నాడు గంగానదిలో స్నానం చెయ్యడానికి తండోప తండాలుగా జనం వచ్చారు. సన్యాసిని దర్శించడానికి వేలాది స్త్రీ, పురుషులు శివాలయంలోకి వెళ్లారు. ఆ వెళ్ళిన వాళ్ళల్లో చాలామంది స్త్రీలున్నారు. కుసుం అత్త వారి ఊరునుంచి వచ్చిన స్త్రీలు కూడా అందులో కొందరున్నారు.

అది ఉదయం వేళ. సన్యాసి నామెట్లుమీద నిలబడి జపమాల తిప్పుతున్నాడు. అంతలో ఓ యాత్రికురాలు ఆ పక్కనున్నామె చెవిలో ఊదింది. "ఇతడు మన కుసుం భర్త కదూ! చూడు." ఆ పక్కనున్నామె కొద్దిగా ముసుగు తొలగించి సన్యాసి వైపు పరీక్షగా చూసింది. "అవును, నిజమే. ఇతడు మనవూరి చటర్జీ కుటుంబములోని కడగొట్టువాడు." మరొకామె తన ముసుగు తొలగించి సన్యాసివైపు చూసి

అన్నది. "అవును ఇతడి ముక్కు-తీరు, కళ్ళతీరు అచ్చం అలాగే వున్నాయి." మరొకామె కుండతో నీళ్ళు పట్టు కుంటూ సన్యాసికేసి చూడకుండా అన్నది: "అయ్యో! అతడు చనిపోయాడు. చచ్చిపోయినవాడు తిరిగెలా వస్తాడు? ఇంతకీ కుసుం దురదృష్టమది?

"అతనికింత పెద్దగడ్డంలేదు. పైగా సన్నగాఉంటాడు. ఇంత పొడుగ్గా కూడా ఉండడు." మరొకామె వ్యాఖ్యానించింది. ఇక అక్కడితో ఆ ప్రస్తావన ఆగిపోయింది,

ఒకనాటి సంధ్యవేళ పూర్ణచంద్రు డప్పుడే ఉదయించాడు. కుసుం నీటిముందు నాకడ మెట్టుమీద కూర్చుంది. ఆమె నీడ నామీద పడుతోంది.

ఆ సమయంలో రేవుదగ్గర మరెవ్వరూ లేదు. కీచు రాళ్ళు నాదెవులు దిబ్బళ్ళు పడేట్టు సంగీతం వినిపిస్తున్నాయి. గుళ్లో గంటలు మోగడం లేదు. ఆ గంటల అంతిమశబ్ద తరంగాలు క్రమంగా క్షీణించి నదీ ప్రవాహధ్వనిలో మిళితమై పోయాయి. గంగానది నల్లటినీటిమీద చంద్రకాంతి ప్రతిఫలించి వింత వెలుగులు కనిపిస్తున్నాయి. ఊరి బయట నక్కల కూతలు వినిపించి ఆగిపోయాయి.

శివాలయంనుంచి సన్యాసి నెమ్మదిగా బయటకొచ్చాడు. రేవు మెట్లుదిగుతూ అక్కడో స్త్రీ ఒంటరిగా కూర్చొని ఉండడంచూసి వెనుదిరిగి వెళ్ళబోయాడు. కుసుం తల పైకెత్తి వెనుదిరిగి చూసింది. ఆమె ముఖంమీద ముసుగు తొలగిపోయింది. చంద్రకాంతి ఆమె ముఖంమీద ప్రతిఫలించింది.

గుడ్లగూబ వారి తలలమీంచి తిరుగుతూ అరుచుకుంటూ పోయింది. ఆ శబ్దానికి కుసుం తిరిగి ఈ లోకంలోకి వచ్చింది. ముసుగు తిరిగి ముఖంమీదికి లాక్కొంది. సన్యాసి పాదాలకు ఒంగి నమస్కరించింది.

అతడు దీవించి అడిగాడు. "ఎవరు నువ్వు?"

"నా పేరు కుసుం" చెప్పిందామె.

మరి వాళ్ళిద్దరిమధ్యా అరాత్రి సంభాషణేమీ జరగలేదు. కుసుం నెమ్మదిగా ఇంటిముఖం పట్టింది కాని సన్యాసి మాత్రం అరాత్రి చాలా గంటలు నా మెట్లుమీదే కూర్చుని గడిపాడు. చంద్రుడు తూర్పునుంచి పశ్చిమ దిశకు తిరిగింతరువాత, అతని నీడ వెనకనుంచి ముందుకొచ్చిన పిదప సన్యాసి అక్కణ్ణుంచి కదిలి గుళ్ళోకి వెళ్ళాడు.

అప్పట్నుంచి కుసుం ప్రతిరోజూ సన్యాసి దగ్గిరకొచ్చి అతని పాదాలకు ప్రణామం చేసేది. అతడు పవిత్ర గ్రంథాలను చదువుతూ చెబుతోంటే ఆమె ఓమూల నిశ్శబ్దంగా కూర్చొని వింటుండేది. అతడు ఉదయం తన కార్యక్రమమంతా ముగించుకొని కుసుంని పిలిచి మత విషయాలు బోధించేవాడు. ఆమెకా విషయాలు అర్థమయ్యేవికావు. కాని తన శక్తినంతా కేంద్రీకరించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేది. ఆమె రోజూ గుళ్ళో పూజకు కావలసిన పనులన్నీ చేసేది. గంగానదినుంచి నీళ్ళు తెచ్చి గుడిని పరిశుభ్ర పరిచేది.

హేమంతం క్రమంగా తన ప్రభావాన్ని కోల్పోతోంది. చెదురు మదురుగా చలిగాలులు కొడుతున్నాయి. సాయంత్రంవేళ అప్పుడప్పుడు వెచ్చటి దక్షిణ పవనపు గాలులు

ుస్తున్నాయి పడవవాళ్లు తమ పడవలను ప్రవాహా ఉరవడికి కదిలిపెట్టి, మురళీ గీతాలను ఆలాపించేకాలం ఆసన్నమైంది.

తిరిగి నాకు కుసుం కనిపించడం మానేసింది. కొంత కాలం గుళ్ళోకికాని, రేవు దగ్గరకుకాని, సన్యాసి దగ్గరకుకాని రాలేదు.

అందుకాకారణ మేమిటో నాకు తెలియదు. కాని కరువాత కొంతకాలానికి ఒకనాటి సంధ్యవేళ వాళ్ళిద్దరూ గా మెట్లమీద కూర్చునుండడం చూశాను.

కుసుం నేలకేసి చూస్తూ అడిగింది: "స్వామీ! నా గోసం కబురు పంపారా?"

"అవును పంపాను. ఇన్ని రోజుల్నుంచీ నువ్వు కనిపిం చడం లేదేం? దైవపూజ అశ్రద్ధ చెయ్యకూడదు."

ఆమె మౌనంగా కూర్చుండిపోయింది.

"నీలో ఉన్న భావాలేమిటో దాచకుండా చెప్పు."

"స్వామీ! నేను పాపిని. అంచేతనే దైవపూజను ఉపే క్షించాను." ఆమె ముఖం ఓ ప్రక్కకు పెట్టి అన్నది.

"కుసుం, నీ హృదయంలో ఏదో అశాంతి చెలరేగు తోందని నాకు తెలుసు" అన్నాడు సన్యాసి.

ఆమె చీరచెంగు ముఖంమీదకు లాక్కొంది, అక్క డ్నుంచి కొద్దిగా కదిలి సన్యాసి పాదాలకింద మెట్టుమీద కూర్చుని రోదించడం మొదలెట్టింది.

అతడు కొంచెం పక్కకు తొలిగాడు. "నీ హృదయంలో ఏముందో చెప్పు. నీకు శాంతిమార్గం ఉపదేశిస్తా," అన్నాడు. ఆమె అప్పుడప్పుడు మాటలకోసం తడుముకుంటూ చెప్పుకు

పోతున్నది "మీరు అనతి స్తే మరినేనిక మాట్లాడి తీరాలి. అయితే నేను పూర్తిగా వివరించి చెప్పలేను. స్వామీ! మీరు దాన్ని ఊహించుకోవాలి. నేనొకర్ని దేవుడిగా ఆరాధించాను; అర్చించాను. అతనిమీద భక్తితో నా హృదయం నిండిపోయింది. కాని ఒకరాత్రి స్వప్నంలో నా హృదయేశ్వరుడు తోటలో ఓమూల కూర్చుని, నా కుడిచేతిని అతని వామహస్తంలోకి తీసుకొని, నా చెవిలో ప్రణయ పాఠాలు బోధిస్తున్నట్లు చూశాను. ఆస్వప్నం అదృశ్యమైంది. కాని అది ఇంకా నా హృదయ ఫలకంమీద నిలిచేఉంది. ఆ మర్నాడతడు మరింత వెలుగు కాంతులతో కనిపించాడు. ఆ స్వప్నదృశ్యం నన్ను వెంటాడుతోంది. భయంచేత అతనికి దూరంగా పారిపోయాను. కాని ఆ దృశ్యంమాత్రం అదృశ్యం కావడం లేదు. అప్పట్నుంచి నా హృదయం అశాంతితో అలమటిస్తున్నది. నన్ను అంధకారం ఆక్రమించుకున్నది."

ఆమె తనకథ ముగించి కన్నీరు తుడుచుకుంటుంటే సన్యాసి తన కుడిపాదాన్ని నా రాతిమీద గట్టిగా నొక్కడం చూశాను.

"నీ స్వప్నంలో ఎవర్ని చూశావో చెప్పు." అడిగాడు సన్యాసి.

"చెప్పలేను" రెండు చేతులూ కట్టుకు కూర్చొని అన్నదామె.

"అతడెవరైందీ నువ్వు చెప్పితీరాలి" సన్యాసి పట్టుపట్టాడు.

"చెప్పి తీరవలసిందేనా?" అడిగిందామె.

"ఆఁ తప్పకుండా" జవాబు చెప్పాడు.

ఆమె ఏడుస్తూ "స్వామీ! మీరే అతడు" అన్నది. ఆమె నా రాతిమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమెకు తిరిగి తెలివొచ్చిం తరువాత సన్యాసి నెమ్మదిగా అన్నాడు: "ఇవ్వాళ రాత్రే ఇక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నాను. ఇకి తిరిగి నువ్వుననున్ను చూళ్లేవు నేని ప్రపంచానికి చెందినవాణ్ణి కాదు సన్యాసినని మాత్రం గుర్తుంచుకో. ఇక ననున్ను మర్చిపో."

"అలాగే స్వామీ!" అన్నది కుసుం నెమ్మదిగా.

"మరి సెలవు తీసుకుంటున్నా" చెప్పాడు సన్యాసి.

కుసుం మారు మాటాడకుండా అతనికి వంగి నమస్కారం పెట్టింది. అతని పాదాలచెంత మట్టితీసి తలమీద పెట్టుకుంది. అత డిక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

చంద్రుడస్తమించాడు. ఆకాశం నుంచి భూమికి చీకటి తెరలు దిగాయి. నీటిలో ఒక్కసారి పెద్దగా గలగల శబ్దం వినిపించింది నాకు. ఆ చీకట్లో ఆకాశంలోని నక్షత్రాల్ని ఎగర గొట్టాలని కాబోలు గాలి ఉధృతంగా వీచింది.

నిత్యకాళి

ఓ పడవ నదిలో ఓ పురాతన స్నానవాటిక వద్ద లంగరు వేయబడివుంది. అప్పుడే సూర్యుడస్తమించాడు.

పడవ మనుషులు పడవమీద సాయంత్రపు ప్రార్థనలు చేసుకుంటున్నారు. వారి మూగ ప్రార్థన, పశ్చిమాకాశంలోని కెంపు కాంతులూ-ప్రకృతి రామణీయకత్వానికి మరింత శోభను చేకూరుస్తున్నాయి అస్తమిస్తున్న సూర్యకాంతి నిశ్చలంగా ఉన్న నది నీటిమీద ప్రతిఫలిస్తోంది.

నాముందు ఓ శిథిలమైన గృహముంది నేను రేవు మెట్లమీద ఒంటరిగా కూర్చున్నాను. పనసకాయమీద పగులులా ఓ మ్రిచెట్టు వేళ్ళు ఆ మెట్లను నెర్రలుగా విడగొట్టాయి. నన్నేదో అస్పష్టమైన విచారభావం పట్టుకు పీడుస్తోంది. ఇంతలో ఏదో కంఠస్వరం నన్ను ఉద్దేశించి ప్రశ్నించింది.

"ఏ ఊరండి మీది?"

తల పైకెత్తి చూశాను. ఎండి బరుగులా ఉన్న ఓ మనిషి కనిపించాడు. అతడెక్కడో దూరదేశంనుంచి పొట్ట కూటికి పనిచేసుకోడానికి వచ్చినవాడిలా ఉన్నాడు. అతడు వేసుకొన్న కోటు మురికితో అసహ్యంగా ఉంది. అతడప్పుడే పనిలోంచి వచ్చినట్టున్నాడు.

ఆ అగంతకుడు నా పక్కన మెట్లమీద కూర్చున్నాడు. అతని ప్రశ్నకు సమాధానం చెప్పాను.

"మాది రాంచీ"

"ఏంపని చేస్తారు?"

"వ్యర్తకం చేస్తా"

"ఏం వ్యర్తకం?"

"కలప వ్యాపారం"

"మీ పేరేమిటి?"

ఓ క్షణం సేపు సంకోచించి ఏకోపేరు చెప్పాను. అది నాపేరు కాదు,

నన్ను గురించి అతని విచారణ ఇంకా పూర్తికాలేదు. "ఇక్కడి కెందుకొచ్చారు?" మళ్ళీ అడిగాడు.

"గాలి మార్పిడికోసం."

అతడు నాకేసి ఆశ్చర్యంగా చూశాడు. "ఇక్కడి గాలిని ఆరు సంవత్సరాలను చి పీలుస్తున్నాను. కాని నా ఆరోగ్యం ఏమీ బాగుపడలేదు" అన్నాడు.

"రాంచీకంటే నా కిక్కడి గాలి సరిపడింది" చెప్పాను.

"అయితే మీ రదృష్టవంతులే. మరి మీరెక్కడుంటున్నారు?"

రేవు దగ్గరున్న పాడుబడ్డ ఇంటివైపు చూపి "అక్కడ" అన్నాను.

నావాలకం చూసి గుప్త ధనంకోసం నేనక్కడకు వచ్చినట్టుగా అతడు అనుమానించాడు. ఏమైనా మళ్ళీ అతడు నన్నావిషయం కదపలేదు. ఆ పాడుబడ్డ ఇంట్లో

పదిహేనుసంవత్సరాల క్రితం జరిగిన సంఘటనల్ని గురించి చెప్పుకొచ్చాడు.

అతడక్కడ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడని తెలిసింది. బట్టతల మధ్య అతనికళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. ముఖం పాలిపోయింది. ఆకలితో అతని పొట్ట పేగులనంటింది.

పడవవాళ్ళు సాయంత్రపు ప్రార్థన ముగించుకొని వంటపనిలో నిమగ్నులయ్యారు. క్రమంగా చీకట్లు అలుముకున్నాయి. ఆ చీకట్లోపాడుబడ్డయిల్లుబంటరిదయ్యంలాఉంది.

స్కూలుమాష్టరు చెప్పుకుపోతున్నాడు. "పది సంవత్సరాలక్రితం నేనిక్కడకు వచ్చినప్పుడు ఈ ఇంట్లో భూషణ్ సాహా ఉండేవాడు. అతనికి అడివంత ఆస్తిఉంది. పైగా అతని మేనమామ దుర్గాసాహాకు పెద్దవ్యాపారం ఉంది. కాని అతనికి పిల్లలులేరు.

"అతడు బాగా చదువుకున్నవాడు. ఒక్క తప్పుకూడా దొర్లకుండా ఇంగ్లీషు మాట్లాడేవాడు. అతడు క్రమంగా సాయిబులతో పరిచయం ఏర్పరచుకున్నాడు. వారిలాగానే గడ్డంకూడా పెంచుకున్నాడు. చూపులకు బెంగాలీ నవయువకుడిలా ఉండేవాడు.

"అతని భార్య చాల అందమయింది. కాలేజి విద్య ఒకపక్క; అందమైన భార్య మరోపక్క ఇంటివద్ద సనాతన సాంప్రదాయాలను మార్చివేశాయి. అతనికి జబ్బు చేసినప్పుడు అసిస్టెంటు సర్జనును పిలిపించారు. అది నయం కావడానికి

బోలెడు ఖర్చయింది. అతడు తిండికి బట్టలకు విపరీతంగా ఖర్చు చేసేవాడు. ఇక భార్య నగలవిషయం చెప్పనే అవసరంలేదు.

"మీకు వివాహమయ్యే ఉంటుంది. సాధారణ స్త్రీ మామిడికాయల్ని, మిరపకాయల్ని, పరుషమైన భర్తని ఇష్టపడుతుందని మీకు చెప్పనవసరంలేదు. భార్యకు లోకువ గనుక ఇస్తే భర్త త్వరలోనే ఆమె ప్రేమను కోల్పోవడం ఖాయం.

"ఈ విషయంలో నాకు కొంత అనుభవం ఉంది. లేడి తన కొమ్ముల్ని పదును పెట్టుకోవడానికి ఓ గట్టిచెట్టుని ఎంచుకుంటుంది. అంతేగాని తన కొమ్ముల్ని అరటిచెట్టుకేసి రుద్దుకోదు. అనాదినుంచి స్త్రీ, పురుషుణ్ణి తన చేతికింద ఉంచడానికి ప్రయత్నిస్తూనేఉంది. శతాబ్దాల తరబడి అమ్మమ్మల నుంచి అనువాయితీగా వస్తున్న కన్నీరు, అలక మొదలైన ఆయుధాలు నవీనస్త్రీల చేతుల్లో ఎందుకూ కొరగావు.

"భూషణ్ అటు వ్యాపారంలో కాని, ఇటు ఇంట్లో కాని రాణించలేకపోయాడు. అతని భార్య మణి, కన్నీరు లేకుండానే డక్కా ముజలీచీరలు, తదితర విలాసవస్తువులు కొనుక్కోగలిగేది. భర్తదగ్గరున్న డబ్బే అతనిమీద ఆమెకు ప్రేమను కలుగజేసింది. అతని దగ్గర తీసుకున్న వస్తువులకు ఆమె ఏ రూపంలోనూ ప్రతిఫలాన్ని ముట్టజెప్పి ఎరుగదు. ఆమెకు ఎంత ఎక్కువ ఇస్తే ఆమెదగ్గరనుంచి అంత ఎక్కువ పొందవచ్చని అనుకునేవాడా తెలివితక్కువ భర్త. కాని ఫలితంమాత్రం తద్వైపరీత్యం.

"దీనిఫలితం ఏమిటంటే మణి ఆమె భర్తను కేవలం డక్కా- మజిలీచీరలు, తదితర విలాసవస్తువులు కొనిపెట్టే యంత్రంగా భావించింది. ఆ యంత్రం సరిగా నడవడానికైనా దాని చక్రాలకు నూనె అవసరం ఉంటుందనికూడా ఆమె ఎప్పుడూ తలంచలేదు.

"అసలు భూషణ్ స్వగ్రామం పిల్‌బేరీ. అయితే వ్యాపారం నిమిత్తం ఇక్కడికొచ్చి స్థిరపడిపోయాడు. అతనికి తల్లి లేదు. అతని స్వగ్రామంలోని ఇంటినిండా కోకొల్లలుగా మేనత్తలు, మేనమామలు తదితర బంధువులు ఉన్నారు. ఆ ఇంట్లోంచి తన భార్యను తీసుకొచ్చి ఇక్కడ కాపురంపెట్టాడు.

"భూషణ్ భార్య మితభాషి ఇరుగుపొరుగు వాళ్ళతో కూడా కలుపుగోలుతనంగా మాట్లాడడు. బ్రాహ్మణులకు భోజనాలు పెట్టడంగాని దానధర్మాలు చెయ్యడంగాని ఆమె అభీష్టంగాదు భర్త తనపట్ల చూపించే ప్రేమని తగ్గకుండా కాపాడటం ఎలాగా అని ఎప్పుడూ ఆలోచిస్తుండేది. ఆమెలో ఉన్న ప్రత్యేకతేమిటంటే తన యవ్వనసౌందర్యాన్ని ఒక్క అణువుకూడా తగ్గకుండా ఎల్లప్పుడూ కాపాడుకునేది. ఆమె వయస్సెంతో ఎవరికీ తెలియదు. కాని పదహారేళ్ళ వయస్సు కంటె ఎక్కువున్నట్లు పైకి కనిపించదు.

"అయితే ఇంటిపనుల విషయంలో మాత్రం మణి చాల నిక్కచ్చిగా ఉండేది. అవసరమైనవారికంటే ఎక్కువ సేవకుల్ని ఎప్పుడూ ఉంచేదికాదు. తను చెయ్యగలిగిన పనికి మరెవరికైనా డబ్బిచ్చి చేయించుకోవడమంటే ఆమెకు ప్రాణం ఒప్పేదికాదు.

"ఎవరిగురించీ ఆందోళన పడకుండా, ఎన్నడూ ప్రేమ చేత తిరస్కృతి కాకుండా. ఏ రోగమూ రొష్టూ లేకుండా, ఎప్పుడూ పని చేసుకుంటూ తద్వారా బాదుపు చేసుకునేది.

"చాలామంది భర్తలు దీన్ని అదృష్టంగా భావిస్తారు. భార్య అందంగాఉంటే భర్త ఆమెను ప్రేమించడం సహజం. భార్య, భర్తమీద ఎక్కువ మక్కువ చూపించడంవల్ల భార్యకేమీ నష్టంలేదు. కాని అది భర్తకుమాత్రం అదృష్టం కాదు. ఇది నా నిశ్చితాభిప్రాయం.

"మీకు విసుగు పుట్టించడం లేదనుకుంటాను. నేను ఒంటరివాణ్ణి. భార్యచేత తిరస్కృతుడనైనవాణ్ణి. ఎల్లప్పుడూ ఆ సామాజిక విషయాలన్నీ ఆలోచిస్తూ కూర్చుంటాను. కాని బళ్ళో పిల్లలతో ఆ విషయాలు చర్చించలేను. ఆ విషయాల్ని గురించి ఎంతగాఢంగా ఆలోచించినా ఇకముందు మన సంభాషణలో మీరే తెలుసుకుంటారు"

అతడు తిరిగి మాట్లాడటాని కుపక్రమిస్తుండగా దూరాన ఎక్కడో నక్కల కూతలు వినిపించాయి. స్కూలు మాష్టరు తనమాటల ప్రవాహాన్ని ఒకి తసేపు నిలుపుచేశాడు. అంతటా నిశ్శబ్దం పాలిస్తోంది. ఆ చీకటిరాత్రిలో ఎర్రగాఉన్న అతనికళ్ళు జ్యోతుల్లా వెలుగుతున్నాయి అతడు తిరిగి కథను చెప్పుకుపోతున్నాడు.

"అకస్మాత్తుగా భూషణ్ వ్యాపారంలో ఓ ఉపద్రవం వచ్చిపడింది. దాని స్వరూపం ఎటువంటిదో, నాలాంటి సామాన్యుడికి అంతుచిక్కదు. అకస్మాత్తుగా అతనికి మార్కెట్‌లో

అప్పు దొరకడం అసంభవమని తేలింది. ఒకనేళ దొరికినే మాత్రం దాన్ని వ్యాపారంలో పెడితే తిరిగి వెంటనే డబ్బు చేతికొచ్చే అవకాశం ఉంది.

"కాని డబ్బు అంత తేలిగ్గా దొరకలేదు ఆ ఊళ్ళోనే గనుక అతడు అప్పు పుచ్చుకుంటున్నట్లు వదంతి వ్యాపించిందంటే అతని వ్యాపారం మరింత దెబ్బ తింటుందని అతనికి తెలుసు. అంచేత ఇంకేదైనా ఊళ్ళో ఎవరిదగ్గరైనా అప్పు పుచ్చుకోవాలి. కాని అటువంటి సందర్భంలో ఏవైన వస్తువులు తాకట్టు పెడితేనేగాని డబ్బు దొరకదు అయితే తాకట్టు పెట్టడానికి తగిన వస్తువులు ఒక్కనగలు మాత్రమే ఉన్నాయి. అవి ఉంటేనేసులువుగా అప్పు దొరుకుతుంది.

"అంచేత భూషణ్ భార్యదగ్గరకు వెళ్ళాడు. అందరి భర్తల్లాగా అతడు తనభార్యదగ్గరకు వెళ్ళి అడగలేకపోయాడు అతని మనసులో ఉన్న విషయాలు విప్పి చెప్పలేకపోయాడు. భార్యమీద అతనికున్న ప్రేమ అటువంటిది.

"అత్యవసర సందర్భాల్లో ఆఖరికి ఒకటో తరగతి ప్రేమికుడుకూడా తన ప్రేయసిని డబ్బుకోసం నగలు అడగడమో, లేక ఆమెచేత ప్రామిసరీనోటు రాయించి డబ్బు తెప్పించుకోవడమో చేస్తూఉంటాడు. కాని భూషణ్ మాత్రం వాజమ్మలా మాట్లాడలేకపోయాడు. ఇదుగోచూడు ! నాకు డబ్బవసరం. నీనగలు తీసుకురా!" అన్నాడు చివరకు తెగించి.'

"అతడు చివరికెలా అయితేనేం భార్యకు అసలు విషయాన్ని ముక్తసరిగానైనా చెప్పగలిగాడు కాని దాని

ప్రయోజనం మాత్రం కనిపించలేదు, మణిముఖం పక్కకు తిప్పుకొంది. ఏమీమాట్లాడలేదు. నిజంగా అతడు చాల బాధ పడ్డాడు. మరి కాసేపాగి తనలో అనుకున్నాడు. 'ఆమె తన నగలివ్వడానికి నన్ను నమ్మకపోతే అందుకామెను బలవంతం చేసి లాక్కోడానికి నాకేమదికార ముంది?'

"ఏమైనప్పటికీ భూషణ్ తన భార్యదగ్గర నగలు తీసుకోవడానికి వెరచి చివరకు కలకత్తా వెళ్ళాడు. అక్కడెలాగో లాగు అప్పు సంపాదిద్దామనుకున్నాడు.

"సాధారణంగా భర్తనుగురించి భార్య తెలుసుకున్నంతగా భార్యను గురించి భర్త తెలుసుకోలేడు. మనుష్యుల్ని మూడు గకాలుగా విభజించవచ్చు. అందులో కొందరు మూర్ఖులు. మరికొందరు తెలివి తక్కువవాళ్ళు ఇక మిగిలినవాళ్ళు అంధులు. అయితే ఇప్పటి నాగరికి మనుషులు ఇందులో ఏతెగకీ చెందరు.

"భూషణ్ ఎస్టేటు వ్యవహారాల్ని ఓ ముసలి బ్రాహ్మణుడు చూస్తుండేవాడు. అతనికుటుంబం ఆ పదవిని వంశ పారంపర్యా నిర్వహిస్తోంది. అతనికి తోడుగా భూషణ్ మేన మామ మధుకూడా ఆ వ్యవహారాల్ని చూస్తుండేవాడు. మణి మధుని తనదగ్గరకు పిలిపించి జరిగిన విషయమంతా విప్పి చెప్పింది. 'అయితే ఇప్పుడేం చెయ్యమంటావు?' అడిగింది చివరకు.

"అతడు చాల తెలివైనవాడు. ఇటువంటి విషయాల్లో ఎలా తలదూర్చాలో అతనికి బాగా తెలుసు. ఇదేమంత

మంచి విషయంకాదు. బాబు ఎట్లాగూ అప్పు సంపాదించలేడు. చివరికి నీ నగలమీదే ఆధారపడతాడు" చెప్పాడు.

ఆమెకు అది యదార్థమైన విషయమే ననిపించింది. విపరీతంగా ఆందోళన చెందసాగింది. ఆమె ప్రేమించడానికి కేవలం పిల్లలులేరు. భర్తను అర్థం చేసుకోలేదు. సంవత్సరాల తరబడి పసిపిల్లలా జాగ్రత్తగా సంరక్షించుకొంటూ వస్తున్న ఆమె నగలు యావత్తూ వ్యాపారం అనే గంగలో కలపడం తలంచుకుంటే ఆమె ఒళ్లు గగుర్పొడిచింది. రక్తం గడ్డ కట్టింది. 'అయితే ఇప్పుడేం చెయ్యాలి?' అడిగిందామె.

'నీ నగల్ని తీసుకొని మీ పుట్టింటికి వెళ్ళిపో!' చెప్పాడు మధు. ఆ నగల్లో కనీసం సగమైనా తనచేతిని పడకుండా వుంటాయా అనుకున్నాడు తనలో.

"మణి అందుకు వెంటనే ఒప్పుకుంది వేసవి కాలపు చివరి రోజుల్లో ఒకనాటి వర్షపు రాత్రి అది. ఇదే రేవులో ఓ పడవ కట్టేసిఉంది. ఆషాఢ మాస్తకం శాలువా కప్పుకొని మణి పడవలో కూర్చుంది ఆ వర్షపు రాత్రి చీకట్లో బావురు కప్పలు బెకబెక మంటున్నాయి. పడవలో మధు నిద్రలోంచి లేచి కళ్ళు నులుముకుంటూ అన్నాడు. ఆ నగలపెట్టె ఇలా ఇవ్వు!"

'ఇప్పుడు కాదు, తరువాత. మన మిప్పుడు వెంటనే బయలుదేరుదాం" అన్నది మణి.

పడవ బయలుదేరింది. ప్రవాహ వేగంతో అక్కణ్ణుంచి వేగంగా కదిలిపోయింది. ఆరాత్రి మణి తన ఒంటి

నిండా నగలను దిగేసుకుంది. ఆ నగల్ని పెట్టెలో పెడితే ఎవరైనా ఎత్తుకుపోతారేమోనని భయపడింది. బంటికి గనుక పెట్టుకుంటే తనను చంపకుండా మాత్రం నగల్ని తీసుకోలేరు. భూషణ్‌ని మణి అర్థం చేసుకోలేదు. కాని మధుని అర్థంచేసుకోవడానికిమాత్రంఆమెకుసంకోచం కలగలేదు.

"మణిని పుట్టింటివద్ద దింపి రావడానికి వెడుతున్నానని ఎప్పటిలు వ్యవహారాలు చూసే ముసలి బ్రాహ్మణుడికి ఉత్తరం రాశేడు మధు. ఆ ఉత్తరం చూడగానే అతనికి కోపం వచ్చింది. వెంటనే అందులోని విషయాలను పొందుపరుస్తూ భూషణ్‌కు ఉత్తరం రాశాడు. ఆడవాళ్ళకు అతి స్వాతంత్రం ఇస్తే ఇలాగే జరుగుతుందని అందులో మొత్తుకున్నాడు. భూషణ్ ఆ ఉత్తరాన్ని చదివి మణి రహస్య నిర్గమనానికి హేతువేమిటా అని ఆలోచించాడు. డబ్బుకోసం తనోపక్క-యమయాతనలు పడుతుంటే. అంతగా ప్రేమించిన భార్య కూడా తనను నమ్మకుండా నగల్ని తీసుకువెళ్ళిపోవడం అతన్ని అన్నిటికంటే ముఖ్యంగా బాధించింది.

"కోపం రావలసిన సమయంలో భూషణ్‌కిదుఃఖం వచ్చింది. పురుషుడికి అడివి నిప్పులాంటి కోపం, స్త్రీకి వర్షా కాలపు మేఘంలా వర్షించే కన్నీరు ఏర్పాటు చేశాడు భగవంతుడు. కాని అది తారుమారైనట్టుంది.

"భూషణ్ తల వొంచుకొని తనలో అనుకున్నాడు. ఇదే నీతీర్పు కావొచ్చు. కాని నా విధినిమాత్రం నెరవేరుస్తాను' అతడా విషయాన్ని గురించి భార్యకు ఒక్కమాట కూడా రాయలేదు. ఆమెతో ఆ విషయాన్ని గురించి ఇక

ఎప్పుడూ చర్చించగూడ దనుకున్నాడు. నిజంగా అది ఎటు వంటి కఠినమైన శిక్ష !

"పది పన్నెండు రోజులు పోయిం తరువాత అప్పు సంపాదించి ఇక అక్కణ్ణుంచి భూషణ్ ఇంటికి బయలు దేరాడు. మణి పుట్టింటిదగ్గర తనపని పూర్తి చేసుకొని ఈపాటికి తిరిగి ఇంటికివచ్చి ఉంటుందనుకున్నాడు అమె తనను చూడగానే సిగ్గు పడుతుందనో చేసినతప్పుకు పశ్చాత్తాపం చెందుతుందనో అనుకొని ఇంట్లోకి వెళ్ళాడు.

"తలుపు తాళం వేసుంది. తాళం బద్దలుకొట్టి లోనికి ప్రవేశించాడు. ఆమె గదంతా ఖాళీగా ఉంది. ఈ ప్రపంచం ఒక పెద్ద పంజరమని అందులోంచి ప్రేమ అనే పక్షి హృదయ మాణిక్యాలను, కన్నీటి ముత్యాలను విడనాడి ఎగిరిపోయి నట్లుగా తోచిందతనికి.

మొదట్లో భూషణ్‌కి భార్యలేని లోటు పెద్దగా ఏమీ బాధించలేదు. ఆమె ఎప్పుడు తిరిగొచ్చినా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నాడు ఎస్టేటు వ్యవహారాలు చూసే ముసిలి బ్రాహ్మణుడు అతని దగ్గరకొచ్చి అన్నాడు. 'మొదలకుండా కూర్చుంటే ఏమవుతుంది? అమ్మగార్ని గురించిన సమాచారం తెలుసుకోవాలి' ఈ సూచన ప్రకారం మణి పుట్టింటికి మనిషిని పంపాడు భూషణ్. అప్పటివరకు మంచిగాని, మధుగాని అక్కడకు రాలేదని ఆ వెళ్ళిన మనిషి వార్త తీసుకొచ్చాడు.

"ఇక అన్నిచోట్లా వెతకడం ప్రారంభించారు. నది కిరువైపులా ఉన్న గ్రామాలకు వారి జాడలు తెలుసుకునేం

దుకు మనుషుల్ని పంపారు. మధును గురించి పోలీసులకు రిపోర్టు చేశారు. కాని ఫలితం కనిపించలేదు. వాళ్ళు ఏ పడవ తీసుకొని వెళ్ళిందీ. ఏ మార్గం గుండా ప్రయాణం చేసిందీ ఎంత ఆరాతీసినా కనుక్కోలేక పోయారు.

"తన భార్య తిరిగి కనిపిస్తుందనే ఆశ అన్నిరకాలుగానూ వదులుకొని, ఒకనాటి సాయంకాలము, భూషణ్ విచారంలో తన పడకగదిలోకి ప్రవేశించాడు. ఆవేళ కృష్ణాష్టమి. రోజంతా వర్షం హోరుమంటూ కురుస్తోంది. పండగ సందర్భంలో ఆ ఊళ్ళో ఓ నాటకం కంపెనీవాళ్ళు ఆరాత్రి ఓ నాటకం వేస్తున్నారు. హోరుమని కురుస్తున్న వర్షపు ధ్వనిలో ఆ నాటకంలోని పాటలు మిళితమై సన్నగా వినిపిస్తున్నాయి. భూషణ్ ఒంటరిగా కిటికీముందు కూర్చుని బయట చీకట్లోకి చూస్తున్నాడు. నినాదపడుతున్న వర్షపు తుషర్లు మినహా, దూరంగా, వినిపిస్తున్న పాటలమినహా అతని దృష్టి లగ్నమైలేదు.

"గదిలోని ఓ గోడకు లక్ష్మీ సరస్వతుల చిత్రపటాలు వేలాడుతున్నై. దగ్గెంమీద ఓ తువాలు ఓ బాడీ, ఓజత చీరలు ఉన్నై. టేబులుమీద తమలపాకుల పెట్టిలో, మణి తన స్వహస్తాలతో చుట్టిన చిలుకలు ఎండిపోయినై. ఓ అల్మారాలో రకరకాల అందమైన వస్తువులు చక్కగా పేర్చిఉన్నై. అందులో పిల్లల ఆటవస్తువులు, సెంటుసీసాలు, సబ్బుపెట్టెలు- ఇంకా అనేకమైన ఆధునిక వస్తుసామాగ్రి ఉన్నాయి. గూట్లో ఓ అందమైన గుండ్రటి దీపముంది. మణి ప్రతిరోజూ సాయంత్రం ఆ దీపాన్ని తన చేతుల్తో

వెలిగించేది. అన్ని వస్తువుల్ని విడిచి వెళ్ళేవాళ్లు జీవంలేని పదార్థాలమీద కూడా తమ ప్రభావాన్ని విడిచి వెడతారు కాబోలు. ఓ మణి, రా, వెనుదిరిగి రా! నీ దీపాన్ని వెలిగించు నీ గదినిమరోమారుకాంతితో నింపు. నీవు అద్దముందు నించొని చీర కట్టుకో. చూడు, నీ వస్తువులన్నీ నీకోసం నిరీక్షిస్తున్నై న. నీనుంచి ఎవరూ ప్రతిఫలం ఆపేక్షించడం లేదు. చెల్లాచెదరైన ఈ నిర్జీవ పదార్థాలకు నీ యవ్వన సౌందర్యంతో పాటు వెలుగు కాంతులిచ్చి జీవాన్ని వ్యామని కోరుతున్నాం. కాని, అయ్యో! ఆ నిర్జీవ పదార్థాల మూగ మొరాలకించేవారు ఆ గదిలో ఎవరున్నారు?

"అర్ధరాత్రయింది. వర్షం వెలిసిపోయింది. నాటకం లోని పాటలు వినపడ్డంలేదు. భూషణ్ అదే స్థానంలో కదల కుండా కూర్చున్నాడు. కిటికీ బయట అంతా గాఢాంధ కారంగా ఉంది.

"అతడేదో ఆలోచిస్తుండగా ఎక్కణ్ణుంచో ఘల్లు ఘల్లుమని అందెల సవ్వడి వినిపించింది. రేపుమెట్ల మించి ఆధ్వని వస్తున్నట్టుంది. ఆ కొరివి చీకట్లను చీల్చుకొని భూషణ్ అటుకేసి ఆదురాంగా చూశాడు. కాని అతని కెవరూ కనిపించలేదు. అతడా శబ్దం వస్తున్నవైపు చూడ్డాని కెంత ఆతృత పడుతున్నాడో అంతకంటే వేగంగా చీకటి తన నల్లటి ముసుగును అతనిమీద కప్పుతోంది.

ఆ శబ్దం మెట్లదగ్గర్నుంచి క్రమంగా ఇంటివైపుకు వస్తోంది. అది తలుపు దగ్గరకు వచ్చి ఆగిపోయింది. ఇంటి కాపలాదారుడు నాటకానికి వెళ్ళేముందు ఆ తలుపుకు

బయట తాళంవేసి వెళ్ళాడు. ఆ తలుపుచిూద ఘల్లుఘల్లు మని అందెల సవ్వడి పెద్దగా వినిపించింది. భూషణ్ అక్కడ మరోక్షణంకూడా కూర్చోకుండా వెంటనేలేచి, చీకటి గదుల గుండా బయటకొచ్చి తలుపు దగ్గర నించున్నాడు. బయట తాళంవేసి ఉండడంచేత తన బలమంతా ఉపయోగించి తలుపు తియ్యాడానికి ప్రయత్నించాడు. అతడు తలుపు తియ్యడాని కుపయోగించిన శక్తి, అప్పుడైన శబ్దం – అతన్ని వెంటనే నిద్రలోంచి మేలొక్కాల్చాయి. తను నిద్రపోతూ – ఆ నిద్రలోంచి తలుపు దగ్గరకు వచ్చానని అప్పుడు తెలుసు కున్నాడు. అతని ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కాళ్ళు, చేతులు మంచులా చల్లగా ఉన్నాయి. అతని హృదయం అప్పుడే ఆరబోతున్న దీపంలా కొట్టుకుంటోంది. అతనికి స్వప్నభంగ మయిం లకువాత బయటనుంచి వస్తున్న శబ్దం వర్షపు హోరు తప్పితే మరేమీ కాదని తెలుసుకో గలిగాడు.

"అదంతా కల అయినప్పటికీ ఒకవేళ నిజమేనేమోనని అనుకొన్నాడు భూషణ్. విశ్రాంతి నెరుగని ఆ వర్షపు హోరు అతనితో చెబుతున్నట్లుంది" ఈ మెలకువ ఒకకల ఈ ప్రపంచం ఒక మిథ్య!

"ఆ మర్నాడు కూడా ఆ ఊళ్లో నాటకం ఉంది. ఇంటి కాపలా మనిషికి ఆవేళకూడా సెలవే. ఆ రాత్రికి వీధి తలుపు తెరచి ఉంచమని చెప్పాడు భూషణ్ కాని కాపలా మనిషి అందుకు ఒప్పుకోలేదు. ఆ ఊళ్ళో నాటకానికి పొరుగూళ్ళ నుంచి కూడా జనం వచ్చారని, అందుచేత తలుపు తెరచి

ఉంచడం ఏమంత మంచిది కాదని అతడభ్యంతరం పెట్టాడు. కాని భూషణ్ అతని మాటల్ని ఖాతరు చెయ్యలేదు. కాపలా మనిషి ఆ రాత్రికి నాటకానికి వెళ్ళకుండా ఇంటిదగ్గరే ఉంటా నన్నాడు. కాని భూషణ్ అందుకు ఒప్పుకోలేదు. అతడు కాసేపు సందేహించి చివరకి నాటకానికి వెళ్లాడు.

"భూషణ్ ఆ రాత్రి తన పడకగదిలో కిటికీముందు మునుపటిలాగానే కూర్చున్నాడు. ఆకాశం మేఘావృతమై, కాటుకలా చీకటి అంతటా వ్యాపించింది. ఆ ప్రదేశాన్ని నిశ్శబ్దం పాలిస్తోంది. కప్పల బెకబెకలు దూరాన్నించి వినవస్తున్న పాటలు ఆ నిశ్శబ్దాన్ని పారదోలలేక పోతున్నాయి.

"అర్ధరాత్రి దాటింది. కప్పల బెకబెకలు నాటకంలోని పాటలు వినిపించడంలేదు. గాఢాంధకారపు ముసుగు రాత్రిని పూర్తిగా కప్పేసింది.

"అంతక్రితం రాత్రిలానే రేవుదగ్గర అందెల ఘలఘలలు వినిపించాయి ఈ సారి భూషన్ అటువైపు చూళ్లేదు నిరాశా నిస్పృహలతో కుములుతున్న అతని హృదయానికా మోతలు వినిపించలేదు. తనను తాను సంభాళించుకొని కదలకుండా కూర్చున్నాడు.

"ఆ అందెల సవ్వడి క్రమంగా రేవుదగ్గర్నుంచి తెరచి వున్న వీధి తలుపు దగ్గరకు ప్రవేశించింది. ఇక భూషణ్ తనను తాను అదుపులో పెట్టుకోలేకపోయాడు. అతని హృదయం పెద్దగా కొట్టుకోనారంభించింది. విస్మయంతో ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆ శబ్దం క్రమంగా వరండాలోంచి

గది తలుపు దగ్గరకువచ్చి, ఒక్కసారి ఘలం ఘలారావంతో ఆగిపోయింది

"భూషణ్ మరి నిశ్శబ్దంగా కూర్చోలేకపోయాడు. 'మణి!' అంటూ ఒక్కసారి పెద్దగా అరిచి అక్కణ్ణుంచి లేచాడు. నిద్రలోంచి విభ్రాంతిపడి లేచి, కిటికీ చువ్వలు అతని అరుపుకు ప్రతిధ్వనిస్తున్నట్లు తెలుసుకోగలిగాడు భూషణ్. బయట కప్పల బెకబెకలు వర్షపు హోరు వినిపిస్తున్నాయి

"నిరాశతో భూషణ్ తన నుదుటిని కొట్టుకున్నాడు.

"ఆ మర్నాడు నాటకం కంపెనీవాళ్ళు ఆ ఊళ్లోంచి వెళ్ళిపోయారు ఆ రాత్రి తను తప్పితే ఎవ్వరూ ఆ ఇంట్లో ఉండటానికి వీల్లేదని ఆజ్ఞ ఇచ్చాడు భూషణ్. తమ యజమాని శాంతిక్రియ చెయ్యబోతున్నాడేమో ననుకున్నారు సేవకులు. ఆ వేళంతా భూషణ్ ఉపవాసం ఉన్నాడు.

"సాయంత్రం ఆ నిర్మానుష్యమైన ఇంట్లో కిటికీ ముందు యథాస్థానంలో కూర్చున్నాడు. ఆవేళ ఆకాశం నిర్మలంగా ఉంది. నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి బాగా చీకటి పడిం తరువాత చంద్రోదయమయింది. అంత క్రితం రెండురోజుల్నుంచి గ్రామస్థులు అలసిపోయి ఉండడం చేత పెందలకడే ఎక్కడవాళ్ళక్కడ నిద్రపోయారు.

"భూషణ్ తన స్థానంలో కూర్చుని ఆకాశంలోని నక్షత్రాలకేసి తదేకంగా చూస్తున్నాడు, పంధొమ్మిది సంవత్సరాల వయస్సులో కలకత్తా కాలేజిలో చదువు తుండగా, కాలేజీ మైదానంలో తలకింద చేతులు బెట్టుకొని

వెల్లకిలా పడుకొని నక్షత్రాలకేసి చూస్తూ, పుట్టింటిదగ్గరున్న మణి అందమైన వదనాన్ని గురించి ఆలోచిస్తూ గడిపిన రోజుల్ని అతడు నెమరేసుకుంటున్నాడు.

"అతడలా చూస్తూ ఉండగానే నక్షత్రాలు ఒక్కటొక్కటే అదృశ్యమయ్యాయి. ఆకాశంనుంచి భూమిమీదికి చీకటి తెరలు పరుచుకున్నాయి. ఇవ్వాళ రాత్రి భూషణ్ మనస్సు నిర్మలంగా ఉంది.

"గడచిన రెండు రాత్రుళ్ళవలెనే రేవులోంచి శబ్దం వినిపించింది. భూషణ్ కళ్ళు మూసుకొని ధ్యానంలో పడ్డాడు. ఆ శబ్దం గది తలుపు దగ్గరకు ప్రవేశించింది. అది క్రమంగా వరండాలోంచి పడగ్గది తలుపు దగ్గరకు వచ్చింది.

"అతని హృదయం వేగంగా కొట్టుకోసాగింది ఒళ్ళంతా వొణికిపోయింది. ఈసా రతడు కళ్ళు తెరవలేదు. ఘలంఘలారావం గదిలో ప్రవేశించింది అది నెమ్మదిగా గదంతా కలయ తిరుగుతూ దణ్ణెందగ్గర కాసేపాగింది. గూట్లోఉన్న దీపందగ్గర టేబులుమీదున్న తమలపాకుల పెట్టిదగ్గర అల్మారాలో ఉన్న వస్తువులదగ్గర కొంతసేపాగి చివరకు భూషణ్ దగ్గిరకొచ్చి నిలబడింది.

"భూషణ్ కళ్ళు తెరిచాడు. గుడ్డిగాఉన్న చంద్ర కాంతిలో అతనిముందు ఓ అస్థిపంజరం ఉన్నట్టు కనిపించింది. దాని వేళ్లన్నిటికీ ఉంగరాలు తళతళ లాడుతున్నాయి. చేతుల్ని బంగారు గాజులున్నాయి. మెడనిండా నగలు దిగేసి ఉన్నాయి. ఒళ్ళంతా బంగారు కాంతిలో మెరిసిపోతోంది. పాదాలకు అందెలున్నాయి. ఎముకల గూడైన ఆ వదనంలో

నిజంగానే రెండుకళ్లు ప్రకాశవంతంగా వెలుగుతూ అతనికేసి తీక్షణంగా చూస్తున్నాయి. అది చూడగానే అతని నరాల్లోని రక్తం గడ్డగట్టుకుపోయింది, కళ్ళు మూసుకోడానికి ప్రయత్నించాడు; కాని విఫలుడయ్యాడు. నిశ్చేష్టుడై నిలబడి చూశాడు.

"ఆ అస్థిపంజరం తన దృష్టిని నిశ్చేష్టుడైవున్న భూషణ్ వైపు తిప్పి, దగ్గరకు రమ్మని చేతితో సంజ్ఞ చేసింది. ఆ ఎముకల చేతినున్న వజ్రపు టుంగరాలు మసగ్గావున్న చంద్రకాంతిలో తళతళా మెరిశాయి.

"భూషణ్ మతిపోయినవాడిలా నిలబడి అస్థిపంజరాన్ని వెంబడించాడు. అది గది విడిచి నెమ్మదిగా వరండా దగ్గర కొచ్చింది. అది నడుస్తుంటే దాని ఎముకలకు ఆభరణాలు కొట్టుకుంటూ ఘలంఘలారావం వినవస్తోంది. అది వరండా దాటి చీకటిగావున్న హాలులోకి ప్రవేశించింది. అక్కణ్ణుంచి తిన్నగా తోటలోకి వెళ్లింది వెన్నెల మసక మసగ్గా వుంది దారి సరిగ్గా కనిపించటంలేదు. తడువుకుంటూ వాళ్ళు నది రేవుదగ్గరకు చేరారు. ఆ అస్థిపంజరం ఒక్కొక్క మెట్టేదిగి ఇదివరకు శబ్దం వినవచ్చిన చోటికి ఘలం ఘలారావం చేసుకుంటూ నీటిదగ్గర ఆగింది. వరద నీటితో నది గర్జిస్తూ ప్రవహిస్తోంది.

"అస్థిపంజరం నీటిలోకి దిగింది. భూషణ్ దాన్ను సరిస్తూ ఒక పాదాన్ని నీటిలో మోపాడు. కాలికి నీళ్లు తగలగానే అతడు తెలివిలో కొచ్చాడు. అతనిముందు అస్థిపంజరం కనిపించలేదు. అవతలొడ్డున చెట్లుమాత్రం నిశ్శబ్దంగా నిలబడు

న్నాయి. నెత్తిమీద చంద్రుడు ఆశ్చర్యంగా అతనికేసి చూస్తున్నాడు. భూషణ్ ఒక్కఉదుటున నదిలోకి దూకాడు. తల నీటిలో మునిగిపోయింది. అతనికి ఈత చేతనైనా, అవయవాలు అతని స్వాధీనంలో లేకపోవడంచేత అశక్తుడై ఈదలేకపోయాడు. అతడు స్వప్న ప్రపంచంలోంచి వాస్తవిక జగత్తు సరిహద్దుల్లోకి ఒక్క అడుగు వేసి ఆ మరుక్షణంలోనే శాశ్వత నిద్రలో మునిగి పోయాడు."

కథ పూర్తిచేసి స్కూలు మాష్టరు కాసేపుమౌనంగా కూర్చున్నాడు. కథ పూర్తయ్యేసరికి అతడు తప్ప, ప్రపంచమంతా నిశ్శబ్దంలో నిద్రపోతున్నదని గ్రహించాను. చాలాసేపటివరకు నేనుకూడా మౌనంగా కూర్చున్నాను. ఆచీకట్లో నా ముఖంలోని కళవళికలు అతడు చూడలేకపోయాడు.

చివరి కతడడిగాడు నన్ను. "ఈ కథను మీరు నమ్ముతారా?"

"మరి నువ్వో?" అడిగాను.

అతడన్నాడు. "నమ్మను. అందు కొకటి రెండు కారణాలు చెబుతా."

అతడు చెబుతోంటే మధ్యలో కలుగ జేసుకున్నాను. "నాపేరు భూషణ్ సహా అయితే..."

"నేనంతే అనుకున్నాను. అయితే మీ భార్య పేరే మిటి?" అతని ముఖంలో అపజయ చిహ్నాలేమీ కనపర్చకుండా అడిగాడు.

నే చెప్పాను: "నిత్యకాళి."

——o——

రా జా — రా ణి

బిపిన్ కిశోర్ శ్రీమంతుల ఇంట్లో జన్మించాడు. రాజ భోగాలన్నీ అనుభవించాడు. అతనికి డబ్బును ధారాళంగా వెచ్చించడమే తెలుసుకాని ఆర్జించడం తెలీదు. తత్ఫలితంగా అతడు స్వగృహాన్ని విడిచిపెట్టాల్సొచ్చింది.

అతడు సంగీతం అంటే చెవి కోసుకునేవాడు. కాని ప్రపంచ జ్ఞానం శూన్యం. ఉన్నడబ్బు కాస్తా హారతి కర్పూరంలా ఆరిపోయింది తరువాత డాబు దర్బాలకు తిలోదకాలిచ్చి ఆఖరికి కట్టుబట్టల్తో మిగిలిపోయాడు.

అదృష్టవశాత్తూ రాజా చిత్తరంజన్, కోర్టుద్వారా తిరిగి తన ఆస్థిని పొందగలిగాడు. అతడో ఎమెచ్యూర్ నాటక మండలిని స్థాపించి నిర్వహించడానికి పూనుకున్నాడు! బిపిన్ కిశోర్ రూపు రేఖలు, సంగీత కళాభిరుచి గమనించి అతన్ని తన నాటక మండలిలోకి తీసుకొన్నాడు రాజా.

చిత్తరంజన్ బి. ఏ. చదివేడు. అతడు స్థితికి శ్రీమంతుడైనా పేదల ఇళ్ళల్లో భోజనం చేసేవాడు. వాళ్ళతో అరమరికలు లేకుండా కలిసి మెలిసి తిరిగేవాడు. బిపిన్‌తో పరిచయం వల్ల క్రమంగా అతడు వ్యసనానికి లోనయ్యాడు రాత్రి పొద్దు పోయేవరకు వాళ్ళిద్దరు నాటకాల్ని గురించి చర్చించుకునే వారు. బిపిన్ వల్ల తన యజమాని దురభ్యాసాలకు లోనౌతున్నాడని దివాన్ తరచుగా వాపోతుండేవాడు.

రాణి వసంత కుమారికి ఇదంతా చూస్తుంటే ఒళ్ళు మండుకొచ్చింది. ఎందుకూ కొరగాని దేశదిమ్మరికి వ్యర్థంగా

డబ్బు తగలెయ్యడం ఎందుకని ఆమె భర్తను నిగదీసి అడిగింది.

బిపిన్‌మీద తన భార్యకున్న అసూయకు లోలోన నవ్వుకునేవాడు రాజా. స్త్రీకి ఈ ప్రపంచంలో తను ప్రేమించిన వ్యక్తితప్ప మిగతా మనుషుల్ని గురించి బొత్తుగా తెలియదు. భర్తకు భోజనం పెట్టేముందు భార్యపడే ఆందోళన అంతాఇంతా కాదు. కాని ఇంటి నౌకర్లు కడుపునిండా అన్నం తింటున్నారో లేదో తెలుసుకోవలసిన అవసరం ఆమెకులేదు. ఈ పాశ్చిక దృష్టిని తలచుకొని రాజా ఆమెను మృదువుగా మందలించేవాడు.

కాని వాళ్లిద్దరి విషయం ఏలావున్నా మధ్యలో పడి నలిగిపోతున్నాడు బిపిన్. రాణి అతన్ని ఈసడించుకోవడంతో నౌకర్లుకూడా అతన్ని అలక్ష్యం చేశారు. ఇక అతనిపనులన్నీ అతనే చేసుకోవాల్సి వచ్చింది. ఆ విషయాన్ని గురించి రాజాతో మాత్రం ఏమని ఫిర్యాదు చేసుకోగలడు? అంచేత మెదలకుండా ఊరుకున్నారు.

రాణి ఒకసారి నౌఖరు పూటీని చీవాట్లుపెట్టింది. "నువ్వెప్పుడూ పని తప్పించుకుంటున్నావు రోజస్తమానం ఏంచేస్తున్నావ్ ?

"అమ్మగారూ! మహారాజాగారి ఆజ్ఞప్రకారంరోజంతా బిపిన్ బాబు దగ్గర పనిచేస్తున్నానని" చెప్పాడు నౌఖరు.

"మీ బిపిన్ బాబు నవాబా, ఏం?" రాణి అతన్ని వ్యంగ్యంగా దూషించింది.

ఇక అంతే, పూటీ ఆమె మాటను పట్టుకున్నాడు, ఆ మర్నాటినుంచి బిపిన్‌బాబు గదిలోకి వెడితే ఒట్టు. అతనికి భోజనం తీసుకెళ్లడం కూడా విరమించుకున్నాడు. తళ్ళలి తంగా బిపిన్ తరచుగా పస్తులు పడుండేవాడు. ప్రతి చిన్న విషయాన్నీ తీసుకెళ్లి రాజాకు చెప్పడం అతని కిష్టంలేదు. రాజాముందు తలవొంచి తన హీనత్వాన్ని ప్రదర్శించుకోవడం అతనికి చిన్నతనం అనిపించింది. నాటినేమీ పట్టించుకోకుండా అంతా మనమంచికే అని ఊరుకున్నాడు క్రమంగా అతనిమీద రాజాకు అభిమానం పెరుగుతున్న కొద్దీ రాణీకి అయిష్టత హెచ్చుతోంది.

'సుభద్రా హరణం' నాటకం రిహార్సిల్స్ పూర్తయిపోయాయి. ఇక ప్రదర్శించడమేనాయె తరువాయి కోర్టు ఆవరణలో వేదిక తయారయింది. రాజా కృష్ణుడి పాత్ర ధరించాడు. బిపిన్ అర్జునుడుగా నటించాడు. అతడెంత బాగా పాడాడని! ఎంత అందంగా కనిపించాడని! ప్రేక్షకు లతన్ని తెగపొగిడారు.

నాటకం పూర్తయింది. రాజా, రాణీ దగ్గరకు వెళ్ళి ఎలావుందని అడిగాడు. "బిపిన్ అర్జునుడి పాత్ర చాలా గొప్పగావేసి ఒప్పించాడు. అతడు ఉన్నత కుటుంబంనుంచి వచ్చినవాడిలా వున్నాడు అతని కంఠం ఎంత మాధుర్యంగా వుందనీ!" పొగిడింది రాణి,

"మరి నేనెలా వున్నాను? నే అందంగాలేనా? మరి నాకు తియ్యటి గొంతులేదా!" రెట్టించాడు రాజా.

"మీ విషయం వేరు." చెప్పింది రాణి. ఇల్లా అని ఆమె బిపిన్ నటనా చాతుర్యాన్ని గురించి మరొకమారు పొగడింది.

ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి ఇదివరకటి దాకా బిపిన్‌ని తెగపొగిడిన రాజా ఇప్పుడు తెగనాడుతున్నాడు. ప్రజలు అనవసరంగా అతనికి లేనిపోని ప్రాధాన్యత అంటగడుతున్నారని బాధపడ్డాడు. అతని రూపురేఖల్లో కాని కంఠంలోకాని ఏం ప్రత్యేకతవుంది ? అంత కితందాకా బిపిన్‌కి అనవసర ప్రాధాన్యత ఇచ్చినవాడిలో తనూ ఒకడు. కాని ఇప్పుడు అకస్మాత్తుగా అతని అభిప్రాయం మారిపోయింది.

ఆ మర్నాటినుంచి బిపిన్‌కి మంచిమంచి వంటకాలతో భోజన ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. రాణి రాజాతో అన్నది." బిపిన్ బాబు ఆమూల చీకటి గదిలో ఉండడం అతని హోదాకు తగిందికాదు. ఆయనకు మరో మంచిగది చూపిస్తే బాగుంటుంది."

"ఆఁ అలాగా!" అని ఎగతాళిచేసి ఊరుకున్నాడు రాజా.

ఆ నాటకాన్ని మరోమారు ప్రదర్శించమని రాణీ పదే పదే అభ్యర్థించింది. కాని రాజా అందుకు పెడచెవిని పెట్టాడు.

తనపని సరిగా చెయ్యడంలేదని రాజా ఒకసారి పూటీని తెగ చీవాట్లు పెట్టాడు. "నేనేం చెయ్యనండీ! రాణీగారి ఆజ్ఞ ప్రకారం పగలస్తమానం బిపిన్ బాబుగారి పని చేస్తున్నాను" అన్నాడు పూటీ.

రాజాకు ఎక్కడలేని కోపం వచ్చింది." బిపిన్‌బాబు నవాబా ఏంటి తనపని తాను చేసుకోలేడూ?" అన్నాడు. ఇక ఆవేళతో పూటీ బిపిన్ గదికి వెళ్ళడం స్వస్తి చెప్పాడు. బిపిన్ తిరిగి వెనకటి స్థితిలోకి మారాడు.

బిపిన్ పాటలంటే రాణి చెవి కోసుకునేది. అతని తియ్యటి గొంతుని తెగ పొగిడేది. సాయంత్రంపూట తన భర్త, బిపిన్ కలిసి క్రొత్తక్రొత్త పాటలకు ట్యూన్స్ కడుతోంటే ఆమె ఆ పక్కగదిలో పరదామాటున వుండి వాటిని కుతూహలంతో వింటుండేది. ఆ తరువాత రాజా ఆ కార్యక్రమాన్ని కట్టిపెట్టి తన సొంత వ్యవహారాలకి అధిక కాలాన్ని వెచ్చించ నారంభించాడు సాయంత్రంవేళ సంగీత కార్యక్రమం ఆగిపోయింది.

చిత్తరంజన్ తన జమీందారీ వ్యవహారాల్ని మధ్యాహ్నంవేళ చూస్తుండేవాడు. ఓరోజు ఆయన పెందలకడే అంతఃపురంలోకి వెళ్ళాడు. రాణీ ఏదో చదువుతోంది. "నీ చేతిలోవున్న పుస్తకం ఏమిటి?" అడిగాడు.

రాణి ముందు చెప్పడానికి కొంచెం సంకోచించింది. మరికాసేపటికి ఉన్నదున్నట్టుగా చెప్పింది " బిపిన్‌బాబు పాటల పుస్తకంలోని పాటల్ని వల్లెవేస్తున్నా. మీరు సాయంత్రం సంగీత కార్యక్రమం నిలిపివేసిం తరువాత నాకేం ఊసుపోవడంలేదు "

ఆ మర్నాడు బిపిన్‌ని బర్తరపు చేశాడు రాజా. అక స్మాత్తుగా అతన్ని తీసివేస్తే ఎలా బ్రతుకుతాడో అనికూడా ఆలోచించలేదు.

బిపిన్‌కి ఇదేమీ విచారం కలిగించలేదు. కాని అతడు రాజాతో ఎంతో సన్నిహితంగా మెలిగాడు అతన్ని డబ్బు కంటే అధికంగా ప్రేమతో శాలించాడు. అటువంటి తనమీద అతని ఆకస్మిక కోపానికి కారణ మేమిటో బిపిన్‌కు అంతు చిక్కలేదు. "కర్మ ఇదంతా కర్మ" అనుకున్నాడు తనలో. ఇక అప్పుడు పెద్దవేడి నిట్టూర్పు విడిచాడు. తన సామాన్లన్ని తీసుకున్నాడు తన జేబులో మిగిలిన రెండు నాణేల్ని పూటికి కడసారి చిహ్నంగా యిచ్చి, తనకెవరూ బంధుమిత్రులు లేని విశాల ప్రపంచంలోకి నడిచి వెళ్ళాడు.

vaaradhionline.com

అస్థిపంజరం

మా పిల్లలందరం ఓ గదిలో పడుకునేవాళ్ళం. మా పక్కగదిలో ఓ మానవ అస్థిపంజరం వేలాడుతుండేది. రాత్రి పూట గాలికి దాని ఎముకలు గలగలలాడుతున్న శబ్దం వినిపించేది. పగటిపూట ఆ ఎముకల్ని మేము గలగలలాడించేవాళ్ళం. మా సంరక్షకులు సైన్సులో మమ్మల్ని దిట్టలుగా చెయ్యడానికని శరీరశాస్త్రం గురించిన పాఠాలు చెప్పడానికి ఓ ఉపాధ్యాయుణ్ణి నియమించారు అయితే అందులో ఎంత వరకు కృతార్థులమైనదీ మేము చెప్పలేం.

చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. ఈలోగా అస్థిపంజరం గదిలోంచి అదృశ్యమైంది మేము శరీర శాస్త్రానికి సంబంధించిన విషయాలనన్నీ మర్చిపోయాం.

ఓరోజున మా ఇల్లు అతిథులతో నిండిపోయింది. ఆరాత్రి నేను నా పాతగదిలో పడుకోవాల్సి వచ్చింది. ఆపరిసరాలన్నీ నాకు కొత్తగా తోచాయి. అలవాటుతప్పిందేమో ఆగదిలో నాకు నిద్రపట్టడం లేదు. పక్కమీద అటూ ఇటూ దొర్లుతున్నాను. ఆ రాత్రి చర్చి గడియారం వరుసగా గంటలు కొట్టడం వింటూ పడుకున్నాను. గదిమూల ఉన్న దీపం నూనెలేక గప్పు గప్పునుంటూ కొట్టుకుంటూ ఆరిపోయింది. దీపం ఆరిపోవడంతోపాటు నా ఆలోచనలు కూడా ఆగిపోయాయి.

అంతలో అస్థిపంజరాన్ని గురించిన జ్ఞాపకజాడలు నన్ను చెంటాడాయి. అది ఎలా ఉండేదీ స్మరణకు తెచ్చుకుంటున్న సమయంలో నా మంచంచుట్టూ ఏదో తిరుగుతున్నట్లుగా తోచింది. దాని వేగమైన ఉచ్ఛ్వాసాన్ని నేను వినగలుగుతున్నాను. గదిలో అది దేనికోసమో తారట్లాడుతున్నట్లుగా అడుగుల సవ్వడి వినిపిస్తోంది. వ్యర్థమైన ఆలోచనతో నిద్ర రాకపోవడంచేత నా నరాలస్పందనే అడుగుల సవ్వడిగా భ్రాంతిచెందానేమో ననిపించింది. ఏమైనప్పటికీ నా ఎాళ్ళంతా జలదరించింది. నా అనుమానాన్ని తీర్చుకోవడంకోసం, "ఎవరక్కడ?" అని బిగ్గరగా అరచాను. నా మంచం వద్ద అడుగుల చప్పుడు ఆగిపోయినట్లు వినిపించింది. "ఆఁ నేనే! నా అస్థిపంజరం ఓమూటు చూసుకుందామని వచ్చాను" అని సమాధానం వచ్చింది.

నా తలగడను గట్టిగా పట్టుకొని అన్నాను: "ఈరాత్రి వేళ మంచి వ్యవహారమే దొరికింది. ఆ అస్థిపంజరం నీకిప్పుడెందుకు పనికివస్తుంది?"

సమాధానం నాదోమ తెరలోంచే వచ్చినట్లుగా ఉంది. "ఏం ప్రశ్న? ఆ ఎముకల్లో నా హృదయం పరివృత్తమై ఉంది. ఇరవైఆరు సంవత్సరాల యౌవ్వన సౌందర్యం అందులో ఇమిడివుంది. దాన్ని నేను ఓసారి చూడగూడదా, ఏం?"

"అవును, మంచికోరికే! దానికోసం వెతుక్కో. నేనీలోగా నిద్రపోతాను" అన్నాను.

"నువ్వు ఒంటరిగా ఉన్నావుకదూ! మంచిది. నేనో ఘడియసేపు ఇక్కడ కూర్చుంటాను. మనిద్దరం కాసేపు మాట్లాడుకుందాం. కొన్ని సంవత్సరాలక్రితం నేను మనుష్యుల మధ్య కూర్చుని మాట్లాడేదాన్ని. కాని గతించిన ముప్పై అయిదు సంవత్సరాలనుంచి నేను స్మశానంలో, గాలిలో మూలుగుతున్నాను. పూర్వంవలే మరోసారి మానవుడితో నేను మాట్లాడతాను.

నా దోమతెర పక్కన ఎవరో కూర్చున్నట్టుగా తోచింది. నేను ఉత్సాహంతో వినయపూర్వకంగా సమాధానం చెప్పాను: "మంచిది. మనం కాసేపు సరదాగా మాట్లాడుకుందాం."

"నేను ఆలోచించేది నా జీవిత చరిత్రను గురించి, దాన్నిప్పుడు చెబుతాను"

చర్చి గడియారం రెండు గంటలు కొట్టింది.

"నేను భూమ్మీద జీవించి యున్నప్పుడు నా భర్తనుగురించి సదా భయపడుతుండేదాన్ని. గోలానికి చిక్కుకున్న చేపలా నా మనోభావాలు ఉండేవి. ఓ అగంతకుడు సూదుల్లాంటి గోలాలతో ప్రశాంతమైన నా బాల్య గృహ జీవితాన్ని బలవంతంగా లాక్కుపెళ్ళాడు. అక్కడనుంచి నాకు విముక్తి లభించలేదు. వివాహమైన రెండు మాసాలకే నా భర్త చనిపోయాడు. మిత్రులు, బంధువులు నామీద సానుభూతి ప్రకటించారు. మా మామ నాముఖాన్ని జాగ్రత్తగా పరిశీలించిన తరువాత మా అత్తతో అన్నాడు:

చూశావా! కోడలికి దుష్టకన్నుంది! – సరే, నువ్వు వింటున్నావా! ఈ కథ నీకు ఆనందంగా ఉందికదూ!"

"నిజం కథా ప్రారంభం అద్భుతంగా వుంది" అన్నాను. అయితే నన్ను చెప్పనియ్యి "విచారవదనంతో" తిరిగి మా ఇంటికొచ్చాను. అసలు నేను సహజంగా ఎంతో అందగత్తెను. "నీ అభిప్రాయం ఏమిటి?"

"కావొచ్చు. కాని నిన్నెప్పుడూ చూడలేదని గుర్తుంచుకో" అని గొణిగాను.

"ఏమిటి నన్ను చూడలేదూ? నా అస్థిపంజరం మాత్రమిటి? హాఁ...హాఁ...హాఁ...సరే, నే నూరికే అంటున్నాను. అస్థిపంజరంలోని గుహల్లాంటి రెండు పెద్ద ఖాళీప్రదేశాల్లో వెలుగుకాంతులు చిమ్మే రెండు విశాల నయనాలు ఉండేవని నిన్నెప్పుడెలా నమ్మించను? నువు చూసే పళ్ళకు పై భాగాన తమలపాకుల్లాంటి రెండు పెదవులు మందహాసంతో పారాడుతుండేవని నీకు అర్థం అయ్యేలా ఎలా చెప్పగలను? నిన్ను నమ్మించడానికి ఇప్పుడు ఎముకలమీద ఒకప్పుడు పారాడిన నా ఒంటి కాంతిని, అందాన్ని, మృదుత్వాన్ని, ఒంపుల్ని, యౌవ్వనాన్ని గురించి చెబుతోంటే ఓ చెంప సంతోషము, మరోచెంప దుఃఖము కలుగుతున్నాయి. నా కాలంనాటి గొప్ప గొప్ప డాక్టర్లు నా దేహంలోని ఎముకలు, శరీర శాస్త్రప్రతినానికి వినియోగపడతాయని కలలోకూడా తలంచలేదు. నాకు తెలిసిన ఓ డాక్టరు నన్ను బంగారు చంపా పుష్పంతో పోల్చాడని నీ వెప్పుడైనా విన్నావూ!"

"నేను నడిచేప్పుడు వజ్రం తన కాంతుల్ని వెదజల్లు తున్నట్లుగా నా ప్రతి కదలికా అన్ని వైపులకు సౌందర్య తరంగాలను చిమ్మేది. గంటల తరబడి నా చేతులను – సజీవ మానవులను పాలించిన సుందరమైన చేతులను తనివితీరా చూసుకునే దాన్ని.

"ఆ అస్థిపంజరం నామీద నీకు తప్పకు సాక్ష్యాన్ని ఇస్తోంది కదూ! నా సుందర, మృదుల ప్రేమైక స్వప్నంతో నీమనస్సులో ఉన్న శరీర శాస్త్రానికి సంబంధించిన చెత్త నంతా తొలగించి, శాశ్వతంగా నీ కళ్ళనుండి నిద్రను పార ద్రోలాలని నాకు కోరికగా ఉంది.

"నీతో ప్రమాణం చేసి చెబుతున్నాను నా మన స్సులో ఏ శాస్త్రానికి సంబధించిన విషయాలూ గుర్తులేవు. గుబురుగా ఎదుగుతున్న గాఢ తమస్సులో సుందరస్వప్నం ఒక్కటే నా మనస్సులో మెదలుతోంది. అంతకు మించి నేనేమీ చెప్పలేను" అన్నాను

"నా కెవరూ అడపిల్లలు జతలేరు" కంఠం చెప్పకు పోతోంది. "నా కున్న ఒకే ఒక సోదరుడు వివాహం చేసుకో డానికి ఇష్టపడలేదు ఇక మా ఇంట్లో నే నొక్కర్తెనే. తోటలో చెట్లనీడని ఒంటరిగా కూర్చొని ప్రపంచమంతా నన్ను ప్రేమిస్తున్నదని, ఆకాశంలో నక్షత్రాలు తదేకంగా నన్నుచూస్తూ నా అందాన్ని త్రాగుతున్నాయని, పిల్ల వాయువులు నన్ను తాకి పులకితులవుతున్నాయని, నా పాదా లను మోపిన పచ్చటి మైదానం నా స్పర్శతో స్పృహ తప్పిపోతున్నదని కలలు కనేదాన్ని. ప్రపంచంలోని యువకు

లంతా నా పాదాలకింద గడ్డిపరకలుగా కనిపించేవారు. కానీ నాహృదయంలో విచారం గుబులుగా ఎందుకు అలుము కుంటుందో అర్థం కావడంలేదు.'

"నా సోదరుని మిత్రుడు శేఖర్ మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అప్పుడు మా ఇంటి డాక్టరుగా వచ్చాడు. తెర వెనుకనుండి అతన్ని నేను చాలాసార్లు చూశాను. నా సోదరుడితో వింత మనిషి. కళ్ళు తెరచి ప్రపంచాన్ని చూడ్డానికి ప్రయత్నించే వాడు కాదు. శేఖర్ ఒక్కడే అతని ఏకైక మిత్రుడు. అంచేత నాకు తెలిసిన యువకుడల్లా అతనొక్కడే. తోటలో సాయంత్రం కూర్చున్నప్పుడు నా స్మృతిపథంలో కదులాడే యువకులంతా శేఖర్‌గానే తోచేవారు. ఏంటి వింటున్నావా? ఏమిటాలోచిస్తున్నావు?"

"నేనే ఆ శేఖర్ అనుకుంటున్నాను" నిట్టూర్పువిడిచి చెప్పాను.

"కాస్సేపాగు. ముందు కథంతా పూర్తిగా విను. వర్షాకాలంలో ఓసారి నేను జ్వరపడ్డాను. డాక్టరు నన్ను చూడ్డానికి వచ్చాడు. అదే మా తొలి కలయిక. డాక్టరు రాగానే నా ముఖంలోకి చూశాడు. నేనూ అతని ముఖం కేసి చూశాను. సాయంత్రపు వింతకాంతిలో అతని ముఖం తెల్లటి మృదువైన తలగడమీద అప్పుడే రాలిపడుతున్న పుష్పంలా ఉంది.

"ఆమె నాడి చూడవచ్చా!" డాక్టరు నెమ్మదిగా నా సోదరునితో అన్నాడు.

పునుపైన గుండెటి నా మణికట్టును చూచాను. రోగి నాడిని చూడడానికి భయపడుతున్న డాక్టరును నేనింత వరకు ఎక్కడా చూడలేదు. నా మణికట్టును పట్టుకోగానే అతని వేళ్ళు వణికాయి. అతడు నా జ్వరాన్ని కొలిచాడు, నే నతని హృదయ స్పందనను కొలిచాను - ఏం? నన్ను నమ్మలేవూ?

"ఓ తప్పకుండా! నమ్మకపోవడమేమిటి?" అన్నాను.

నా జబ్బు నయమై కోలుకున్న తరువాత నా స్మృతి పథంలో ఒకేవక డాక్టరు, ఒకేవక రోగి మిగిలారు.

"రోజూ సాయంత్రంవేళ అందంగా అలంకరించుకొని, ఓ చిన్న అద్దాన్ని చేతపుచ్చుకొని, తోటలో చెట్లకింద కూచునే దాన్ని.

"ఎవరి అందాన్ని వారు చూస్తూ కూర్చుంటే విసుగు పుట్టదా అని అనుకుంటున్నావుకదూ! అది సరికాదు. నే నప్పుడు ఇద్దరు వ్యక్తులుగా కనిపించేదాన్ని. నేను డాక్టరు వలె చూసేదాన్ని. నాకు సంతోషం కలిగేది. నేను ప్రేమ పిచ్చిలో పడ్డాను."

"ఏమైనప్పటికీ అప్పట్నుంచి నేను ఒంటరిదాన్ని కాదు. నేను నడుస్తున్నప్పుడు, నా బొటనవేళ్ళు నేలమీద వయ్యారంగా చేస్తున్న నృత్యాన్ని డాక్టరు చూస్తే ఎంత మధురంగా ఉంటుంది అని ఆలోచించేదాన్ని. మధ్యాహ్నం వేళ ఆకాశంలో ఎర్రటిఎండ, అప్పుడప్పుడు గ్రద్ద అరుపులు తప్ప మరేమీ కనిపించేవి కావు. మా తోటగోడల అవతల గాజులబత్తి కేకలుమాత్రం వినిపించేవి. నేను పచ్చికమీద

తెల్లటి వస్త్రాన్ని పరుచుకొని, మోచేతిమీద తలపెట్టుకొని పడుకునేదాన్ని రెండోచేతిని నాజుగ్గా కింద ఆనించేదాన్ని ఎవరో నాచృదులహస్తాన్ని తన రెండు చేతులతో స్పృశించి నా అరచేతిని ముద్దిడి వెనుదిరిగి వెళ్ళిపోతున్నట్లుగా భావించే దాన్ని - ఇక్కడితో కథను అంతంచేస్తే ఎలా ఉంటుంది?"

"అంత రక్తికట్టదు. అసంపూర్తిగా మిగిలిపోతుంది. అయినా శేషించిన రాత్రిని కథాంతం చెయ్యడానికి వెచ్చించ గలనని" చెప్పాను.

"సరే నన్ను చెప్పనియ్యి. డాక్టరుకు కొంత ప్రాక్టీసు వృద్ధికాగానే మా ఇంట్లో ఓగది తీసుకొని అక్కడ రోగులకు సలహాలు చెప్పేవాడు. అప్పుడప్పుడు నేను మందులను గురించి, విషాన్ని గురించి హాస్యంగా అడిగేదాన్ని. ఏమందు మనుషుల్ని చంపుతుందో తెలుసుకునేదాన్ని. అతనికి విసుగు పుట్టేది. ఆ సంభాషణలు నన్ను మృత్యుముఖంలోకి లాక్కు వెళ్ళేవి నా చిన్నారి ప్రపంచంలో ప్రేమ, చావు - రెండే వస్తువులున్నాయి. నా కథ దాదాపు పూర్తయింది. పెద్దగా మిగిలిందేమీ లేదు.

"రాత్రికూడా ఏమంత పెద్దగా శేషించిలేదు" గొణిగాను.

"కొంత కాలానికి డాక్టరు పూర్తిగా మతిమరుపుతో వింతగా ప్రవర్తించడం మొదలెట్టాడు. నాకేదో విషయాన్ని చెప్పకుండా దాచడానికి ప్రయత్నిస్తున్నాడు ఓరోజు సాయంత్రం అతడు కొత్తదుస్తులు వేసుకొని మా ఇంటికొచ్చాడు. నా సోదరుని బండి తీసుకొని ఎక్కడికో వెళ్ళాడు."

"ఆదుర్దాగా నా సోదరుని దగ్గరకు వెళ్ళి డాక్టరు ఎక్కడకు వెళ్ళాడు" అడిగాను.

"మృత్యువును కలుసుకోవడానికి వెళ్ళాడు" అన్నయ్య చెప్పాడు.

నాకర్థం కాలేదు. "ఆయన నిజంగా ఎక్కడకెళ్ళిందీ చెప్పన్నయ్యా" అని అడిగాను.

"పెళ్ళి చేసుకోవడానికి" అన్నాడు తాపీగా.

"ఆఁ. నిజంగా?" అని నేను విరగబడి నవ్వాను.

"వధువు కట్నంగా చాలా డబ్బు తీసుకొస్తుందని నాకు తరువాత తెలిసింది. ఈ విషయాలన్నీ నాకు చెప్పకుండా దాచిపెట్టి అతను నన్నెందుకు అవమానించాలి? అతన్ని నేనేమైనా పెళ్ళిచేసుకోవద్దని బ్రతిమిలాడానా? నన్ను పెళ్ళి చేసుకోకపోతే నా హృదయం బ్రద్దలై పోతుందని చెప్పానా? లేదే? మగవాళ్ళను నమ్మకూడదు. నా జీవితంలో ఒకేఒక మనిషిని ఎరిగిఉన్నాను. ఒక క్షణంలో నేనీ విషయాన్ని కనిపెట్టగలిగాను."

డాక్టరు తన పని చూసుకొని వెళ్ళిపోబోతుంటే పిలిచి నవ్వుతూ అడిగాను: "అయితే డాక్టరుగారూ! మీరీ రాత్రి పెళ్ళి చేసుకుంటున్నారన్నమాట"

ఆయనకు కోపం వచ్చింది.

"ఏమిటి! బేండుమేళం లేదా! విందు భోజనాలు లేవూ?" మళ్ళీ అడిగాను.

అతడు నిట్టూర్పు విడిచి అన్నాడు: "వివాహం అంత సంతోషకరమైన సంఘటనా?"

నేను పగలబడి నవ్వాను. "మేళం లేకుండా, విందు భోజనాలు లేకుండా పెళ్ళి జరగడాన్ని గురించి నేను సహించలేను" అన్నాను.

వధువును గురించి ఆలోచనతో నా మనస్సు నిండి పోయింది. "డాక్టర్, మీరింకా నాడులు చూస్తూనే ఉంటారా?" అడిగాను. ఈ మాటలు డాక్టరు హృదయంలో సూదుల్లా గుచ్చుకున్నాయి.

పెళ్లి అర్ధరాత్రి జరుగుతుంది. డాక్టరు, మా అన్నయ్య బయలుదేరబోయే ముందు గదిలో కూర్చుని బ్రాందీరసం తాగుతున్నారు. అది వారి మామూలు అలవాటు, అప్పుడే చంద్రుడు ఉదయించాడు

నేను నవ్వుతూ వెళ్ళి, "మీ పెళ్ళి సంగతి మర్చి పోయారా డాక్టర్? బయలుదేరే వేళయింది" అన్నాను.

"ఇక్కడ నీతో చిన్నవిషయం చెప్పాలి. ఈలోగా నేను డిస్పెన్సరీలోకి వెళ్ళి కొంతపొడరు తీసుకొచ్చాను. డాక్టరు చూడకుండా ఉన్నప్పుడు దాన్ని అతని గ్లాసులో కలిపివేశాను."

డాక్టరు గ్లాసును ఖాళీచేశాడు, నా వైపు తీక్షణంగా చూస్తూ "ఇక నేవెళ్ళాలి" అన్నాడు.

"నేను గదిలోకివెళ్లాను. పెళ్ళికుమార్తెలా అలంకరించు కున్నాను. పెట్టెలోని నగలన్నీ తీసి ఒంటికి పెట్టుకున్నాను. నుదుటిమీద సింధూరం పెట్టుకున్నాను. పట్టుబట్టల్లో పెళ్ళి కూతురులా తళతళా మెరిసిపోతున్నాను. తోటలోకి వెళ్ళి కింద నాపక్క పరుచుకున్నాను."

"అది సుందరమైన రాత్రి. చల్లటి పిల్లవాయువులు అలసట చెందిన ప్రపంచాన్ని ఉపశమింప జేస్తున్నాయి. కోటంతా జాజిమల్లి సువాసనలతో గుబాళించి పోతోంది."

"ప్రకాశంగా చంద్రకాంతి క్షీణిస్తోంది. సంగీతపుధ్వనులు వినిపించడం లేదు. ఈ ప్రపంచమంతా ఓ స్వప్నంలా కని పిస్తోంది. నేను కళ్ళు మూసుకొని చిరునవ్వు నవ్వాను."

"ఎవరైనా నన్ను చూసినప్పుడు నా పెదవులమీద తాండాడే చిరునవ్వును- అదే శోభనం గదిలో నా ముఖంలో ప్రకాశించవలసిన నవ్వును- అర్థం చేసుకోగలరా? కాని, అయ్యో! శోభనం గది!... పెళ్ళికూతురు సింగారం!... కాలోని గలగల శబ్దానికి లేచినప్పుడు నా అస్థిపంజరం వద్ద ముగ్గురు విద్యార్థులు నిలబడి నా ఎముకల్ని పరీక్షిస్తున్నారు. నా హృదయంలో ఎక్కడైతే సుఖదుఃఖాలు స్పందనచేసేవో అనూవ్వన పత్రాలు తొడుగులు విడిచేవో, అక్కడ మాష్టరు కన కర్రతో నాఎముకల్ని తడుముతూ వరుసగా పేర్లు చెబు తున్నాడు. నా కడసారి చిరునవ్వును నా హృదయంలో పదిల పర్చుకున్నా. దాన్ని పదేపదే జ్ఞాప్తికి తెచ్చుకుంటున్నాను. కాని చిహ్నాలేమైనా నువ్వు చూశావూ?"

"సరే కథ ఎలా ఉంది?"

"అద్భుతంగా ఉంది" అన్నాను.

కథ పూర్తయ్యేసరికి తొలికోడి కూసింది. "నువ్వక్కడే ఉన్నావా?" అడిగాను. కాని జవాబు రాలేదు.

ఉదయభానుని లేత కిరణాలు గదిలో ప్రవేశించాయి.

ధర్మకర్త

బృందావన కుందూ కోపంతో తండ్రిదగ్గరకు వచ్చి "తక్షణమే నేవెళ్ళి పోతున్నాను" అన్నాడు.

"కృతఘ్నుడా! ఇంతకాలంనుంచి నీ పోషణ కోసం నేఖర్చు పెట్టిందంతా చెల్లించిపోగల తాహతుంటే ఫో" అన్నాడు తండ్రి జగన్నాధ కుందూ.

ఒక్క మాటలో చెప్పాలంటే జగన్నాధకుందూ ఉత్తి పిసినిగొట్టు. బృందావన్ ఒక్కడే ఉన్నంతకాలం తండ్రీ కొడుకులకు సాఫీగానే సాగిపోయింది. కాని బృందావన్‌కు పెళ్ళయిన దగ్గర్నుంచి వ్యవహారం ముదిరి పాకాన పడింది. ప్రపంచిక సుఖాలకోసం ప్రాకులాడవద్దని తండ్రి చెప్పేవాడు. సరైన జీవితాన్ని గడపటానికి మంచి తిండి, బట్ట కావాలని కొడుకు అడిగేవాడు.

ఈ విధంకా తండ్రి కొడుకులకు తరచుగా అభిప్రాయ భేదాలు వస్తుండేవి. అవే క్రమంగా కొట్లాటలకు దారితీసేవి. ఒకసారి బృందావన్ భార్యకు పెద్ద జబ్బు చేసింది ఓనాటు వైద్యుణ్ణి పిలిపించారు. అతడో ఖరీదైన మందును కొనాలని చెప్పేసరికి జగన్నాధ్‌కు ఒళ్లు మండుకొచ్చింది వెంటనే అతన్ని అక్కణ్ణుంచి పంపేశాడు. కాని బృందావన్ ఊరుకోలేదు. వైద్యుణ్ణి తిరిగి తీసుకొస్తానన్నాడు. అక్కడ తండ్రీ కొడుకుల మధ్య మళ్ళీ పెద్ద వివాదం చెలరేగింది. కాని తండ్రి

మాటే నెగ్గింది. తత్ఫలితంగా చివరకు బృందావన్ భార్య చనిపోయింది.

"నా భార్యను చంపింది నువ్వే. నువ్వు హంతకుడవు" అని దూషించాడు తండ్రిని కోపం పట్టలేక.

"నోరుముయ్! మందులు వేసుకునిచచ్చినవాళ్ళు లేరూ? ఖరీదైన మందులన్నీ మనుషుల్ని రక్షిస్తే మరి రాజులు, నవాబులు ఎందుకు చస్తున్నారు? నీభార్య నీ తల్లికంటే! బామ్మకంటే వైభవంగా చావాలని నీ కోరికా? అందుకు నే ఒప్పుకోను" అన్నాడు తండ్రి.

బృందావన్ దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తోంది. మానవత్వం కోల్పోయిన తండ్రి దగ్గర జీవచ్ఛవంలా పడి వుండడం అతని కెంతమాత్రం ఇష్టలేకపోయింది. తన నిశ్చయాన్ని తండ్రికి చెప్పాడు "నేనీ ఇంటినుంచి వెళ్ళిపోతున్నాను".

తండ్రి వెంటనే అంగీకరించాడు. అయితే ఒక్క షరతుమాత్రం పెట్టాడు. తన ఆస్థిలో ఒక్క చిల్లిగవ్వ కూడా కొడుక్కి దక్కదని చెప్పాడు.

తండ్రి ఆస్థిలో చిల్లుగవ్వకాదు గదా యావత్తు ఆస్థి నంతా ఇచ్చినా తనకక్కరలేదు పొమ్మన్నాడు బృందావన్.

తండ్రీ కొడుకుల మధ్యదీర్ఘకాల సంఘర్షణ తరువాత జరిగిన ఈ విప్లవాన్ని గురించి గ్రామస్థులు పలు పలు విధాల వ్యాఖ్యానించారు. అయితే ఒక్క విషయంలో మాత్రం వాళ్ళంతా ఏకీభవించారు. "రోజులు మారిపోయాయి.

భార్యను గురించి తండ్రి కొడుకుల మధ్య కొట్లాటలు వచ్చే రోజు లొచ్చాయి" అన్నారు. అక్కడితో ఆగలేదు. "నీ భార్య చస్తే వెంటనే నువ్వు మరో వెళ్ళి చేసుకోవచ్చు. కాని నీ తండ్రి మరణిస్తే అతని స్థానంలో మరి నువ్వెవరినీ పొందలేవు" అన్నారు బృదావన్‌తో. ఈ వాదన అద్భుతంగా ఉందనడంలో సందేహంలేదు. కాని కర్మ సిద్ధాంతాన్ని పట్టుకొని బ్రేలాడే వాళ్ళకు సహజత్వంతో సంబంధం ఉండదు.

బృందావన్ వెళ్ళిపోవడం మొత్తంమీద తండ్రికి సంతోషాన్నే కలిగించింది. అతను పోవటంవల్ల ఇంటి ఖర్చు చాలవరకు తగ్గింది. అంతేగాక తండ్రికి ఇప్పుడు మనశ్శాంతి చిక్కింది. అదివరకల్లా తన కొక్కడ విషంపెట్టి చంపుతాడో నని భయపడేవాడు. మరి ఇప్పుడు భయపడవలసిన అవసరం లేదు.

అయితే తండ్రికున్న దిగులల్లా ఒక్కటే బృందావన్ తనతోపాటు తన నాలుగేళ్ళ కుమారుడు గోకుల్ చందును కూడా తీసుకెళ్ళాడు! ఆకుర్రాణ్ణి పెంచడానికి పెద్దగా ఏమంత డబ్బు ఖర్చుపెట్టనవసరంలేదు. అంచేత మనవడి మీద మక్కువ పెంచుకున్నాడు. బృందావన్ అతన్ని తీసుకు వెళ్ళిన తరువాత జగన్నాధ్‌కు కోపము, దుఃఖము కలిగేయి. అయితే దాన్ని ఒక విధంగా ఉపసమింప జేసుకున్నాడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తరువాత తనకు సంవత్సరానికెంత ఆదా అవుతుందో వడ్డీతో సహా లెక్కలు చూసుకొని సంతోషించాడు.

కాని గోకుల్ చంద్ర లేకుండా ఆఇంట్లోఉండగలగడం అతనికి రాను రాను అసంభమనిపించింది. తను పూజలో ఉన్నప్పుడు కొంచె చేష్టలు చెయ్యడానికి ఇప్పు డెవరూ లేరు. ముద్దుగా మాటలు చెప్పడానికి ఇప్పుడా ఇంట్లో ఎవరూ లేరు నిస్సారమైన ఒంటరి జీవితం అతనిలో నిరుత్సాహాన్ని నింపింది. కుర్రాడు తలగడకు పెట్టిన రంధ్రాలు చూస్తుంటే జగన్నాధ్ హృదయం ప్రయ్యలవుతున్నట్లుగా ఉండేది. ఒకసారి తన పంచెను చించినందుకు కుర్రాణ్ణి చితకొట్టాడు. ఆ పంచెను చూడగానే జగన్నాధ్ కళ్ళవెంట బొటబొటా అశ్రుబిందువులు రాలాయి. ఒకవేళ గోకుల్ తిరిగివస్తే ఈసారి సంవత్సరాని కోమాటు పంచె చింపినా ఏమీ కొట్టనని ప్రతిజ్ఞ తీసుకున్నాడు.

కాని గోకుల్ తిరిగి రాలేదు. జగన్నాథ్ వృద్ధుడై పోతున్నాడు. అతని యిల్లు బోసిగా వుంది.

అత డస్తమానం ఇంట్లో ఉండలేక పోతున్నాడు. మధ్యాహ్నంవేళ గ్రామ ప్రజలంతా విశ్రమిస్తూ ఉంటే, జగన్నాధ్ గ్రామమంతా కలయ తిరిగేవాడు. అతన్ని చూడ గానే పిల్లలు దూరంగా పోయి 'పిసినిగొట్టు' అని మారుపేరు పెట్టి పిలిచేవారు.

2

ఒకనాటి మధ్యాహ్నం జగన్నాధ్ మామిడి తోపు లోంచి వెడుతోంటే ఓపిల్లల తండా కనిపించింది. జగన్నాధ్ వారి దగ్గరకు వెళ్ళేసరికి పిల్లలంతా పారిపోయారు. కాని

ఓకుర్రాడు మాత్రం పారిపోకుండా అక్కడే నిల్చున్నాడు. జగన్నాథ్ అతని దగ్గరకు వెళ్ళాడు. కుర్రాడు మంచి పసిమి రంగులో నిగ్గుదేరి ఉన్నాడు. బుగ్గలు పాలుగారుతున్నై. జగన్నాథ్ అతని తల నిమిరాడు. వెంటనే అతని మనసులో ఓ ఆలోచన మెదిలింది. ఆ కుర్రాణ్ణి తనవెంట ఇంటికి రమ్మని అడిగాడు. వాళ్ళిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఇది.

"అబ్బాయీ, నీపేరేమిటి?"

"నితాయ్‌పాల్"

"మీ ఇల్లెక్కడ?"

"చెప్పను"

"మీ నాన్నెవరు?"

"చెప్పను"

"ఎందుకు చెప్పవు?"

"నేఇంటిదగ్గర్నుంచి పారిపోయొచ్చాను"

"అలా ఎందుకు చేశావ్?"

"మానాన్న నన్ను బడికి పంపడానికి ప్రయత్నించి నందుకు."

జగన్నాథ్‌కు ఇప్పటికి విషయమంతా అర్థమైంది. "సరే! అయితే నాతోవచ్చి మా ఇంట్లో ఉంటావూ?" అడిగాడు.

"ఓఁ ఉంటాను" అన్నాడు కుర్రాడు.

నితాయ్, జగన్నాథ్ ఇంట్లో ప్రవేశించాడు. అలిసి పోయిన బాటసారికి చెట్టునీడ కనిపించినట్టుగా ఉంది అతనికి.

తన మనమడు లేనిలోటును ఈ కుర్రాడి ద్వారా తీర్చుకుంటు న్నాడు జగన్నాథ్.

అకస్మాత్తుగా నితాయ్‌పాల్ ఆ ఇంట్లో అంత ప్రముఖ మైన స్థానాన్ని పొందగలగడం గ్రామస్థులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ముసలివాని మరణం త్వరలోనే సంభవమని అందరికీ తెలుసు. అతని ఆస్థి యావత్తూ ఓ దిక్కులేని అపరి చిత బాలునికి దక్కడం వారికి దుఃఖభాజకంగా ఉంది. కోపం పట్టలేక చివరికా కుర్రాణ్ని కొట్టడానికి కూడా సమకట్టారు. కాని జగన్నాథ్ అతన్ని తన ప్రాణంకంటే అధికంగా చూడ్డం చేత వారికా అవకాశం దొరకలేదు.

ఒకోసారి కుర్రాడు ఇంటికెళ్ళి పోతానని మొరాయించే వాడు. ముసలివాడు అతనికో ఎర చూపించేవాడు. "నీకు నా ఆస్థంతా ఇచ్చేస్తాను" అనేవాడు. వయస్సులో కుర్రాడైనా నితాయ్ ఆస్థియొక్క విలువను మెటనే గ్రహించేవాడు.

ఆ కుర్రాడు తండ్రినిగురించి గ్రామస్థులంతా ఆరా తియ్యడం మొదలెట్టారు కుర్రాడి కోసం తలిదండ్రు లెంత బెంగటిల్లి పోతున్నారో అని జాలి పడేవారు. వారి నంత బాధ పెడుతున్న కుర్రాడు నిజంగా మూర్ఖుడై ఉండాలి. ఇలా అనుకొని నితాయ్‌ని శాపనార్థాలతో సత్కరించేవారు.

ఓ రోజు ముసలివాడు తోటనుంచి ఇంటికొస్తుంటే దారిలో ఓ బాటసారి కనిపించాడు. దామోదర్‌పాల్ అనే ఓ వ్యక్తి తన కుమారునికోసం అన్ని ఊళ్ళూ గాలిస్తున్నా

డని, ఆ ఊరుకూడా వస్తున్నాడని అతను చెప్పాడు. ఈ సంగతి తెలుసుకోగానే నితాయ్ తన రాబోయే అస్థిని వదిలిపెట్టి పారిపోవడానికి సిద్ధమయ్యాడు. జగన్నాథ్ అతనికి ధైర్యాన్ని పురికొల్పాడు: "ఎవ్వరికి తెలియకుండా నిన్నో చోట దాస్తాను" అన్నాడు.

నితాయ్‌కి కొంత ఆందోళన తగ్గింది. వెంటనే అడిగాడు: "ఎక్కడ దాస్తావు, చెప్పు?"

"ఇప్పుడే చూపిస్తే గ్రామస్థులు చూస్తారు. అంచేత రాత్రికి చూపిస్తా!" అన్నాడు.

నితాయ్ సంతోషానికి మేరలేదు. తండ్రి తనకోసం ఊరంతా గాలిస్తాడు. కాని తను ఎక్కడా కనుపించడు. తండ్రి విసుగెత్తి వెళ్ళిపోతాడు. ఇకిప్పుడు తను బయటకొచ్చి ఇంచక్కా ఆడుకోవచ్చు! నితాయ్ ఈవిధంగా ఆలోచించసాగాడు.

మధ్యాహ్నమయింది. జగన్నాథ్ నితాయ్‌ని ఇంట్లో పెట్టి తాళం వేశాడు. ఎక్కడికో వెళ్ళి మళ్ళీతిరిగి వచ్చాడు. వచ్చీరాగానే నితాయ్ అతన్ని ప్రశ్నలవర్షం ముంచెత్తించాడు.

ఇంకా చీకటి పడకుండానే నితాయ్, "తాతా వెడదామా! అన్నాడు. ఇంకా చీకటి పడలేదు" చెప్పాడు జగన్నాథ్.

మరి కాసేపున్న తరువాత, "ఇప్పుడు చీకటి పడింది చూడు తాతా! పనం వెళ్దాం పద!" అన్నాడు నితాయ్.

- "ఊళ్లోవాళ్ళు ఇంకా నిద్రపోలేదు" గొణిగాడు జగన్నాథ్.

నితాయ్ మరోక్షణమాగి, "వాళ్ళు నిద్రపోయారు తాతా! ఇక మనం పోదాంపద!" అన్నాడు.

రాత్రి గడుస్తోంది నితాయ్ కనురెప్పలు బరువెక్కాయి. నిద్రకు తాళలేకపోయాడు. అర్ధరాత్రి అయింతరువాత జగన్నాథ్ కుర్రాడి చెయ్యి పట్టుకొని మెల్లగా బయటకొచ్చాడు నిద్రిస్తున్న గ్రామ వీధుల్లోంచి ఇద్దరూ నిశ్శబ్దంగా ఊరు బయట కొచ్చారు అంతటా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడు నక్కలు కూతలు మాత్రం వినిపిస్తున్నాయి. నితాయ్‌కి భయంవేసి జగన్నాథ్ చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

పొలాలు దాటి వాళ్లు చివరికో అడవి చేరుకున్నారు. ఓ శిధిలమైన దేవాలయం దగ్గర ఆగిపోయారు. నితాయ్ ఆశ్చర్యంగా అడిగాడు: "ఇదేనా నే ఉండేచోటు" అతడూహించుకున్న దానికి దీనికి ఎక్కడా సంబంధం లేదు. ఇంటి దగ్గరనుంచి పారిపోయి వచ్చింది లగాయితూ ఇటువంటి పాడుబడ్డ దేవాలయాలలో అతడనేక మార్లు తల దాచుకున్నాడు.

ఇద్దరూ గుడిలోపలకు వెళ్ళారు. అక్కడో మూల ఓ రాతి పలక ఉంది జగన్నాథ్ దాన్ని తొలగించాడు. దానికింద ఓ భూగర్భగుహ ఉంది. అందులోంచి ఓదీపం వెలుగుతూ కనిపించింది. నిచ్చెనసాయంతో ఇద్దరూ కిందకుదిగారు.

నితాయ్ చుట్టూ కలయజూశాడు. అతనికో మూల బిందెలు కనిపించాయి. గది మధ్యలో ఓ తివాసీ ఉంది దానిముందు పువ్వులు, గంధం, తిలకం మొదలైన పూజా సామాగ్రి ఉన్నాయి. నితాయ్, బిందెల్లో ఏమున్నాయోనని చెయ్యిపుట్టి చూశాడు. ఆశ్చర్యం! వాటిల్లో రూపాయలున్నాయి.

నితాయ్‌వైపు తిరిగి అన్నాడు జగన్నాథ్: "నా దగ్గరున్న డబ్బంతా ఇదే దీన్ని నీ కివ్వాళ వప్పజెపుతాను"

నితాయ్ సంతోషంతో ఎగిరి గంతేశాడు. "అంతా ఇచ్చేస్తావా? ఒక్క రూపాయికూడా తిరిగి తీసుకోవుకదూ!" అన్నాడు.

"ఒక వేళ తీసుకుంటే నా చెయ్యి పక్షవాతంతో పడిపోతుంది. అయితే ఒక్క పరతుంది. ఒకవేళ నా మనమడుగాని ముది మనమడుగాని మరింకెవరైనా అతనితాలూకు వారుగాని నీకు కనిపిస్తే, ఇప్పుడు నీ కిస్తున్న డబ్బంతా ఒక్క రూపాయికూడా బీరుపోకుండా ఇచ్చెయ్యాలి! తెలిసిందా?

"అలాగే!" అన్నాడు నితాయ్ ఉత్సాహంతో!

"అయితే ఈ ఆసనంమీద కూర్చో" అన్నాడు జగన్నాథ్.

"ఎందుకు?"

"నువ్విప్పుడు పూజ చెయ్యాలి"

"పూజెందుకు?" కుర్రాడు వెనక్కి తగ్గాడు.

"ఇది ఆచారం."

నితాయ్ ఆసనంమీద కూర్చున్నాడు. జగన్నాథ్ అతని నుదుటిమీద గంధపు పూతలు పూశాడు. నొసట తిలకం పెట్టాడు. మెడలో పూలదండ వేశాడు. ఇక మంత్రాలు చదవ నారంభించాడు

లక్ష్మి విగ్రహంలా కదలకుండా మంత్రాలు వింటూ కూచోవడం నితాయ్‌కేమీ నచ్చలేదు. "తాతా?" అని గొణిగాడు.

జగన్నాథ్ ఏమీ మాట్లాడలేదు. మంత్రాలు చదువుకు పోతున్నాడు

చివరికి అక్కణ్ణుంచి లేచివెళ్ళి అతి కష్టంమీద ఓ బిందెను మోసుకొచ్చాడు. దాన్ని నితాయ్ ముందుంచి ప్రమాణం చేయించాడు.

"ఈ ధనాన్ని బృందావన్ కుందూ కొడుకు, జగన్నాథ్‌కుందూ మనమడు అయిన గోకుల్‌చంద్ర కుందూకు గాని, అతని వారసులకుగాని అందించగల వాడనని ప్రమాణం చేస్తున్నాను."

ఈ ప్రమాణాన్ని నితాయ్‌చేత అనేకమార్లు చేయించాడు జగన్నాథ్. పూజా కార్యక్రమం పూర్తయింది గుహలోకి గాలివచ్చే మార్గంలేదు. దీపం పొగతో గుహంతా నిండిపోయింది. నితాయ్‌కి భయం వేసింది.

దీపం వెలుతురు క్రమంగా సన్నగిలుతోంది. మరి కాసేపటికి దీపం ఆరిపోయింది. గుహంతా చీకటిమయమయింది. ఆ చీకట్లో ఎవరో నిచ్చెనెక్కుతున్న శబ్దం విని

పించింది. "తాతా. ఎక్కడికి కెడుతున్నావ్?" అడిగాడు నితాయ్ భయంతో.

"నే వెళ్తున్నాను. నువ్విక్కడే ఉండు నిన్నెవరూ కనుక్కోలేరు, నా మనమడు గోకుల్‌చంద్ర పేరు గుర్తుంచుకో" అన్నాడు జగన్నాథ్.

అతడు నిచ్చెన తీసివేశాడు.

నితాయ్ బిక్కుబిక్కుమంటూ, "నే నిప్పుడు మా నాన్న దగ్గరకు వెడతా" అని రోధించాడు.

జగన్నాథ్ రాతి పలకను తిరిగి మామూలుచోట ఉంచేశాడు. కిందకు వంగి, రాతిమీద చెవిపెట్టి విన్నాడు. నితాయ్ మాటలు వినిపించాయి. "నానాన్నా..." తరువాత మళ్ళీ శబ్దం వినిపించలేదు.

ఆ విధంగా కుర్రాడికి డబ్బు వప్పగించి జగన్నాథ్ ఆరాతి పలకను మట్టిలో కప్పేశాడు. దానిమీద ఇటుకరాళ్ళు పెట్టాడు. ఆపైన గడ్డి గాదం విరజిమ్మాడు. చాలా రాత్రి గడిచింది. అతడాస్థలం వదిలిపెట్టి వెళ్ళలేక పోతున్నాడు. మళ్ళీ నేలకుబంగి, చెవిపెట్టి వినడానికి ప్రయత్నించాడు. ఎక్కడో అట్టడుగున పాతాళంనుంచి రోధన శబ్దం వినిపించింది ఆశబ్దానికి నిద్రపోతున్న వాళ్ళంతాలేచి అక్కడకు వస్తారేమోనని అతనికి భయం పట్టుకుంది, మరొకమారు చెవిపెట్టి విన్నాడు. "నానాన్నా!" శబ్దం వినిపించింది.

జగన్నాథ్‌కు ఏంచెయ్యడానికి తోచలేదు; గట్టిగా నేలనుకొట్టి "ఎవరైనా వింటారు. మాట్లాడకు" అని అరచాడు.

తూరుపు దిక్కున కెంపు కాంతుల్ని వెదజల్లుతూ సూర్యుడుదయించాడు. ఇకప్పుడు జగన్నాథ్ ఆ దేవాలయాన్ని వదిలిపెట్టి, పొలాల్లోపడి నడిచిపోతున్నాడు.

అక్కడెవరో అతన్ని నాన్నా అని పిలిచారు. ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూశాడు. అతనికి తన కుమారుడు కనిపించాడు.

"నాన్నా నా కొడుకు నీ ఇంట్లో దాక్కున్నాడని తెలిసింది. వాణ్ని నేను తీసుకెళ్ళాలి" అన్నాడు బృందావన్.

జగన్నాథ్ ఈ మాటలు వినగానే స్థాణువైపోయాడు. కళ్ళప్పగించి చూస్తూ "నీ కొడుకా!" అన్నాడు

"అవును, నా కొడుకు గోకుల్. వాడిప్పుడు నితాయ్ పాల్. నా పేరు దామోదరపాల్. నీ పేరు దేశమంతా ఘనంగా పాకిపోతోంది. నీ పేరు చెబితే మాకు మంచినీళ్ళు కూడా పుట్టలేదు. అంచేత విధిలేక పేర్లు మార్చుకున్నాం" అన్నాడు బృందావన్.

జగన్నాథ్ నెమ్మదిగా తన రెండు చేతులను పైకెత్తి ధ్యానంలో పడ్డాడు. అతని చేతులు వణికాయి. మరి కాసేపటికి సృహ తప్పి బిళ్ళబీటుగా కిందపడ్డాడు.

అతనికి స్పృహ రాగానేలేచి తన కొడుకును తీసుకొని దేవాలయం దగ్గరకు వెళ్ళాడు.

వాళ్ళు లోపలకు వెళ్ళిన తరువాత, నీకేమైనా రోధిస్తున్న శబ్దం వినిపిస్తోందా? అన్నాడు తండ్రి

"నాకేం వినిపించడం లేదు" అన్నాడు బృందావన్.

"జాగ్రత్తగా విను. 'నాన్నా' అని ఎవరైనా పిలుస్తున్న శబ్దం వినిపిస్తుందా?"

"లేదు"

4

ఆ నాటినుండి జగన్నాథ్ కనిపించిన వాళ్ళనల్లా అడుగుతున్నాడు: "నీకేమైనా రోధన ధ్వని వినిపిస్తోందా?" అతన్ని చూడగానే అందరూ పిచ్చివాడని గేలి చేసేవారు.

నాలుగు సంవత్సరాల తరువాత జగన్నాథ్ మరణ శయ్యమీద ఉన్నాడు. క్రమంగా అతనికళ్ళకి ప్రపంచం కన బడకుండాపోయి, శ్వాస ఆగిపోతోతున్న సమయంలో మంచం మీద లేచి కూర్చున్నాడు. తన రెండు చేతులతోను భగవంతుణ్ణి మొక్కుతూ సణిగాడు: "నితాయ్ నిచ్చెన ఎవరు తొలగించారు?"

గాలి, వెలుతురు లేని ఆపాతాళకూపంలోంచి బయట పడ్డానికి ఆఖరికి నిచ్చెనకూడా లేకపోవడంచేత బెంబేలుపడి, బేజారెత్తి, రోధనచేస్తూ చివరకు ప్రాణాలు విడిచాడు నితాయ్.

ఆ దృశ్యాన్ని తలుచుకోగానే జగన్నాథ్ ఒళ్ళంతా కంపించింది. వెంటనే మంచంమీద పడిపోయాడు. అంతే, మళ్ళీ లేవలేదు.

సంపాదకుడు

నాభార్య జీవించి ఉన్నంతకాలం ప్రభను గురించి అసలు నేను పట్టించుకోనేలేదు. నిజం చెప్పాలంటే నేను ప్రభ మీద కంటే ఆమె తల్లిమీదనే ఎక్కువ మక్కువ చూపించే వాణ్ణి.

ప్రభ వచ్చీరాని మాటలతో ముద్దుగా మాట్లాడుతోంటే అప్పుడప్పుడు వింటూ మురిసిపోయేవాణ్ణి. వాళ్ళమ్మతో దోబూచులాడుకుంటున్నప్పుడు పాప ముఖంలో మెరిసే నవ్వును తిలకిస్తుండే వాడిని. నాకు ముద్దొచ్చినప్పుడు పాపను ఎత్తుకొని తనివితీరా ముద్దాడేవాడిని. కాని నాకు విసుగు పుట్టగానే పాపను వాళ్ళమ్మ కిందించేవాడిని. బోనులోంచి బయటబడ్డ సింహంలా పాప వాళ్ళమ్మ ఒళ్లోకి దూకేది.

కాని నా భార్య అకాల మరణంవల్ల పాప, వాళ్ళమ్మ చేతుల్లోంచి నా చేతుల్లోకి వచ్చింది. అప్పుడు పాపను నా హృదయానికి దగ్గరగా హత్తుకున్నాను.

తల్లిలేని పిల్లను అతిజాగ్రత్తగా పెంచి పెద్ద చెయ్యవలసిన బాధ్యత నామీద ఉంది. కాని నాకుమార్తె భార్య లేని తండ్రిని సంరక్షించవలసిన బాధ్యత తనదే అన్నట్టు మెలగసాగింది. ఏది ఏమైనా ఈవిషయం మాత్రం యదార్థం. ఆరు సంవత్సరాల వయస్సునుంచి ప్రభ ఇంటి యజమానురాలైంది. ఈ చిన్నారి బాలిక తన తండ్రి సంరక్షకురాలుగా ఉండడం ఎవరైనా వింటే నవ్విపోతారు కదూ! కాని ఇది మాత్రం నిజం.

నేను దాదాపుగా ఆమె చేతుల్లోకి ఒరిగిపోయాను నేను అసమర్థుణ్ణి, నిస్సహాయుణ్ణి అవుతున్నకొద్దీ ఆమె మరింత సంతోషించేది. నేను వంకిమీదనుంచి నా బట్టలు తీసుకుంటున్నా, బూట్లు తొడుక్కుంటున్నా ఆమె హక్కును నేను లాక్కుంటున్నట్టు ప్రభ బాధపడేది. ఆమె అంతకు ముందెప్పుడూ అట బొమ్మలనుకూడా అంత శ్రద్ధగా పోషించ లేదు కాని ఇప్పుడు తన తండ్రికి భోజనం దగ్గరనుంచి రాత్రి పడుకోబోయేవరకు అన్ని పనులూ తనే నిర్వహిస్తుంది. ఆమెకు పాఠాలు చెప్పేటప్పుడుమాత్రం తండ్రిగా నా అధికారాన్ని వినియోగించుకునేవాడిని.

రోజులు గడుస్తున్నకొద్దీ ననొక్క విషయం వేధించుకుతింటుండేది నా కొమార్తె కొక మంచి సంబంధం చూడాలంటే పెద్ద కట్నం ఇచ్చుకోగలిగిన స్థితిలో ఉండాలి, కాని అంత డబ్బు నేనెక్కడనుంచి తేగలను? ఆమెకు నేను చక్కగా చదువు చెప్పిస్తున్నాను. ఆమె ఒక మూర్ఖుని చేతిలో పడితే ఏం జరుగుతుంది?

ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిశ్చయించుకున్నాను. ప్రభుత్వోద్యోగం సంపాదించడానికి నాకు వయస్సు మీరిపోయింది. పోనీ ప్రయివేటుఫరంలో ఎక్కడైనా ఉద్యోగం చూసుకుందామా అంటే నాకు తెలిసినవారూలేరు ఆలోచించి ఆలోచించి చివరకు పుస్తకాలు రాయడానికి నిశ్చయించుకున్నాను.

పెదురుగొట్టానికి రంధ్రాలు పెడితే అందులో నూనె కాని, నీళ్ళు కాని నిలువ ఉండవు; కారిపోతవి కాని దానిని

పట్టుకొని ఊదితే ఏమీ ఖర్చులేకుండా సంగీతం వినిపిస్తుంది. ఇతర రంగాలలో పనికిరాని మనిషి కనీసం సాహిత్యంలో నైనా తన కృషిని కనపర్చాలి. ఎందుకూ కొరగాని మనిషి కనీసం వినోదాన్నయినా అందించాలి. ఈ ఆలోచనలతో ప్రపేరేపితుణ్ణయి నేనొక ప్రహసనం (హాస్యనాటకం) రాశాను. దాన్ని స్టేజీమీద ప్రదర్శించారు. ప్రజలంతా దాన్ని చూసి మెచ్చుకున్నారు.

ఒకసారి కీర్తి కండూతి చవిచూశాక ఆ రంగంలో ఇంకా ముందుకు వెళ్ళకుండా ఉండలేకపోయాను. నెలలతరబడి స్థిరచిత్తంతో నేను నాటకాలు రాయ నారంభించాను.

ప్రభ చిరునవ్వు నవ్వుకుంటూ నా దగ్గరకు వచ్చి గుర్తు చేసేది: "నాన్నా, స్నానంచేసే వేళయింది, లే!"

"ఇప్పుడుకాదు, వెళ్ళు. నేనిప్పుడు పని తొందరలో ఉన్నది కనపట్టంలా? నన్ను విసిగించకు' అని గదురుకునే వాణ్ణి.

వెలుగుతున్న దీపం ఒక్కసారి ఆరిపోతే ఎంతచీకటిగా ఉంటుందో అంత చీకటి ఆమె ముఖంలో పెనవేసుకునేది. నాకు తెలియకుండానే నెమ్మదిగా అక్కడనుండి వెళ్ళిపోయేది

నేను దాసీ పనివాళ్ళను తరచు తరిమివేసేవాణ్ణి. సేవకుల్ని చితక్కొట్టేవాణ్ణి. అడుక్కునేవాళ్ళు ఇంటికొచ్చి పాటలు పాడుతుంటే నేను కర్ర పుచ్చుకొని వాళ్ళ వెంటపడే వాణ్ణి. నాగది వీధిపక్కనే ఉండడంచేత దారేపోయేవాళ్ళు నా దగ్గరకొచ్చి దారి చెప్పమనేవాళ్ళు. నేను వాళ్ళను పోయి ఏట్లో కలవమనేవాణ్ణి. నేనొక అపరహాస్య నాటక ం

రాయడంలో నిమగ్నుడనై ఉన్నానన్నే విషయం ఒక్కరు కూడా గుర్తించరు కదా!

నేను కీర్తి సంపాదించినంతగా డబ్బు సంపాదించలేక పోయాను. కాని అందుకు నేనేనీ బాధ పడేవాణ్ణి కాదు.

తరువాత నాకొక అపూర్వావకాశం లభించింది. ఓహిర్‌గ్రాం అనే ఊళ్ళో ఓ ధనికుడు ఓ పత్రికను నడపటం ప్రారంభించాడు. ఆ పత్రికకు నన్ను సంపాదకుడిగా ఉండమని వేడుకున్నాడు. అందుకు నే నంగీకరించాను.

మొదట్లో బ్రహ్మాండమైన కృషిచేసి మంచి మంచి రచనలతో పత్రికను ఉత్తమంగా తీసుకొచ్చాను. నేను బజార్లో పోతున్నపుడల్లా ప్రజలు నన్ను వేలెత్తి చూపించి. నా రచనలను గురించి చెప్పుకునేవారు.

జహిర్‌గ్రాం ఊరుపక్కనే ఓహిర్‌గ్రాం ఉంది. ఆ వూళ్లో ఓ ధనికుడున్నాడు. జహిర్‌గ్రాం ఓహిర్‌గ్రామంలోని ఈ ధనికులిద్దరికీ మొదటినుంచీ బద్ధవైరం. వాళ్ళిద్దరిమధ్య ఒకప్పుడు కొట్లాటలుకూడా జరిగాయి నేనిప్పుడు అందులో ఒకరిపక్షాన చేరి పోరాడవలసి వచ్చింది నేను కేవలం హోదాకోసం అక్కడ అంటిపెట్టుకు ఉన్నానని అందరూ అనుకొసాగారు.

నా రాతలు అహిర్‌గ్రాం మీద చాల తీవ్రంగా ఉండేవి. వారి పుట్టు పూర్వోత్తరాలన్నీ ఏకరువు పెట్టి దూదే కినట్లు ఏకేకేవాడిని.

అప్పటివరకు నా రాతలు చూచుకొని నాలో నేను సవ్వుకునేవాడిని. నేనేదో ఘనకార్యం సాధించినవాడిలా నా

ముఖం మందహాసంతో తొణికిసలాడుతుండేది. అహిర్ గ్రామాన్ను గురించి నేను చులకనగా మాట్లాడుతుంటే ఓహిర్ గ్రామంవాళ్ళు పగలబడి నవ్వేవాళ్ళు. నేనప్పుడు నిజంగా గర్వపడేవాణ్ణి.

చివరకు అహిర్ గ్రామంలో కూడా ఒక పత్రిక వెలిసింది. అందులో ప్రకటించేదంతా ఉట్టి చెత్త. సాహిత్య విలువ ఏమీ ఉండేదికాదు కేవలం ఓహిర్ గ్రామాన్ను గురించిన బండ బూతులతో అది నిండి ఉండేది.

కాని నేను మాత్రం పత్రికా సాంప్రదాయ మర్యాదలను విస్మరించేవాణ్ణికాను ఎంతో హుందాగా, గుంభనంగా మృదువైన శైలిలో విమర్శలు రాసేవాణ్ణి. ఈ పత్రికా యుద్ధంలో గెలుపు నాదేనని, ప్రజలు చెప్పుకునేవారు. కాని ఉదాత్త భావాలతో, ఉన్నత శైలిలో రాయడం నా పొరపాటని తరువాత గ్రహించాను. నా ప్రత్యర్థికి ఇసుమంతా అక్కర్లేదు. కేవలం దుమ్మెత్తి పొయ్యడమే ఆ పత్రిక ప్రధాన లక్ష్యం.

నా యజమానికి నామీద కోపం వస్తోంది. నా రచనలలో ఉపయోగిస్తున్న మర్యాదకరమైన భాష ఆయనకు పేలవంగా తోచింది. బజార్లో వెళుతుంటే ఇప్పుడు ప్రజలు నా గురించేగా చెప్పుకోవడంలేదు. నా ప్రాథమిక్ అభిలాషలు నా నాటకాలన్నీ మర్చిపోయారు. నేనిప్పుడు పూర్తిగా కాలిన అగ్గిపుల్లలా ఉన్నాను.

నా మనస్సు వ్యథతో సతమత మైపోతోంది. నా మనస్సు నెంత కూడదీసుకున్నా ఒక్క వాక్యంకూడా సరిగా

రాయలేకపోతున్నాను. నా జీవితం మాధుర్యాన్ని కోల్పోయి నట్టుగా ఉంది.

ప్రభ ఇప్పుడు నన్ను చూస్తే భయపడుతోంది. నేను పిలుస్తేనేకాని లేకపోతే నాదగ్గరకు రావడానికి సంకోచిస్తోంది. ఎల్లప్పుడూ హాస్యరచనలు చేసే పండిపోయిన తండ్రికంటే ప్రాణంలేని ఆటబొమ్మ చాలా ఉత్తమమైనదని బహుశా ఆమె తలంచి ఉండవచ్చు.

ఓ రోజున అహిర్ గ్రామ పత్రిక నా యజమానిని వదిలి పెట్టి నామీద దండయాత్ర సాగించింది. నామీద చాల అసభ్యకరమైన రాతలు అందులో ఉన్నాయి. నా మిత్రులు చాలమంది నాదగ్గరకువచ్చి వాటి ప్రస్తావన తీసుకొచ్చారు. దానికి ఘాటుగా సమాధానం రాయమని సలహా ఇచ్చారు.

మా ఇంటిముందు ఓ చిన్నతోట ఉంది. సాయంత్రం వేళ చింతాక్రాంతుడనై తోడలో ఆటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. పక్షులు అప్పుడే గూళ్ళకు తిరిగి వస్తున్నాయి. ప్రశాంతమైన ఆ సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంది పక్షుల్లో రచయితలుకాని, కవులుకాని లేరు. విమర్శలు వాదోప వాదాలు అసలేరావు. నిజంగా ఆ జీవితం ఎంత మధుర మైనది?

నేను రాయనలసిన సమాధానాన్ని గురించి ఆలోచిస్తు న్నాను మర్యాదగా రాస్తే వచ్చిన నష్టమేమిటంటే అది అన్ని రకాల ప్రజలకు అర్థంకాదు. అంచేత నేనుకూడా, నా మీద దాడిచేసిన విధంగానే సమాధానం రాయదల్చు

కున్నాను. నా ఓటమిని అంగీకరించడానికి నే నెంతమాత్రం సిద్ధంగా లేను.

నే నీ నిర్ణయానికి రాగానే ఒక చిరపరిచిత కంఠం సంధ్య చీకటిలోంచి వినిపించింది మరుక్షణంలో నా అరచేతిని ఒక మృదుల హస్తం స్పృశించింది. ఆ కంఠము. స్పర్శ నాకు చిరపరిచితమైనప్పటికీ నామనస్సు సరిగా లేకపోవడం చేత గుర్తించలేకపోయాను

అవి నన్ను విడిచివెళ్ళగానే, ఆ కంఠం నా చెవుల్లో మారు మ్రోగింది: హస్త స్పర్శ గుర్తుకొచ్చింది నా కుమార్తె నెమ్మదిగా మరొకసారి నాదగ్గరకు వచ్చి మెల్లగా, "నాన్నా!" అన్నది. సమాధానంరాకపోయేసరికి నా కుడి చేయి మెల్లగా పైకెత్తి తననుదుటికినెమ్మదిగా కొట్టుకున్నది. ఆ తరువాత మారుమాటాడకుండా వెనుదిరిగి ఇంట్లోకి వెళ్ళి పోయింది.

చాలా కాలం నుండి ప్రభ నన్ను అలా పిలవలేదు. అంత స్వతంత్రంగా నా దగ్గరకొచ్చి నన్ను స్పృశించలేదు. అంచేత ఈవేళ ఆమె ప్రేమ స్పర్శ నాహృదయం తహ తహ లాడింది.

మరి కొంచెం సేపటి తరువాత ఇంట్లోకి వెళ్ళాను. ప్రభ మంచంమీద పడుకొని ఉండటం చూశాను. ఆమె కన్నులు అరమూతలు పడి ఉన్నాయి. ఏదో బాధ పడుతున్నట్లుగా ఉంది. సాయంత్రంవేళ రాలిపోయిన పుష్పంలా ఆమె మంచంమీద పడుంది.

ఆమె నుదిటిమీద చెయ్యిపెట్టి చూశాను. ఆమెకు జ్వరం వచ్చింది. నాడి వేగంగా కొట్టుకొంటోంది.

నేను పత్రికకు ఘాటుగా సమాధానం రాసే విషయాన్ని గురించి ఆలోచిస్తుండగా, జ్వర చిహ్నాలు గమనించిన నా కుమార్తె తండ్రి ప్రేమను, మార్దవాన్ని కోల్పోవడానికి దప్పికగొన్న హృదయంతో నా దగ్గరకు వచ్చిందని అప్పుడు తెలుసుకోగలిగాను.

ఆమె ప్రక్కనే కూర్చున్నాను నా కుమార్తె మాట్లాడకుండా నా చేతిని తన వెచ్చటి అరచేతుల్లోకి తీసుకొని ప్రశాంతంగా పడుకుంది.

ఇంట్లో ఉన్న జహీర్ గ్రాం, అహీర్ గ్రాం పత్రికలన్నీ తీసి దహనం చేశాను. నా మీద విమర్శకు నేనేమీ సమాధానం రాయలేదు నా ఓటమిని అంగీకరించినప్పటి ఆసంతోషాన్ని నా జీవితంలో ఎప్పుడూ పొందలేదు.

ఆమె తల్లి చనిపోగానే నాకుమార్తెను ఎత్తుకున్నాను. మరిప్పుడు ఆమెను మరొకసారి నా హృదయానికి హత్తుకున్నాను.

బహిష్కరణ

అది నిండు పూర్ణమనాటి రాత్రి. చల్లగా పిల్లవాయువులు వీస్తున్నాయి. ముఖర్జీగారి ఇంటిపక్క మామిడిచెట్టు మీద కూర్చుని కోయిల మధురంగా గానం చేస్తున్నది. ఆఇంట్లోని ఓ గదిలో హేమంత తన భార్య పక్కన కూర్చుని ఆమె జడలోని మల్లెపూల వాసనను ఆఘ్రాణిస్తున్నాడు. కుసుం కదలకుండా కూర్చుని కిటికీలోంచి వెన్నెట్లోకి తదేకంగా చూస్తున్నది. ఆమెపక్కన భర్త కూచున్నట్లు ఆమెకు స్పృహే లేదు.

మరి కాసేపటికి హేమంత తన భార్య చేతులను పట్టుకొని మెల్లగా అన్నాడు: "ఎక్కడున్నావు, కుసుం? ఆ ఊహాలోకంలోంచి విడివడి వడివడిగా నా చెంతకు రా! నా నా హృదయానికి చేరువుగా రా! ఈ రాత్రి ఎంత మధురంగా ఉందో చూడు!"

కుసుం తన దృష్టిని ఆకాశంనుంచి మరల్చింది. భర్త వైపుకు తిరిగింది. "ఈ రాత్రిని, చంద్రుణ్ని వెయ్యి ప్రక్కలుగా చెయ్యగలిగిన మంత్రం ఒకటి నాకు తెలుసు" అన్నది మెల్లగా.

"అలాగా! అయితే దయచేసి దాన్ని మాత్రం ప్రయోగించకు. ఇంకా ఏదైనా మంత్రం వారానికి నాలుగు శని వారాలు, రాత్రుళ్ళను ఆ మర్నాటి సాయంత్రంవరకూ పొడి

గించ గలిగినది గనుక ఉన్నట్లయితే చెప్పు!" అన్నాడు హేమంత.

ఇలా అని భార్యను దగ్గరగా లాక్కోవడానికి ప్రయత్నించాడు కుసుం అతనికి కొంగిట్లోంచి విడివడి అన్నది: "నా మరణశయ్యమీద మీ కొక సంగతి చెబుతానని వాగ్దానం చేసిన విషయం గుర్తుందా? చిరకాలం నుంచి చెప్పాలనుకుంటున్న ఆ విషయాన్ని ఇవ్వాళ చెళ్ళగక్కుతాను. మీ రెటువంటి శిక్ష విధించినా అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను."

హేమంత ఏదో మాట్లాడబోతుండగా అంతలో జోళ్ళ చప్పుడు వేగంగా మోగుతూ అటువైపు వస్తున్న శబ్దం విని పించింది. అతని తండ్రి హరిహర ముఖర్జీ పాదరక్షలవి ఆశబ్దం వినగానే హేమంత ముఖంలో చిరునవ్వు రేఖలు మటుమాయమయ్యాయి.

తలుపు వెనుక నిలబడి హరిహర గర్జించాడు: "హేమంతా! నీ భార్యను వెంటనే ఇంట్లోంచి గెంటెయ్యి."

హేమంత భార్య ముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళ వలికల్లో ఏమీ మార్పు కనిపించలేదు. ఆమె ముఖాన్ని చేతుల్లో కప్పుకొని అక్కడి కక్కడే అప్పటికప్పుడు తను కరిగి నీరై పోతే బాగుండునని కోరుకుంది.

కోయిలగానం ఆ గదిలో ప్రతిధ్వనిస్తోంది. కాని దాన్నెవరూ వినడంలేదు. వెన్నెలరేయి హాయిని నింపుతోంది. కాని ఆ గదిలో ఉన్నవారికి ఇప్పుడా సంగతే పట్టలేదు.

2

హేమంత గదిలోకి తిరిగివచ్చి, "విషయం నిజమేనా?" అని అడిగాడు.

"అవును" చెప్పింది కుసుం.

"మరి ఆ విషయం నాకు ముందెందుకు చెప్పలేదు?"

"చాలాసార్లు చెప్పడానికి ప్రయత్నించాను. కాని చెప్పలేక పోయాను. నేను దుర్మార్గురాల్ని."

"అసలు విషయమంతా ఇప్పుడు చెప్పు."

కుసుం నిశ్చలంగా కూర్చుని తొణకక్కుండా తన కథంతా చెప్పింది. ఆమె చెప్పింది పూర్తిగా విని హేమంత అక్కణ్ణుంచి బయటకెళ్ళాడు.

తన భర్త ఇక ఎప్పటికీ తిరిగి రాడనుకుంది కుసుం. అది ఆమెకు వింతగా తోచలేదు. నిత్య జీవితంలో జరిగే సహజ సంఘటనలా చలించలేదు. ఈ ప్రపంచము ప్రేమ ఆమెముందు నిర్వికారంగా గోచరించాయి. ఆమె భర్త తన మీద చూపించిన ఆదరణ, ప్రేమ గతించిన వాటి జ్ఞాపకాల జాడలు ఆమెను సెన్సాడుతున్నాయి. పదునైన కత్తితో ఎవరో తన హృదయాన్ని కోత పెడుతున్నట్లు బాధ పడసాగింది. అంతకు ముందే హేమంత ఆమెతో అన్నాడు: "ఎంతటి మధురమైన రాత్రి!" అదే రాత్రి ఇంకా గడుస్తోంది అదే కోకిల ఇంకా గానం చేస్తోంది. అవే పిల్లవాయువులు ఇంకా ఆహ్లాదకరంగా వీస్తున్నాయి. అదే చంద్రకాంతి తెర చిన కిటికీలోంచి గదిలోకి తొంగి చూస్తోంది.

3

ఆ రాత్రంతా నిద్రపోకుండా గడిపి, ఆ మర్నాడుదయం హేమంత పేరీశంకర్ ఘోషాల్ ఇంటికి వెళ్ళాడు.

"విశేషా లేమి టబ్బాయి?" అన్నాడు పేరీశంకర్.

హేమంత కోపంతో, వణుకుతున్న కంఠంతో బిగ్గరగా అరిచాడు: "మా కులాన్ని మంట గలిపావు మమ్మల్ని నాశనం చేశావు. దానికి నిన్ను శిక్షించాలి అతడంతకంటే మరి మాట్లాడలేకపోయాడు.

"మీరు నన్ను కులంనుంచి వెలేశారు. మీరుమాత్రం వదిలిపెట్టారా? అన్నాడు పేరీశంకర్ తాపీగా.

తన బ్రాహ్మణకోపం పేరీశంకర్‌ని వెంటనే బూడిద చేస్తుందనుకున్నాడు హేమంత. కాని అతనికోపం అతని లోనే అణగారిపోయింది. పేరీశంకర్ అతనిముందు నిశ్చలంగా, గాంభీర్యంగా కూర్చున్నాడు.

"నీకెప్పుడైనా నేను అపకారం చేశానా? అడిగాడు హేమంత వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"నిన్నో ప్రశ్న అడుగుతాను. దానికి జవాబుచెప్పు. నా కుమార్తె- నా ఏకైక కుమార్తె- నీ తండ్రికి ఏం అపకారం చేసింది? అప్పుడు నువ్వు కుర్రాడివి. బహుశా నువ్వు విని ఉండవు. ఇప్పుడు చెబుతా విను. జాగ్రత్తగా విను. రెచ్చిపోకు" అన్నాడు పేరీ శంకర్.

"మా అల్లుడు నవకాంత మా అమ్మాయి నగలుతీసు కొని ఇంగ్లండు పారిపోయినప్పటికి నువ్వు బాగా కుర్రాడివి. అయిదు సంవత్సరాల తరువాత అతడు బారిష్టరుగా తిరిగి వచ్చినప్పుడు గ్రామంలో జరిగిన గడబిడ నీకు తెలిసేఉంటుం దను కుంటాను. లేక నువ్వు కలకత్తాలో చదువుకొంటుండడం చేత ఆ విషయం తెలియకపోవచ్చు; మీనాన్న మన కులా నికి పెద్దకావడం చేత, నా కుమార్తెను తన భర్త దగ్గరకు పంపిస్తే నన్ను కులంలోంచి వెలేస్తానన్నాడు. అప్పుడు నేను మీనాన్న కాళ్ళమీదపడి వేడుకున్నాను. 'అన్నయ్యా! ఈ సారికి నన్ను రక్షించు. అల్లుడుచేత ఆవుపేడ తినిపించి ప్రాయ శ్చిత్తం చేయిస్తాను. అతణ్ణి తిరిగి కులంలోకి తీసుకో" అని వేడుకున్నాను కాని మీనాన్న రాతిగుండె కరగలేదు. మరి నా మట్టుకు నేను నాపైకైక కుమార్తెను విడిచిపెట్టలేను. అంచేత నా స్వగ్రామానికి, బంధువులకు ఓ సలాంపెట్టి కల కత్తా చేరుకున్నాను. అక్కడకూడ కష్టాలు నన్ను తరుము కొచ్చాయి. నా మేనల్లుడి వివాహానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తే, మీనాన్న పెళ్ళికూతురు తరపు వారికి పురెక్కించి ఆ సంబంధం కాస్తా చెడగొట్టాడు. అప్పుడు నేనో ప్రతిజ్ఞ తీసు కొన్నాను. నానరాల్లో ఒక్కబొట్టు బ్రాహ్మణ రక్తం ప్రవ హిస్తున్నా దానికి ప్రతీకారం చేసితీరుతానని శపథం తీసు కొన్నాను. ఇప్పుడు నీకు విషయం కొంతవరకు అర్థమైందను కుంటాను. ఏం? మరి కాసేపాగితే పూర్తికథంతా విందువు గాని! అది బలే రసవత్తరంగా ఉంటుంది."

"నువ్వు కాలేజీలో చదువుతున్నప్పుడు మీ గదిపక్కని విప్రదాస్ చటర్జీ ఇల్లుండేది. పాపం, అతడిప్పుడు మరణించాడు. అతని ఇంట్లో కుసుం అనే ఓ బాల వితంతువు ఉండేది. ఆమె కాయస్థుల పిల్ల. తలిదండ్రులు లేరు. ఆమె చాల అందంగా ఉండేది. కాలేజీ విద్యార్థుల దృష్టిలో పడకుండా ఆమెను ఉంచాలని ముసలి బ్రాహ్మణుడు అనుకునేవాడు. కాని యవ్వనం వచ్చినవాళ్లు ముసలివాళ్ళ కళ్ళల్లో దుమ్ము కొట్టడం ఏమంత పెద్ద కష్టమైన పనికాదు. ఆమె తరచుగా బట్టలు ఆరేయడానికి డాబామీదికి వెళ్లేది. మరి నువ్వుకూడా మీ డాబామీది కెక్కి అక్కడే చదువుకునేవాడివి వనుకుంటాను. అక్కడ మీ ఇద్దరూ మాట్లాడుకునేవారో లేదో నాకు తెలియదు గాని ఆమె ప్రవర్తనను బట్టి ముసలివాడు కొంచెం అనుమాన పడ్డాడు. ఆమె ఇంటి పనులు సరిగా చేసేదికాదు. మతిమరుపు ఎక్కువైంది. ఎప్పుడూ పూజా ఫునస్కారాలు చేస్తూ నిద్రాహారాలు మాని, ఎండి వరుగులా అయింది. ఒకోసారి ఏకారణంలేకుండానే ముసలివాని ముందు కూర్చుని కళ్ళనిండా నీళ్ళు పెట్టుకునేది

మీ ఇద్దరూ డాబాలమీద తరచుగా ఒకరొకరు చూసుకునేవారనే విషయం చివరికతడు తెలుసుకోగలిగాడు. నువ్వు కాలేజీకూడా మానేసి, మధ్యాహ్నం పూట డాబామీద, చేతిలో పుస్తకం పెట్టుకొని ఒంటరిగా కూర్చుని చదివేవాడివి. విప్రదాసు నా దగ్గరకొచ్చి విషయమంతా విప్పిచెప్పాడు. నన్ను సలహా అడిగాడు. 'మావా! నువ్వు చాలా రోజుల్నుంచి కాశీయాత్రకు వెళ్ళాలనుకుంటున్నావు

కదూ! నువ్విప్పుడు వెళ్ళడం మంచిది. ఆమెను నాఅధీనంలో ఉంచు. జాగ్రత్తగా చూస్తాను' అన్నాను.

"అతడు కాశీవెళ్ళాడు. నేనామెను శ్రీపతి చటర్జీ ఇంట్లో పెట్టాను అతడే ఆమె తండ్రిగా నలుగురికీ చెప్పాను. తరువాత జరిగిందేమిటో నీకు తెలిసిందే. మొదట్నుంచీ చివరిదాకా నీకీ విషయమంతా చెప్పి నేనివ్వాళ ఉపశాంతి పొందుతాను. ఇదంతా ఓ ప్రణయచరిత్రలా ఉంది. అవును కదూ? ఇదంతా పుస్తకంగారాసి అచ్చు కివ్వాలనుకుంటున్నాను. కాని నేను రచయితను కాదు. ఈ రంగంలో మా మేనల్లుడికేదో కొంత అభిరుచి ఉందంటున్నారు. నాకీపుస్తకం రాయడానికి అతన్ని తీసుకొస్తాను. ఈ కథాంతం నాకు తెలియదు. కనుక నువ్వు అతనికి కొంచెం సాయపడాలి."

పేరీ శంకర్ చెప్పిన ఈ చివరి విషయాలను పట్టించుకోకుండా హేమంత అడిగాడు; "ఈ పెళ్ళికి కుసుం అభ్యంతరం పెట్టలేదా?

"ఇది చెప్పడం కష్టం. స్త్రీల మనస్సు లెలా ఉంటాయో నీకు తెలుసు. వాళ్ళు 'కాదు' అని చెప్పారంటే అది 'అవును'నన్నమాట. కొత్త ఇంటికి వెళ్ళింతరువాత మొదట్లో ఆమె నిన్ను చూడక పిచ్చిదై పోయింది. ఎలాగో నువ్వుకూడా ఆమె కొత్తి చిరునామా సంపాదించి, కాలేజీకి వెళ్ళేదారిలో శ్రీపతి ఇంటిముందు ప్రదక్షిణలు చేసేవాడివి. నీదృష్టి ప్రేమి డెన్స్ కాలేజీమీద ఉండేదికాదు. నీకళ్ళు ఓఇంటి గవాక్షాలవైపు వెదకేవి. మీ ఇద్దర్నీ చూసి నాకు జాలివేసింది.

ఓమూల నీ చదువు పాడైపోతోంది. మరో మూల ఆమె పరిస్థితి మరీ జాలికరంగా ఉంది

"ఓ రోజున కుసుంను పిలిచి అడిగాను. 'అమ్మాయీ! నే చెప్పేది జాగ్రత్తగా విను. నే ముసలివాణ్ణి. నా ముందు సిగ్గుపడకు. నీ హృదయంలో ఎవర్ని కోరుకుంటున్నావో నాకు తెలుసు. అతగాడి పరిస్థితి కూడా నీలాగే ఉంది. మీ ఇద్దరికీ పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను!ఇలా అనగానే కుసుం కళ్ళనిండా నీళ్ళు పెట్టుకొని అక్కణ్ణుంచిపరుగెత్తుకుపోయింది. ఇది జరిగిం తరువాత చాలా రోజులకు ఓనాడు నేను శ్రీపతి ఇంటికి వెళ్ళాను. కుసుంను పిలిచి నీకు సంబంధించిన విషయాలను ఆమెతో చర్చించాను. నెమ్మదిగా ఆమె సిగ్గును పోగొట్టడంలో విజయం పొందాను. చివరికి పెళ్ళి చెయ్యడానికి పూనుకుంటానని చెప్పగా ఆమె అన్నది 'ఎలా జరుగుతుంది? ఫర్వాలేదు నినోన్ని బ్రాహ్మణకన్యగా చెప్పి వివాహం జరిపిస్తాను. చాలాసేపు చర్చ జరిగిం తరువాత నువ్వందుకు ఒప్పుకుంటావో లేదో అని అన్నదామె. 'ఏమిటిదంతా? కుర్రాడు ప్రేమపిచ్చలో పడ్డాడు. ఇప్పుడివన్నీ అతనికి చెప్పి ప్రయోజనం ఏమిటి? వివాహం అయిం తరువాత అన్ని విషయాలు వాటంతటి కవే సర్దుకుపోతాయి. అసలావిషయం బయటికి పొక్కగల అవకాశం లేనప్పుడు ముందుగానే చెప్పుకొని జీవితాన్ని దుఃఖభాజకం చేసుకోవడం ఎందుకు?

ఈ ఎత్తుగడకు కుసుం అంగీకరించిందో లేదో నాకు తెలియదు. ఒక్కోసారి ఏడుస్తూ ఉండేది. మరోసారి మౌనంగా ఉండేది. 'అయితే ఆ విషయాన్ని ఇక్కడితో ఆపు

చేద్దాం' అని నేనన్నప్పుడు ఆమెలో అశాంతి చిహ్నాలు కని పించేవి. పరిస్థితులిలా ఉండగా నేను శ్రీపతిని పెళ్ళిప్రయత్నం మీద సీదగ్గరకు పంపించాను. ఒక్కక్షణంకూడా ఆగకుండా నువ్వందుకు అంగీకరించావు. అంతా సవ్యంగా జరిగిపోయింది

"ముహూర్తం నిర్ణయించబోయే ముందు కుసుం తిరిగి మళ్ళీ మొదటికి వచ్చింది. 'ఈ పెళ్ళి వొద్దు, మావయ్యా,' అన్నది నాతో. 'ఏమనుకుంటున్నావమ్మాయి? అంతా నిర్ణయమైపోయిం తరువాత ఇప్పుడు మనమెట్లా వెనక్కి తగ్గుతాం?"

"నే చచ్చిపోయానని పుకారు పుట్టించండి. నన్నెక్కడికైనా పంపించండి" అన్నదామె.

"అప్పుడా యువకుడి సంగతేమిటి? అతడు తన చిర కాల కోరిక రేపో మాపో తీరనున్నదని ఉవ్విళ్ళూరుతుంటే ఇన్నాళ్ళ నీచావువార్త అతని చెవిని పడెయ్యమంటావా? దాని ఫలితంగా అతని మరణవార్త రేపు నీకు నేను అందచెయ్యాల్సి ఉంటుంది. అదే సాయంత్రం నీ చావుకబురు నాచెవిని పడుతుంది. అమ్మాయీ! ఈ వయస్సులో నేను ఓస్త్రీ హత్యను, బ్రాహ్మణ హత్యను నా చేతులారా చెయ్యగలననుకుంటున్నావా?"

ఎలాగైతేనేం అనుకున్న ప్రకారం పెళ్ళిజరిగిపోయింది. నా తలమీద నుంచి పెద్దబరువు దిగిపోయిందనిపించింది. ఇక ఆ తరువాత జరిగిందేమిటో నీకే తెలుసు."

"మమ్మల్ని ఇంతగా అవమానపర్చింది చాలలేదా? మరిప్పుడా రహస్యం ఎందుకు బయటపెట్టావు?" అడిగాడు హేమంత చాలసేపు నిశ్శబ్దంగా కూర్చున్న తరువాత.

పేరీశంకర్ నిదానంగా, నిశ్చలంగా అన్నాడు. "నీ చెల్లెలి పెళ్ళిక ఏర్పాట్లన్నీ జరిగాయని తెలుసుకోగానే నాలో అనుకున్నాను: 'సరే. ఇప్పటికి నేనో బ్రాహ్మణుని కులాన్ని కల్తీచేశాను. అదలా చెయ్యవలసి చేశాను. ఇప్పుడింతో బ్రాహ్మణకులం ప్రమాదంలో పడింది. ఈసారి దీన్ని రక్షించడం నావిధి.' అంచేత నేను వాళ్ళకి, నువ్వు శూద్రుని కూతుర్ని పెళ్ళి చేసుకున్నావని, అవసరమైతే దాన్ని నిరూపిస్తానని రాశాను."

"ఇప్పుడు నేనామెను బహిష్కరిస్తే అమె గతేమిటి? నువ్వామెను పోషిస్తావా?" తనను తాను అదుపులో పెట్టుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తూ అడిగాడు హేమంత.

"నా కర్తవ్యమేమిటో నేను నెరవేర్చాను. భర్తల చేత బహిష్కరింపబడ్డ భార్యలను కాపాడడం నా కర్తవ్యం కాదు. లోపల ఎవరైనా ఉన్నారా? హేమంత బాబుకు ఓ గ్లాసుడుషరబత్ చేసి అందులో కాస్త ఐస్ వేసి తీసుకురండి!

ఆతిథ్యాన్ని స్వీకరించకుండానే హేమంత అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

4

ఆ రాత్రి చీకటిగా ఉంది. నక్షత్రాలేమీ గానంచెయ్యడం లేదు. ముఖర్జీగారి ఇంటి పక్కనున్న మా మిడిసెట్టు చీకట్లో కొరివిదయ్యంలా ఉంది. పిల్లగాలులు వీచడంలేదు. ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి.

పడగ్గదిలో దీపంలేదు. హేమంత మంచంపక్కని కూచుని కిటికీగుండా బయట చీకట్లోకి చూస్తున్నాడు. కుసుం తనభర్త పాదాలను రెండుచేతుల్తో గట్టిగా పట్టుకొని నేల మీద పడుకొంది.

జోళ్ళ చప్పుడు మళ్ళీ వినిపించింది. తలుపు దగ్గర కొచ్చి హరిహరముఖర్జీ అన్నాడు 'నీకు చాలా వ్యవధి ఇచ్చాను. ఇంతకంటే ఎక్కువివ్వను. ఆమెను ఇంట్లోంచి వెళ్ళగొట్టు!

ఇది వినగానే కుసుం భర్త పాదాలను తన చేతుల్తో మరింత గట్టిగా పట్టుకొంది. వాటిని ముద్దాడింది; నుదురుతో తాకింది.

హేమంత అక్కణ్ణుంచి లేచి తలుపుదగ్గరకు వెడుతూ అన్నాడు: "నాభార్యను వెళ్ళగొట్టను."

"ఏమిటి! నీకులాన్ని వొదులుకుంటావా?" గర్జించాడు హరిహర్.

"నే కులాన్ని లెక్కచెయ్యను" హేమంత ప్రశాంతంగా జవాబు చెప్పాడు.

"అయితే నిన్నుకూడా వెలేస్తాను."

ఆదర్శం

మా ఇంటిపక్క నివశించే బాల వితంతువుపూర్ణ నాకు భక్తి ప్రపూరితమైన సద్భావం సదా ఉండేది. అలా అని నా మిత్రులకు చాలసార్లు చెప్పాను. నాలో నేనుకూడా అలాగే అనుకున్నాను నాకు అత్యంత సన్నిహితుడైన నవీన్ కూడా నా మనస్థితిని ఎరగడు. నా హృదయంలో అట్టడుగున గుప్తంగా దాచుకున్న భావాలను చూసుకొని గర్వించే వాడిని. ఆమె అకాల సమయంలో భూమిమీద పడ్డ సేఫాలీ పుష్పంలా ఉంది కాని ఆమె స్వర్గానికి నిర్దేశింపబడింది.

మనోభావం పర్వత ప్రవాహంలాంటిది. అది పుట్టిన చోట ఉండమంటే ఉండదు. కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంది. నాభావాలను గేయాలలో పొందుపరచడానికి ప్రయత్నించేవాడిని. కాని నాకలం భక్తిప్రపూరితమైన సద్భావాన్ని భ్రష్టు చెయ్యడానికి మాత్రం మొరాయించేది.

ఇదే సమయంలో నా మిత్రుడు నవీన్ గేయాల పిచ్చలోపడి కొట్టుకుంటున్నాడు అతనికి గేయాలు రాయడం అదే. ప్రథమం. యతిప్రాసలు తెలియవు. అయినప్పటికి అతడు రాయడం విరమించలేదు

చివరికతడు నా సహాయాన్ని అర్థించాడు. అతని గేయ ఇతివృత్తం బహు పురాతనమైంది. అతని గేయాలన్నీ ప్రేయసిని సంబోధిస్తున్నాయి. అతని వీపుమీద మృదువుగా తట్టి అడిగాను: "ఇంతకీ అదివిడెవరు?"

"నేనింకా చూళ్లేదు" అన్నాడు నవీన్ నవ్వుతూ.

అతని గేయాల్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికి నేను చాలా శ్రమ తీసుకోవలసివచ్చింది చివరికవి నా గేయాల్లాగా తయారై కూర్చున్నాయి.

నవీన్ ఆశ్చర్యంతో అన్నాడు; "నే చెప్పదలుచుకున్న భావాలు అవే కాని చెప్పలేకపోయాను. ఈ ఉదాత్తమైన భావాలనన్నీ నువ్వెలా సంతరించగలిగావు?"

"అవి నా ఊహా లోకంలోంచి వస్తాయి." కవిలాసమూ ధానం చెప్పాను.

"అవును, నిజమే!" అని తల ఊపాడు నవీన్.

ప్రేమోన్మాద నాకున్న పవిత్రమైన భావాలను కాగితం మీద రూపొందించడం ఇదే ప్రథమం. నవీన్‌ను ఒక తెరగా అడ్డుపెట్టుకొని నా భావాలనన్నీ ఈ గేయాలలో మూసి పోశాను.

చివరకు నవీన్ అన్నాడు: "ఈ గేయాలు నీవి. వాటిని నీ పేరుమీదుగానే ప్రచురింపజేద్దాం."

"వెర్రివాడా! అవి నీవేనోయ్. నేను అక్కడక్కడ ఒకటి రెండు మాటలు చేర్చానంతే" అన్నాను.

నవీన్ మారు మాటాడలేదు.

నా దృష్టిని అప్పుడప్పుడు మాత్రమంటిపక్క కిటికీవైపుకు సారించేవాడిని. నామాటలు ఎవరికోసమో గాలిస్తుండేవి. ఊహాజగత్తులోని ఒక తేజోవంతమైన కాంతి నాదృష్టిపథంలో మెరసి నాభావాలను ఔళనం చేసేది.

ఓ రోజున నేను ఆశ్చర్యపోయాను. నాకళ్ళను నేను నమ్మలేకపోయాను. అది ఒక వేసవి సాయంత్రం వడగాలి తీవ్రత ఇంకా తగ్గలేదు. ఆకాశంలో నల్లటిమేఘాలు గుమి గూడుకుంటున్నాయి. అస్తమిస్తున్న సూర్యకిరణాలు వింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి. ఆ సుందర ప్రకృతి రామణీయతను తిలకిస్తూ మా ఇంటిపక్క బాల వితంతువు ఆకాశంలోకి నిర్నిమేషంగా చూస్తోంది. చిరకాలం నుంచి నిరీక్షిస్తున్న నేను, ఆమె విశాలమైన నల్లటి సుందర నయనాలను సుదూరంనుంచి వీక్షించగలిగాను. కడలేని ఆ వీక్షణ స్వర్గ ద్వారాలవైపు నిర్దేశింపబడలేదు. మబ్బుల్లో వేగంగా ఎగిరిపోతున్న పక్షిలా నా మనోభావాలు పరుగిడుతున్నాయి. ఒక మానవ హృదయస్పందన టపటపలు నాకు టకటకా వినవస్తున్నాయి

వర్ణించలేని ఆ దృక్కులను వీక్షించిన పిమ్మట నా హృదయం సంతృప్తితో నిండిపోయింది. కేవలం ప్రయోజన రహిత గేయాలను సరిదిద్దడంలోనే నేను సంతృప్తి చెందలేదు. ఒక ప్రయోజనకరమైన, నిర్మాణాత్మకమైన పథాన్ని చేపట్టాలనే నిశ్చయానికి వచ్చాను దేశంలో వితంతువివాహాలను ప్రోత్సహించడానికి నడుంకట్టాను. కేవలం ఈ సమస్యమీద రాతలురాసి, ప్రసంగాలు చెయ్యడమేకాకుండా ఇందు నిమిత్తం కొంతధనాన్ని కూడా వెచ్చించడానికి సంసిద్ధుడనయ్యాను.

నవీన్ నాతో వాదనలోకి దిగేవాడు. "శాశ్వితవైధవ్యంలో పవిత్రత, సుందరత, ఏకాగ్రత నిబిడీకృతమై

ఉన్నాయి. పునర్వివాహం ఆ సుందరతను అపవిత్రం చెయ్యదూ?" అన్నాడు.

ఈ రకమైన ఒంటెత్తుదృక్కృఛంతో మాట్లాడేవాళ్ళను చూస్తే నాకు వొళ్ళుమండుతుంది. కరువుకాలంలో సుష్టుగా భోంచేసిన ధనికుడు, ఆకలితో అలమటిస్తూ చావడానికి సిద్ధంగావున్న మనిషికి పువ్వులవాసన చూపి, పక్షులపాటలు వినిపించి ఆకలి తీర్చుకోమంటే ఎలాఉంటుంది? అలాంటి వాళ్ళను గురించి మనమేం అనుకోవాలి? నేను కొంచెం కోపంతో అన్నాను. "ఇలాచూడు నవీన్! ఒక శిథిలగృహం చిత్రకారుడికి అందంగా అగుపించవచ్చు. కాని ఇళ్ళు చిత్రకారుల ఆనందంకోసం కట్టరు. అందులో నివశించడానికి నిర్మించుకుంటారు. చిత్రకారులకు వ్యధకలిగినా వారు ఇళ్ళు మరమ్మత్తు చేయించుకుంటారు. సుదూర కోణంలోంచి పరికించి వైధవ్యాన్ని సుందరభావాలతో సమ్మిళితంచేసే ముందు ఒక విషయం ఆలోచించు. వైధవ్యంలో ఒకమానవ హృదయం వ్యధతో, కాంక్షతో స్పందనచేస్తుందని మాత్రం గుర్తించుకో."

నవీన్‌తో వాదించడం లాభంలేదనుకున్నాను. కాని నాచిన్న ప్రసంగం పూర్తయ్యేసరికి ఒక్కసారి సాలోచనగా నిట్టూర్చి నాతో పూర్తిగా ఏకీభవించాడు. ఇంక నేను వాదించవలసిన అవసరం లేకపోయింది.

ఈసారి చాలారోజులు గడిచాక నవీన్ నాదగ్గరకు వచ్చాడు. నేనేమైనా సహాయంచేస్తే తను ఒక వితంతువును వివాహం చేసుకోవడానికి సిద్ధంగాఉన్నట్లు చెప్పాడు.

నా సంతోషానికి మేరలేదు. నేనతన్ని గాఢంగా ఆలింగనం చేసుకున్నాను. పెళ్ళికోసం కావలసిన డబ్బంతా సర్దుతానని చెప్పాను. ఇకప్పుడు నవీన్ తనకథ చెప్పకొచ్చాడు.

నవీన్ ప్రేయసి ఊహాలోకంలో లేదనిమాత్రం తెలుసుకున్నాను. నవీన్ చాలారోజుల నుంచి ఓ విత్తంతువును చూడసాగాడు. ఆమె కిటికీముందు నిలబడి శూన్యదృక్కులతో విన్నిర్మలాకాశం కేసి చూస్తుండేది. అప్పుడు నవీన్‌లో ఏదో పరిపూర్ణమైన ఆనందం ఆవరించి, మరో ప్రపంచపు పొలిమేరల్లోకి పయనించేవాడు. నా గేయాలు, నవీన్ గేయాలు ప్రచురితమయ్యే పత్రికలు ఆమె చేతికందేవి. ఆ గేయాల ప్రభావం ఆమెమీద ప్రసరించింది

నవీన్ బహుజాగ్రత్తగా తన ప్రేమను వ్యక్తీకరింపజేశాడు. ఆమె పత్రికలు చదువుతుందని మొదట్లో అనుకోలేదు. ఇలాఅని నవీన్ నాతో అన్నాడు. ఆమె సోదరుని పేరుతో తన చిరునామా లేకుండా పత్రికలను పోస్టుచేసేవాడు నవీన్. ఇలా చెయ్యడంలో ఆత్మసంతృప్తి మినహా ఆతనికి మరే అభిప్రాయమూలేదు. క్రమంగా ఆమె సోదరునితో పరిచయభాగ్యం ఏర్పరచుకొన్నాడు. ప్రేయసికి ఆప్తులై నవారితో పరిచయం చేసుకోవడానికి ప్రియులెప్పుడూ తహతహలాడటం సహజమేకదా!

ఆ తరువాత కొంతకాలానికి ఆమె సోదరుడికి జబ్బు చేసింది. ఆ సందర్భంలో వారిద్దరికి సాన్నిహిత్యం ఏర్పడింది. అతని గేయాలగురించిన చర్చలతో కాలం దొర్లిపోతుండేది.

ఆ మధ్యవాదంలో నాతో ఓడిపోయింతరువాత నవీన్ వితంతువివాహం చేసుకుతీరాలనే నిశ్చయానికి వచ్చాడు. మొదట్లో అందుకామె అంగీకరించలేదు నా వాదనలోని మాటల్ని, అవసరమైతే ఒకటి రెండు అస్త్రాలుల్ని ప్రయోగించి ఆమెను చివరకు ఒప్పుకునేట్లు చేశాడు. అందుకోసం ఇప్పుడు కొంతడబ్బు కావలసివచ్చింది

"పైకం ఇప్పుడే తీసుకెళ్ళు" అన్నాను.

కాని నవీన్ చెప్పుకుపోతున్నాడు. "ఉద్యోగం సద్యోగం లేకుండా మరి మేం జీవించేదెలా?"

నేను మారుమాటాడకుండా చెక్కురాసి అతనిచేతిలో ఉంచాను. "ఇంతకీ ఆమె ఎవరు? నీమూర్ఖానికి అడ్డువస్తానని అనుకోకు. ప్రమాణంచేసి చెబుతున్నాను. ఆమెకు నేనేమీ గేయాలు రాయనులే. ఒకవేళరాసినా ఆమె సోదరునిపేర పంపించను. నేరుగా నీకే పంపుతాను" అన్నాను.

"నీపోటీకి వెరసికాదు ఇంతవరకూ ఆమెపేరును బయట పెట్టంది. ఆమె ఈ విషయాన్ని ఎవరితోనూ చెప్పవద్దని ప్రార్థించింది. ఇప్పుడంతా సవ్యంగా పరిష్కారమైపోయింది. ఆమె మీఇంటిపక్కన పంతొమ్మిదో నంబరు ఇంట్లోఉంటుంది అన్నాడు.

నా హృదయం ఇనపపెనం అయినట్లయితే పగిలిపోయి ఉండేది. "అయితే పునర్వివాహానికి ఆమెకేమీ అభ్యంతరం లేదన్నమాట" అన్నాను తేరుకొని.

"ఇప్పుడేం లేదు" నవీన్ నవ్వుతూ చెప్పాడు.

vaaradhionline.com

vaaradhionline.com